సంపుటి: 46
సంచిక : 5

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాసపత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

జూన్, 1988

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

Blank Page

సంపుటి: 46
సంచిక : 5

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

జూన్, 1988

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-237

[ఫలితాలు]

ఏప్రెల్ '88 నెల "అపరాధ పరిశోధనపోటీ-237" కి సరియైన సమాధానాలు:

1. ఆంధ్రప్రదేశ్
2. శాంతిదళం
3. నేరస్థులు
4. సింహం
5. ఇండియా.

పై జవాబుల ప్రకారం నలుగురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెలనుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) డాక్టర్ పి.వి.కె. రావ్
"మృదుల"
నాజరుపేట, తెనాలి—522 201.

(2) శ్రీ వై. శ్రీనివాస్‌కుమార్,
టైప్-2, బ్లాక్ నెం-13,
క్వార్టర్ నెం-323, సాలిగ్రామపురం,
విశాఖపట్టణం—530 024.

(3) డాక్టర్ ఎమ్.ఎ. నజీర్, MBBS,
సిద్దీక్ నర్సింగ్ హోమ్, గణపతిరావు రోడ్,
విజయవాడ—520 001.

(4) శ్రీమతి యన్. ఉషానంద్,
టి 2-4183 వ సెక్టర్ కాలనీ,
గోదావరిఖని—505 211.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. పెళ్ళిదోపిడీ!—వసుంధర
23. మూడో ప్లాన్—బొమ్మిడి అచ్చారావు
37. రక్షణ కవచాలు—ఫణిబాబు
45. పవిత్రురాలు—జొన్నలగడ్డ రామలక్ష్మి
64. నైట్ డ్యూటీ నర్సు—యస్.డి.వి. అజీజ్
80. ఫాలనేత్రం (సీరియల్)—వి.యస్. రావ్
124. ఎలక్ట్రిక్ దున్న—కె.వి.యస్.ఎన్. మూర్తి
136. అమృతం తాగిన రాత్రి—సరసి
158. నగరంలో నేరగాళ్ళు—(సీరియల్) ప్రతాపరవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

3. బూతుబొమ్మ—వి. యస్. రావ్
51. సిద్ధేంద్రస్వామి భక్తులు—వసుంధర
88. గాంగ్ వార్—ఫణిబాబు
157. రాక్షసవేట (సీరియల్)—వాణిశ్రీ

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

పెళ్లి దోపిడీ!

వసుంధర

అప్పుడే స్నానంచేసి బట్టలు మార్చుకుంది సుభద్ర. ఆకు పచ్చ చీర, నల్లజాకెట్, ఎర్రబొట్టు, పచ్చని ఛాయలలో ఆమె రంగుల హరివిల్లులా కనపడుతోంది. ఆమె జుత్తు సరిచేసుకుంటూండగా గదిలో ప్రవేశించాడు ఆదిశేషయ్య.

అద్దంలో ఆయన ప్రతిబింబం చూసి వెనక్కి తిరిగింది సుభద్ర.

"ఏమిటమ్మా—అప్పుడే ముస్తాబయ్యావు?" అన్నాడాదిశేషయ్య ఆమెను చూసి ఆశ్చర్యపడుతూ.

"అదేంటి నాన్నా—ఆఫీసుకు టైమవుతోంది. ఇంకా ఆలస్యం చేశావని నేననుకుంటూంటే నువ్వేమిటి—అప్పుడే అంటున్నావు?" అంది సుభద్ర.

"ఈ రోజాఫీసేంటమ్మా — సెలవు పెట్టలేదా నువ్వు?"

"సెలవెందుకు?"

"పెళ్ళివారొస్తున్నారు. అమ్మ చెప్పలేదా?"

"చెప్పింది. కానీ వాళ్ళొచ్చేది ఆరింటికి. నే నాఫీసు నుంచి అయిదింటికల్లా వచ్చేస్తాను...."

"బాగుందమ్మా—ఆఫీసు నుంచి జిడ్డు మొహంతో వస్తావు. తోటకూర కాడలా వాడిపోయి వస్తావు. పెళ్ళి కూతురంటే అప్పుడే విరిసిన పువ్వులా ఉండాలి—"

"పువ్వు పూజకోసం అనుకునేవాళ్ళు దాని అందం చూస్తారు. వచ్చేవాళ్ళు చూసేది నన్ను కాదు. నీ డబ్బుని...."

"నువ్వు ఇలాంటి విషయాలాలోచించకూడదు. అవన్నీ మా పెద్దాళ్ళ కొదులు. పెళ్ళిచూపులు కాగానే అబ్బాయి నచ్చాడో లేదో చెప్పు. నీ కతడు నచ్చితేనే ఈ పెళ్ళి జరుగుతుంది..."

తండ్రి మాటలు విని సుభద్ర అదోలా నవ్వింది. ఆదిశేషయ్య ఆమె నవ్వు చూసి తడబడ్డాడు.

"నేనుద్యోగం చేస్తున్నాను. ప్రస్తుతం నా జీతం నెలకు వెయ్యిరూపాయలు. ఇదింకా పెరుగుతుంది తప్ప

తగ్గదు. పెళ్ళయ్యాక నా జీతం నా భర్తకే తప్ప నాకు చెందదు. అటువంటప్పుడు నా పెళ్ళికి నేను కట్నమెందు కివ్వాలి? కట్నమడిగే మగాడంటే నా కిష్టంలేదు ...." అని సుభద్ర తల్లికి చెప్పింది. ఆ మాట లాదిశేషయ్యాను చేరాయి.

సుభద్ర అభీష్టం తెలిసేక కూడా ఆయన ఈ సంబంధం చూశాడు. కట్నం పాతికవేలకు తగ్గదని తెలిసేకనే మగ పెళ్ళివారు చూపులకు వస్తున్నారు. పిల్ల నచ్చితే లాంఛ నాల గురించి మాట్లాడుతారు.

సుభద్ర నవ్వుకు ఆదిశేషయ్య తడబడ్డానికది మొదటి కారణం.

సుభద్ర ఆఫీసులో మధు అనే సహోద్యోగి ఉన్నాడు. మనిషి అందంగానూ, చలాకీగానూ ఉంటాడు. అరమరి కలు లేని మనిషతడు. అతడు సుభద్రను ప్రేమించాడు. సుభద్ర శాకాహారి అని తెలిసి అతడు మాంసాహారాన్ని విడిచిపెట్టాడు. సుభద్రకోసం అతడు సిగరెట్లు, సారా— రెండూ మానేశాడు. అలాగని వాళ్ళిద్దరూ పెద్దగా కలిసి తిరిగిందీ ఏమీలేదు. ఆఫీసులో లంచవర్లో మాట్లాడుకుం టారు.

మధు ఆదిశేషయ్యాను కలుసుకుని తన అభీష్టం చెప్పాడు. అతడి కులం తెలియకపోతే ఆదిశేషయ్యకతడు నచ్చేవాడే! రెండు కులాలూ కలవని కారణంగా ఆది శేషయ్య ఆ సంబంధాన్ని తిరస్కరించాడు.

సుభద్ర పెళ్ళి గురించి తలిదండ్రుల నెదిరించాలను కుంది. మధు అందుకంగీకరించలేదు.

"మనది తాత్కాలిక ఆకర్షణ కాపచ్చు. పెద్దల ఆశీ ర్వాదంలేని పెళ్ళి మనకు వద్దు—" అని అతడు కచ్చి

తంగా చెప్పేశాడు.

స్త్రీని వ్యక్తిగా గౌరవిస్తూ, పైసా కట్నం లేకుండా జీవిత భాగస్వామిని తెచ్చుకోవాలనుకున్న అతడి సంస్కారానికి సుభద్ర ముగ్ధురాలయింది. ఇంట్లో ఈ వివాహం గురించి ఎంతగానో వేడుకుంది. ఎవ్వరూ వినలేదు. ఇప్పుడు ఆదిశేషయ్య—"అబ్బాయి నీకు నచ్చితేనే ఈ పెళ్ళి జరుగుతుంది—" అంటున్నాడు. అందుకు బదులుగా సుభద్ర నవ్వింది.

ఆదిశేషయ్య తడబడడూ మరి!

తండ్రివంకే చూస్తూ సుభద్ర తన వ్యానిటీబాగు సద్దుకోసాగింది.

"ఎందుకమ్మా బాగు సద్దుకుంటావు? ఈరోజు నువ్వాఫీసుకు వెళ్ళొద్దు...."

"అనవసరంగా సెలవెందుకు వృధా? నేను వచ్చేస్తానంటున్నాగా...."

ఆదిశేషయ్య చిరాగ్గా—"నేవెందుకు చెప్పానో విను. ....ఈ రోజు నువ్వాఫీసుకు వెళ్ళడానికి వీల్లేదు—" అన్నాడు.

సుభద్ర నిట్టూర్చింది. తన స్వతంత్రమెంతో ఆమెకు తెలుసు.

"అన్నీ నా యిష్టమే అంటావు. కానీ ఒక్కటంటే ఒక్కటి నా యిష్టప్రకారం జరుగుతుందా యీ యింట్లో— !"

ఈ మాటలు సుభద్ర పైకి అనలేదు. ఆమె నిట్టూర్పులో ఆదిశేషయ్యకు వినిపించాయి.

సుభద్ర ఆ రోజుకి ఆఫీసుకు సెలవుపెట్టింది.

2

సిమెంటురంగు అంబాసిడర్ కార్లో వెనకసీట్లో నలుగురు, ముందుసీట్లో డ్రైవరుతో కలిపి ముగ్గురు.

కారు తార్రోడ్డుమీద పాములా జారిపోతోంది.

"ఎలాగున్నానండీ—ఈ నగలన్నీ వేసుకుంటే?" అంది జానకమ్మ.

"నగలెప్పుడూ లాకర్లో కంటే నీ వంటిమీదే బాగుంటాయి. కానీ నీకు భయం. ఇన్నాళ్ళకు నీకవి పెట్టుకుని ప్రయాణం చేసే యోగం పట్టింది—...." అన్నాడామె భర్త గురుమూర్తి.

"భలేవారే—పెళ్ళివారి ముందు మన హోదా నీ మాత్రం ప్రదర్శించకపోతే—లాంఛనా లడిగే బల మెక్కడుంచొస్తుంది? అసలమ్మాయిని కూడా కాసుల పేరు పెట్టుకోమన్నాను, మొద్దు....వినలేదు...." అంది జానకమ్మ.

"అమ్మా! ఉంటే అక్కలాగూ పెట్టుకొచ్చేది. బావ తాకట్టు పెట్టేసి ఉంటాడని నా అనుమానం" అన్నాడు ముందుసీట్లో కూర్చున్న పెళ్ళికొడుకు రంగారావు.

"బావకలాంటి కర్మేం పట్టలేదు. పుట్టింటికెడితే మీరే తాకట్టు పెట్టేసుకుంటారని ఆయన భయం" అంది తల్లి పక్కనే కూర్చున్న కుసుమ.

"అమ్మా - మరి మొన్న నువ్వు నాన్నా కాసులపేరు తాకట్టు గురించి దెబ్బలాడుకున్నారుగా...." అంది పదేళ్ళ కుసుమ కూతురు జలజ.

"బావ రంగును నా మేనకోడలే బైటపెట్టింది...." అంటూ నవ్వాడు పెళ్ళికొడుకు పక్కనే కూర్చున్న అతడి తమ్ముడు చలం.

"దానికి బావ రంగేం రాలేదు. నీ రంగే వచ్చింది...."
అంటూ ఉక్రోషపడింది కుసుమ.

సరిగ్గా అప్పుడు ఒక్క కుదుపుతో ఆగింది కారు.

"ఏమయింది?" అన్నాడు గురుమూర్తి.

"సార్ - రోడ్డు కడ్డంగా రాళ్ళున్నాయి...." అన్నాడు డ్రైవర్.

"సరే—అయితే కారుదిగి వాటిని తీసేయ్ నాయనా! నీ ఒక్కడివల్ల కాకపోతే చలంగాణ్ణి పిలు. లేదా—మా ఆయన్ను పిలు. మా రంగణ్ణి మాత్రం పిలవకు. వాడు పెళ్ళికొడుకు. పువ్వులా ఉండాలి మరి" అంది జానకమ్మ.

డ్రైవర్ కారు దిగేసరికి ఎక్కణ్ణించో వచ్చారో నలుగురు వ్యక్తులు వచ్చారు. వాళ్ళు నల్లటి ముసుగులు వేసుకున్నారు. ముఖంలో కళ్ళుతప్పి ఇంకేమీ కనబడ్డంలేదు. వాళ్ళ చేతుల్లో కత్తులున్నాయి.

"దొంగలు—" అంది జానకమ్మ అప్రయత్నంగా.

"అమ్మయ్యో—దొంగలు...." అంది కుసుమ.

గురుమూర్తి కంగారుగా వాళ్ళ చేతుల్లోని కత్తులవంక చూస్తున్నాడు.

జలజ మాత్రం ఉత్సాహంగా — "మామయ్యలూ—మీరిద్దరూ కలిసి ఆ దొంగల్ని చావగొట్టండి" అంది.

"వాళ్ళ చేతుల్లో కత్తులున్నాయి—" అంది జానకమ్మ కంగారుగా.

"ఫరవాలేదమ్మమ్మా! వాళ్ళు నలుగురే ఉన్నారు. పది మంది వచ్చినాకూడా ఒక చిన్న దెబ్బకూడా తినకుండా చావగొట్టొచ్చు" అంది జలజ.

అప్పటికే చాలా సినిమాలు చూసి ఉన్న మూలాన—నిజజీవితానికీ సినిమాకూ ఉన్న తేడా తెలియని మూలాన,

జలజ కప్పుడేదో ప్రమాదం సంభవించినట్టే లేదు.

దొంగలు ముందు డ్రైవర్ని తాళ్ళతో కట్టేశారు. తర్వాత ఒక్కొక్కర్నే కార్లోంచి బయటకు పిలిచి వాళ్ళు ధరించిన నగలు, వాచీలు వగైరాలన్నీ తీసుకున్నారు. ఒకరి తర్వాత ఒకరిని కట్టేసి—చివరగా అందర్నీ రోడ్డు పక్కన చెట్టుచాటున పడేశారు.

గురుమూర్తి కుటుంబంలో ఒక్కరుకూడా కిక్కురు మనలేదు. దొంగలు కార్లోని పెట్టెలు వెదికి క్యాషుకూడా రెండువేల రూపాయలదాకా ఉంటే తీసుకుని ఆ కార్లోనే అక్కణ్ణించి వెళ్ళిపోయారు. వెళ్ళేముందు—"మీ పెళ్ళి వారిల్లెక్కడో చెప్పండి. మీరు రావడం లేదని కబురు చెప్పి వెడతాం" అన్నారు వాళ్ళు.

చెప్పకపోతే వాళ్ళేం చేస్తారోనన్న భయంతో జానకమ్మ వాళ్ళకు అడ్రసు వివరంగా చెప్పింది.

"కట్నం ఏమాత్రం పుచ్చుకుంటున్నారు?" అనడిగాడింకో దొంగ.

జానకమ్మ వాళ్ళడిగన ప్రశ్నలన్నింటికీ బదులిచ్చింది. దొంగలు వెళ్ళిపోయారు.

"అప్పుడు జానకమ్మ భర్తనీ, కొడుకులిద్దర్నీ దుమ్మెత్తి పోసింది.

"ఇంకా నయం—కాసులపేరు పెట్టుకువచ్చాను కాదు. ఇప్పుడు పోయిన ఒంటిపేట గొలుసు కాయన ఏమంటారో ఏమో?" అంది కుసుమ ఏడ్పుగొంతుతో.

"మీకూ్కడా అల్లుడినిలా తాకట్టుపెట్టే బుద్ధుంటే ఈ రోజు నా నగలన్నీ పోయేవి కాదు...." అంది జానకమ్మ.

గురుమూర్తి ఆలోచిస్తూ—"అసలు మనమీదారిలో ఎందుకొచ్చినట్లు?" అన్నాడు.

"అంటే?" అంది జానకమ్మ.

"ఇది మన డ్రైవర్ దొంగలతో కూడబలుక్కుని చేసిన పని. లేకుంటే మనమిలా వస్తామని ముందే ఆ దొంగలకు ఎలా తెలిసింది?" అన్నాడు గురుమూర్తి.

డ్రైవర్ కంగారు పడ్డాడు—"బాబూ — నాకేం తెలియదు. ఎంతోకాలంగా మీ యింట్లో నమ్మకంగా పని చేస్తున్నవాణ్ణి...."

"అయితే జనసంచారం లేని ఈ దారినెందు కెన్నుకున్నావ్?"

"తొందరగా వెళ్ళాలన్నారు గదా అని ఈ దారిలో వచ్చాను. ఈ దారిలోకి కారు మళ్ళిస్తూంటే మీరేమీ అనలేదు .." అన్నాడు డ్రైవరు ఏడుపుగొంతుతో.

బంధించబడిన కారణంగా కదలలేని స్థితిలో ఉన్న గురుమూర్తి కుటుంబం అప్పుడు కాలక్షేపంగా డ్రైవర్‌పై ఆరోపణలు ప్రారంభించారు.

"దిక్కుమాలిన పెళ్ళిసంబంధం.... పెళ్ళి చూపులనే సరికే యాభై వేల నగలు తుడిచిపెట్టుకు పోయాయి." ఇంక పెళ్ళయిందంటే మొత్తం అన్నీ సర్వనాశనమైపోతాయేమో" అంది జానకమ్మ ఉన్నట్లుండి.

అప్పటికి డ్రైవర్‌కి ఆరోపణల నుంచి విముక్తి లభించింది.

3

"ఆరన్నారు — ఎనిమిదయింది— ఇంకా రాలేదేంటండీ పెళ్ళివారు?" అంది సుభద్ర తల్లి పార్వతి.

"ఏమో మరి...." అన్నాడు ఆదిశేషయ్య. ఆయన కంగారును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

"అనవసరంగా నన్నాఫీసుకు సెలవెట్టించారు. ఓ క్యాజు

వల్ లీవు వృథా అయిపోయింది'' అంది సుభద్ర బాధగా.

"నువ్వు క్యాజువల్ లీవుగురించి ఆలోచిస్తున్నావు. నా కేమో ఏర్పాట్లకు బోలెడు ఖర్చయింది'' అన్నాడు ఆది శేషయ్య చిరాగ్గా.

"అసలే రైల్వేస్టేషనుకో వెళ్ళి చూడరాదూ?'' అంది పార్వతి.

"వాళ్ళు రైల్లో కాదు—కార్లో వస్తారు ''

"ఏమో-సమయానికి కారు పాడై-ట్రయిన్‌లో వస్తున్నారేమో - యింత లేటయిందంటే గ్యారంటీగా ట్రయిన్ లోనే వస్తూండి ఉంటారు....'' అంది పార్వతి.

"ట్రయిన్‌లో వస్తే మాత్రం వాళ్ళెవరో నాకెలా తెలుస్తుంది? ఇంతవరకూ మధ్య వ్యక్తుల ద్వారా వాళ్ళను గురించి వినడమే తప్ప - ఒక్కసారి కూడా వాళ్ళని చూడలేదు గదా! రమ్మని ఉత్తరం వ్రాశాను. వాళ్ళు వస్తున్నట్లు బదులిచ్చారు....'' అన్నాడాదిశేషయ్య.

"అంటే వాళ్ళు మనింటికొస్తే తప్ప గుర్తు పట్టడం సాధ్యం కాదన్న మాట. అఘోరించినట్లే వుంది సంబంధం'' అంది పార్వతి.

ఇంట్లో అంతా నిరుత్సాహపడ్డారు. అంతో యింతో సుభద్ర కూడా నిరుత్సాహ పడింది. ఆమె కీ పెళ్ళి యిష్టం లేకపోవచ్చు. కానీ యిష్టం లేకపోయినా తప్పని పెళ్ళి. పెళ్ళికొడుకుని చూడాలనే ఉందామెకు.

"ఏమో - దేవుడే ఈ సంబంధాన్ని తప్పించాడేమో! చివరకు తనకు మధుతో వివాహం జరుగుతుందేమో!'' అనుకుందామె మనసులో ఆశగా.

ఇంట్లో అందరూ తొమ్మిది గంటల ప్రాంతంలో భోజనం చేశారు. సంబంధం తాత్కాలికంగా వాయిదా

పడిందా లేక చెడిపోయిందా అన్న బెంగ ఆదిశేషయ్యను పట్టి పీడిస్తోంది. భోజనాలై పోగానే సాధారణంగా నిద్రకు పడతాడాయన. ఆ రోజు మాత్రం నిద్ర రావడం లేదని వీధరుగులమీద కూర్చున్నాడు - పడక కుర్చీ వేసుకుని. అలా ఎంతసేపున్నాడో ఆయనకే తెలియదు.

రాత్రి పది గంటలు దాటేక ఆ యింటి ముందో సిమెంటు రంగు కారాగింది. ఆదిశేషయ్య ఉలిక్కి పడి పడకకుర్చీలోంచి లేచాడు.

డ్రైవర్‌తో కలిపి కార్లోంచి మొత్తం ఏడుగురు వ్యక్తులు దిగారు.

ముందుగా ఒకాయన వచ్చి తన్ను గురుమూర్తిగా పరిచయం చేసుకున్నాడు తర్వాత భార్యాబిడ్డల్ని, మనుమరాలిని పరిచయం చేశాడు.

“మీరింత బొత్తిగా ఊరూ పేరూ లేనివారనుకోలేదు. ఆదిశేషయ్యగారంటే ఒక్కరూ బదులివ్వరు....” అన్నాడు గురుమూర్తి.

ఆదిశేషయ్య చిన్నబుచ్చుకున్నా ఏమీ అనలేదు. ఆయన చక చకా యింట్లో వాళ్ళందరినీ హెచ్చరించాడు.

ఒక్కసారి ఇంట్లో వాతావరణం మారిపోయింది. మనుషులందరిలోనూ చలాకీతనం వచ్చింది.

పెళ్ళివారిని వీధి గదిలో కూర్చోపెట్టి క్షణాల మీద ఇల్లు శుభ్రం చేసేసింది పార్వతి. సుభద్ర పువ్వులా మారి పోవడానికి పావుగంట సరిపోయింది. సాయానికి పిల్చుకున్న వంటావిడ పెళ్ళివారి అభిరుచుల కనుగుణంగా అరగంటలో టిఫిను రెడీ చేసింది. టిఫినైతే ఫరవాలేదుగానీ- భోజనమైతే కతికితే అతకదన్న సామెత ఉందని మగ పెళ్ళివారు పట్టుబట్టారు.

పెళ్ళివారిని లోపలి గదిలోకి తరలించేక-వారు టిఫిను తినడం అవుతూండగానే సుభద్రను తీసుకొచ్చింది పార్వతి.

అప్సరసలా ఉన్న సుభద్ర వంక సంస్కారంతో కూడిన చూపులు ప్రసరించాడు వరుడు రంగారావు.

రంగారావును చూసి సుభద్ర ఆశ్చర్య పడింది. అతడామె ఆలోచనలకు భిన్నంగా ఎంతో అందంగా ఉన్నాడు.

"ఈడూ జోడూ బాగుంటుంది" అంది కుసుమ.

"ఆ దీపాల వెలుగులో నకిలీ బంగారానికీ, అసలు బంగారానికీ తేడా తెలియదు" - అంది జానకమ్మ నిరసనగా.

సుభద్రకా మాటలు నచ్చలేదు. ఆదిశేషయ్యకూ నచ్చినట్లు లేదు. ఆయన ఉక్రోషా న్నాపుకుని - "ఇంత ఆలస్యమై పోయింది. రేపు పగటి వెలుతురులో కూడా అమ్మాయిని చూసేకనే వెడుదురుగాని...." అన్నాడు.

"అదేదో మాటవరసకందిగానీ - ఆ అవసరం లేదు. అయినా ఆలస్యం మాది. దారిలో కారు ట్రబులిచ్చి ఆలస్యమయింది. దారిలో ఎక్కడా మెకానిక్సు లేరు. చాలా ఇబ్బందయింది...." అన్నాడు గురుమూర్తి.

కాసేపు ప్రయాణం యిబ్బందుల గురించి మాటలు నడిచేక కుసుమ సుభద్రను పాట పాడమంది.

సుభద్ర కృష్ణశాస్త్రి గేయం పాడింది.

"త్యాగరాజకృతి పాడమ్మా!" అన్నాడు గురుమూర్తి.

"నాకు సంగీతం రాదండి. పాటలే వచ్చు...." అంది సుభద్ర.

మగపెళ్ళివారు సుభద్రను నడవమన్నారు. మనసులో మండిపడుతూనే ఆమె నడిచి చూపించింది.

గురుమూర్తి రంగారావు వంక సాభిప్రాయంగా చూసి "నువ్వేం మాట్లాడవేంరా?" అన్నాడు.

"నేనా అమ్మాయిని ప్రయివేటుగా కొన్ని ప్రశ్న లడగాలి...." అన్నాడు రంగారావు చటుక్కున.

ఆదిశేషయ్య తెల్లబోయాడు. పార్వతి ముఖం అదో లాగై పోయింది.

"ప్రయివేటుగా ఏం మాట్లాడతావు? నీ సందేహా లేమిటో ఇక్కడే అడుగు...." అన్నాడు గురుమూర్తి.

"నా ప్రశ్న లింతమందితో అడిగేవి కాదు. మే మిద్దరం ఒకరి గురించి ఒకరు బాగా తెలుసుకోవాలంటే ప్రయివేటుగా మాట్లాడక తప్పదు...." అన్నాడు రంగా రావు.

"అబ్బాయి సరదా పడుతున్నాడు. ఇందులో తప్పే ముంది?" అంది జానకమ్మ తేలికగా తీసిపారేస్తూ.

ప్రయివేట్ మీటింగ్ కేర్పాట్లు చేయకపోతే ఆ సంబంధం తప్పిపోయే ప్రమాదముందని ఆదిశేషయ్య గ్రహించాడు, అప్పటికప్పు డాయన అక్కడే పక్కన ఉన్న గదిలో ఇద్దరికీ చెరోకుర్చీ వేయించాడు.

వధువు, వరుడు ఆ గదిలోకి వెళ్ళి చెరో కుర్చీలోనూ కూర్చున్నారు.

వాళ్ళు అక్కడ కూర్చున్నవాళ్ళందరికీ కనబడు తున్నారు.

"ఇక లాంఛనాల సంగతి మాట్లాడుకుందామా?" అన్నాడు గురుమూర్తి నెమ్మదిగా.

"అబ్బాయి కమ్మాయి నచ్చితే...." నసిగాడు ఆది శేషయ్య. మగపెళ్ళివారి నోటమ్మట పిల్ల నచ్చిందన్న చల్లని కబురు వినాలని ఆయన ఆత్రపడుతున్నాడు.

"ఇంతవరకూ నాలుగు పెళ్ళిచూపులకు వెళ్ళాం. ఇంత వరకూ వాడొక్క పిల్లతోటీ ప్రయివేటుగా మాట్లాడతా ననలేదు. పిల్ల నచ్చినట్లే మరి!" అన్నాడు గురుమూర్తి.

ఆదిశేషయ్య గుండెలు కుదుటపడ్డాయి. సంబంధం కుదిరినట్లే తోస్తోం దాయనకు.

"మేము రాత్రికి రాత్రే మళ్ళీ ప్రయాణమై వెళ్ళి పోతాం, అన్నీ ఇప్పుడే మాట్లాడుకోవడం మంచిది—" అన్నాడు గురుమూర్తి.

సరిగ్గా అప్పుడే దబ్బున చప్పుడయింది.

ఆదిశేషయ్య, పార్వతి ఉలిక్కిపడి అటూ యిటూ చూశారు.

అది తలుపు మూసుకున్న చప్పుడు.

ఆ గదిలో వరుడు రంగారావు, వధువు సుభద్ర ఉన్నారు. అంతవకూ వాళ్ళు కనిపించారు. ఇప్పుడు తలుపులు కనబడుతున్నాయి.

"ఏమిటిది?" అన్నాడు ఆదిశేషయ్య.

"అమ్మాయి సరదాపడుతున్నట్లుంది. అబ్బాయి తలుపేశాడు...."

"గురుమూర్తి బావగారూ! మీకు వేళాకోళంగా ఉందేమోకానీ నాకిది నచ్చలేదు—" అన్నాడు ఆదిశేషయ్య.

"నా పేరు గురుమూర్తికాదు—...." అన్నాడు గురుమూర్తి.

ఈసారి పార్వతి కూడా తెల్లబోయింది.

"ఎవరు మీరు?" అన్నాడు ఆదిశేషయ్య.

"దొంగలం—" అన్నాడు గురుమూర్తి.

"దొంగలైతే ఈ యింట్లోంచి బయటపడలేరు...."

అన్నాడు ఆదిశేషయ్య.

"ఎందుకు బయటపడలేము? గదిలో అబ్బాయి, అమ్మాయి తలుపేసుకున్నారు. ఈడొచ్చిన పిల్లకు వయసుకు తగిన వరుడు. మీరిప్పుడు అరిచి గోలచేస్తే నలుగురూ రావచ్చు. ఆ విధంగా మీ డబ్బు మీకు దక్కొచ్చు. కానీ మీ పరువు మీకు దక్కదు. పదిమాసాలు రావణాసురుడి దగ్గరుంటే రాముడు సీత ననుమానించాడు. అది త్రేతాయుగం. ఆ సీత దైవాంశసంభూతురాలు. మీ అమ్మాయి మామూలు మనిషి. ఇది కలియుగం. కాబట్టి పరువు పోడానికి పదినెలలక్కర్లేదు. గదిలో పదినిముషాలుంటే చాలు. కాబట్టి ఆలోచించుకోండి. ఏ గొడవా చేయకుండా బుద్ధిగా ఉన్నారంటే మాక్కావలసినవి మేము మూటగట్టుకుని వెళ్ళిపోతాం. మీ అమ్మాయి జీవితం అల్లరి కాదు...." అన్నాడు గురుమూర్తి.

"అక్కడ గదిలోపల ఏం జరుగుతోంది?" కంగారుగా అడిగా డాదిశేషయ్య.

"రహస్యంగా జరిగే ఏ తప్పూ తప్పుకాదు. కాబట్టి లోపల ఏమీ జరగడంలేదనే అనుకోండి...." అన్నాడు గురుమూర్తి.

ఆదిశేషయ్యకూ, పార్వతికీ కాళ్ళూ చేతులూ ఆడలేదు.

"నీక్కావలసిందిస్తాను. ముందాగది తలుపులు తీయించు...." అన్నాడాయన కంగారుపడిపోతూ.

"లోపల్నుంచి అరుపులూ, కేకలూ వినబడ్డంలేదు. అంటే ఏమీ జరగడం లేదనే అర్థం. జరిగినా అది ఇద్దరి ఇష్టంమీదనే జరుగుతోంది. మీరిక మా సమయం వృధా

చేయకండి. త్వరగా మాకు సహకరించండి...." అన్నాడు గురుమూర్తి.

ఆదిశేషయ్యకు వేరే దారి తోచలేదు.

ఇంట్లో పదివేలు విలువచేసే బంగారు నగలున్నాయి. ఒక వెండి కంచం, మరచెంబు, నాలుగు వెండి గ్లాసులు, రెండు వెండి కుంకుమభరిణలు ఉన్నాయి. క్యాషు సుమారు రెండువేల రూపాయలుంది.

నిజానికింట్లో ఇంకా బంగారముండేవి. ఆడపిల్ల వంటి మీద బంగారం చూస్తే అదంతా అడిగేస్తారని లాకర్లో ఉంచాడు ఆదిశేషయ్య. మగపెళ్ళివారి ముందు దర్జాగా కనిపించడం ఇష్టంలేకపోవడంవల్ల కొంత బంగారం మిగిలింది.

దొంగలు టేపురికార్డరు, రేడియోల వంటి చిన్న వస్తువులు కూడా విడిచిపెట్టలేదు. వెళ్ళేముందు వాళ్ళు అందరికీ స్పృహతప్పించి వెళ్ళారు.

4

తెల్లవారుఝామున నాలుగు గంటలకు మెలకువ వచ్చింది—ఆదిశేషయ్యకు. ఆయన పక్కనే పడి ఉంది భార్య పార్వతి. వాళ్ళకు కాస్త దూరంగా వంటామె పడి ఉంది.

ఆదిశేషయ్యకు జరిగింది గుర్తుచేసుకుందుకు కాసేపు పట్టింది. గుర్తుకు రాగానే ఆయన గుండెలదిరాయి. ముందు భార్యను తట్టిలేపాడు.

పార్వతి లేచి బద్ధకంగా వళ్ళు విరుచుకుంది. భర్త గుర్తుచేసే దాకా ఆమెకు పరిస్థితి గుర్తురాలేదు. గుర్తు రాగానే ఆమె వీధి గుమ్మంలోకి పరుగెత్తింది. తలుపులు దగ్గిరగా వేసి ఉన్నాయి.

ఆదిశేషయ్య ఆమె ననుసరించే వెడుతూ—"అమ్మా యెలాగుందో?" అన్నాడు.

పార్వతి గుండె గుభేలుమంది. ఆమె చటుక్కున కూతురున్న గదిలోకి పరుగెత్తింది.

అక్కడ నేలమీద పడి ఉంది సుభద్ర.

వంటిమీద బట్టలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. నుదుటి కుంకుమ సగానికి సగం చెరిగిపోయింది. జడలోని మల్లెలు నలిగిపోయాయి. అసలామె ఒక నలిగిన పువ్వులా ఉంది.

అంటే....సుభద్రకు....

పార్వతి భర్తతో ఏదో అనాలని వెనక్కు తిరిగింది. కానీ భర్త ఆమెకు దగ్గర్లో లేడు. ఆయన దూరంగా ఉండి ఆ గదిలో ఎలాంటి దృశ్యం చూడాల్సి ఉంటుందో నని భయపడుతున్నాడు. భార్య పిలిస్తే వద్దామన్నట్లు రెడీగా ఉన్నాడు.

పార్వతి అయన్ను పిలవలేదు. కూతుర్ని సమీపించి ఆమె బట్టలు సరిచేసింది. తర్వాత మరోసారి కూతురివంక పరీక్షగా చూసి—"ఏమీ జరిగి ఉండదు. నిద్రలో నలిగింది, అంతే!" అనుకుంటూ తట్టిలేపిందామె.

సుభద్ర కళ్ళు నులుముకుంటూ లేచి—"నేనెక్కడున్నాను?" అంది.

"మనింట్లోనే!" అంది పార్వతి.

సుభద్రకీ లోకంలోకి రావడానిక్కాసేపట్టింది.

"ఏం జరిగిందమ్మా?" అంది పార్వతి.

సుభద్ర నెమ్మదిగా—"వాడు మంచివాడు కాదమ్మా. మామూలుగా మాట్లాడుతూ ఉన్నట్లుండి తలుపులు వేశాడు. నేను తేరుకుని అరిచేలోగా నామీద మత్తుమందు ప్రయో

గించాడు" అంది.

"తర్వాత?" అంది పార్వతి ఆత్రుతగా.

"తర్వాత నాకింకేం తెలియదు. చాలా మంచికలలు వచ్చాయి. ఇప్పుడు నువ్వు నిద్రలేపావు...."

కలేమిటని అడగడానికి పార్వతి భయపడింది.

ఈలోగా ఆదిశేషయ్య అక్కడకు వచ్చాడు. కూతురి ముఖంలో అమాయకత్వం ఆయనకు కొంత తృప్తి నిచ్చింది.

ఆ తర్వాత నాలుగు రోజుల కాయనకు గురుమూర్తి సంబంధం కుదిర్చిన మధ్యవర్తినుంచి ఉత్తరం వచ్చింది. అందులో గురుమూర్తి కుటుంబం పొందిన చేదు అనుభవాల గురించి రాసి—వాళ్ళా దోషాన్ని పెళ్ళికూతురి కంటగట్టి సంబంధం వదులుకున్నట్లు తెలియబరిచాడు.

5

ఒక ఏడాది తర్వాత ఆదిశేషయ్య తన ఊర్నించి కాకినాడకు ప్రయాణమయ్యాడు. సుభద్రకూడా పదిరోజులు ఆఫీసుకు సెలవుపెట్టి ఆయనతో బయల్దేరవలసి వచ్చింది. అసలు కారణం సుభద్రకు మరో పెళ్ళి సంబంధం కాకినాడలో ఉండడం. వరుడి బామ్మ ఆర్నెల్లుగా మంచం పట్టింది. పిల్ల ఆమెకు నచ్చితే సంబంధం కుదిరినట్లే కాబట్టి సుభద్ర ఆమె దర్శనం చేసుకోవలసి ఉంది.

కాకినాడలో ఆదిశేషయ్య దూరపు బంధువొకాయన వున్నాడు. ఆయనే ఉత్తరంరాసి ఆదిశేషయ్యను రప్పించు కుంటున్నాడు. ఆదిశేషయ్య ఆయనింట్లోనే దిగాడు.

ఆ యింటాయన రాజారావు. చాలా మంచివాడుట. మనవాళ్ళేనని దూరపుబంధువు ఆదిశేషయ్యకు చెప్పాడు.

రాజారావు కూతురు నిరుపమ. మనిషి చాలా అందంగా ఉంటుంది. ఆమె కించుమించు సుభద్ర వయసే ఉంటుంది.

తాము వచ్చిన పెళ్ళి సంబంధానికి ఈ అమ్మాయి పోటీ కాగలదని ఆదిశేషయ్యకనుమానం వచ్చింది. తన అనుమానాన్నాయన దూరపుబంధువు దగ్గర వ్యక్తపరిస్తే- "భలేవాడివే—ఆ పిల్లకు పెళ్ళైపోయిందిగా—" అన్నాడా దూరపు బంధువు.

"కానీ ఆ పిల్ల మెడలో నల్లపూసలు లేవు. మంగళ సూత్రం లేదు...." అని ఆదిశేషయ్యింకా ఏదో అనబోతూండగా—

"అదంతా పెద్ద కథ లే...." అన్నాడు దూరపు బంధువు.

ఆదిశేషయ్య ఆ కథ అడిగి తెలుసుకున్నాడు.

నిరుపమకు పదినెలల క్రితం కాబోలు పెళ్ళయింది, ఆర్నెల్ల క్రితం అత్తారింటి నుంచి తిరిగివచ్చింది. డబ్బు కోసం వేధిస్తున్నారుట వాళ్ళు. అప్పటికే యాభై వేలకట్నం, కలర్ టీవీ, ఫర్నిచరు వగైరాలిచ్చుకుని ఉన్నాడు రాజారావు. ఇక డబ్బు తేలేనన్నాడు. నాలుగునెలల క్రితం వాళ్ళు పిల్ల మీద శీలాపనిందలు వేసి విడాకు లడిగారు. ఆ పిల్ల కోపం వచ్చి మెడలో తాళిబొట్టు తీసేసింది.

"ఆ పిల్లను చూస్తే నాకు జాలేస్తుంది. మొగుడు నాలుగు నెల్లపాటు దగ్గిరుంచుకుని కాపురం చేశాడు. యాభై వేలు కట్నం తీసుకుని ఇప్పుడు వదిలేస్తానంటే— ఆమెకు మళ్ళీ పెళ్ళవుతుందా....?" అన్నాడు దూరపు బంధువు.

"అలాంటి వాళ్ళను చట్టం—రేప్ అండ్ డకాయిటీ అంటే మానభంగం, దోపిడీ నేరాల క్రింద అరెస్టు చేసి శిక్ష విధించాలి—" అన్నాడు ఆదిశేషయ్య కసిగా.

"అవును—నిజమే!"

ఆదిశేషయ్య ఆ పెళ్ళివారి గురించి వివరాలడిగాడు. తెలిసేక ఆయనక్కలిగిన ఆశ్చర్యమింతా అంతా కాదు. సుభద్రకు తప్పిపోయిన పెళ్ళికొడుకు రంగారావే నిరుపమను పెళ్ళి చేసుకున్నాడు. గురుమూర్తి నిరుపమ మామగారు.

ఆదిశేషయ్య వెంటనే పరుగున లోపలకు వెళ్ళి భార్యకు, కూతురికి ఈ విశేషం చెప్పాడు.

సుభద్ర వెంటనే—"నాన్నా! ఆ రోజున దోపిడి దొంగలు మనింటికి వచ్చి—బందిపోటు దొంగల బారి నుండి రక్షించారు. మనం చాలా అదృష్టవంతులం—" అంది.

"అవునమ్మా! గురుమూర్తివంటి పెళ్ళిపెద్దలు—బంది పోటు దొంగల కంటె ప్రమాదకరమైనవాళ్ళు—" అంది పార్వతి.

"ఇది తెలిసి కూడా—మీరింకా సంప్రదాయాన్నే పట్టుకుని వ్రేలాడాతారేం? నా మాట విను. నన్ను వ్యక్తిగా గౌరవించే మధుతో నా పెళ్ళి ఎందుకు జరిపించరు?" అంది సుభద్ర వెంటనే సూటిగా.

ఆదిశేషయ్య తల వంచుకుని—"ఈ పెళ్ళివారు గనుక హెచ్చు కట్నం అడిగితే ఆ పనే చేస్తానమ్మా!" అన్నాడు.

ఈ మాటలు వినగానే మధుతో తన పెళ్ళి నిశ్చయమైనట్లే సంతోషపడింది సుభద్ర. □

బొమ్మిడి అచ్చారావు

మాస్టర్ ప్లాన్

"నా భార్య నన్ను హత్య చెయ్యాలని ప్రయత్నిస్తోంది" అన్నాడు సుబ్బారావు.

జగన్నాధం ఆశ్చర్యపోయాడు. "ఎందుకని?" అన్నాడు.

"అదే నాకూ అంతుబట్టడంలేదు. అప్పుడే రెండు

సార్లు ప్రయత్నించింది. రెండుసార్లూ నేను లక్కీగా తప్పించుకున్నాను" నిట్టూర్చి అన్నాడు సుబ్బారావు.

"నీ భార్య చాలా సౌమ్యురాలు. నువ్వంటే చాలా భయభక్తులతో వుంటుంది. నేను రెండు మూడుసార్లు మాట్లాడాను కూడా. ఆమెలో వేలెత్తి చూపించగల లోప మేదీ కనిపించలేదు నాకు" చెప్పాడు జగన్నాధం.

"నువ్వు చెప్పినవన్నీ నిజమేనని నేనూ ఒప్పుకుంటాను. కాని ఎవరికీ అంతుబట్టని ఓ వింత మనస్తత్వం ఆమెది. నాతో మాట్లాడుతూనే వుంటుంది. పరధ్యానంగా, ఉదాసీనంగా మారిపోతుంది. ఏదో లోకంలో వున్నట్టు, పరిసరాల్ని. నన్ను కూడా మరిచిపోతుంది. ఆమె భగ్న ప్రేమికురాలై వుండవచ్చునని నా కనిపిస్తుంటుంది."

"ముందా ఆలోచన మనసునించి బయటకు నెట్టెయ్యి. ఒక్కోసారి చిన్న అనుమానం పెద్ద అగాధాలని సృష్టిస్తుంది. దాన్ని పూడ్చటం ఆ తర్వాత ఎవరి తరమూ కాదు."

"నీకు తెలియదురా జగ్గూ. ఏ క్షణంలో నా ప్రాణం పోతుందో చెప్పలేను. ఆమెతో కాపరం చెయ్యాలంటే భయంగా వుంది." సుబ్బారావు ఒకసారి స్నేహితుడి ముఖంలోకి చూసి తర్వాత ఎటో చూస్తూ ఇలా చెప్పాడు:

"మొన్న రాత్రి నాకు పాలు తీసుకొచ్చింది. రాత్రి నిద్రపోయే ముందు నాకు పాలు తాగటం అలవాటు. అలాగే మొన్న కూడా పదిన్నర ప్రాంతాల పాలు తెచ్చి టేబిల్ మీద పెటి తాగమనిచెప్పి వంటగదిలోకి వెళ్ళింది. నేను తాగేలోపల పిల్లి ఆ గ్లాసుమీది కురికింది. గ్లాసు నేల మీద పడిపోయింది. పిల్లి పట్టువదలకుండా ఒలికిన పాలని

తాగింది. మరునిమిషం గిలగిలా కొట్టుకుని చచ్చిపోయింది" సుబ్బారావు ఆగాడు.

"సౌజన్య చూసిందా ఆ దృశ్యం?" అడిగాడు జగన్నాధం. సౌజన్య సుబ్బారావు భార్య పేరు.

"నేనా దృశ్యం చూసి, కొద్దిసేపటివరకు తేరుకోలేకపోయాను. పిల్లి పాలుతాగి చచ్చిపోయిందని చెప్పాలనుకున్నాను. లేచి వంటగదిలోకి వెళ్ళి ఆమెను వెంటబెట్టుకొచ్చాను. ఆమెలోని కొస్తూనే 'అరెరె, పిల్లి పొట్టలో ఆ గాయమేమిటి?' అన్నది. నేను ఆశ్చర్యంగా చూశాను. తెల్లని పాలు పిల్లి రక్తంతో కలిసి ఎర్రగా అయ్యాయి.

పిల్లి కడుపులో గాజుగ్లాసు ముక్కలు గుచ్చుకుని వున్నాయి. నేను సౌజన్యని పిలవటానికి వంటగదిలోకి వెళ్ళేటపుడు పిల్లి కడుపులో గాయంలేదు. గాజుముక్కలు గుచ్చుకోలేదు. నేను తిరిగొచ్చేసరికి విచిత్రంగా దాని కడుపులో గాజుముక్కలు, రక్తం...." సుబ్బారావు ఓ క్షణం ఊపిరి తీసుకోవటానికన్నట్టు ఆగాడు.

జగన్నాధం తేలిగ్గా నవ్వేశాడు. "అంతా నీ భ్రమ! నిజానికి పిల్లి చచ్చిపోయింది పాలు తాగికాదు- గాజుగ్లాసు పగిలి దాని తునకలు కడుపులో గుచ్చుకుని గాయమై రక్తస్రావంవల్ల ప్రాణాలు కోల్పోయింది. నువ్వు అనవసరంగా సౌజన్య ననుమానించావు—పాలల్లో విషం కలిపివుంటుందని!"

సుబ్బారావు తల అడ్డంగా తిప్పాడు. "నా కళ్ళు నన్ను మోసం చెయ్యవు. నేను సౌజన్యకి పిల్లి చావు గురించి చెప్పటానికి వెళ్ళేసరికి దాని కడుపులో ఎలాంటి గాయమూ లేదు. తిరిగొచ్చేసరికి అంతా రక్తమయం. నేను సౌజన్య కోసం వెళ్ళినప్పుడేదో గమ్మత్తు జరిగింది."

జగన్నాథం సుబ్బారావు భుజం చరిచి "అంతా నీ అనుమానం. ఆ లోపల నీ పడగ్గదిలోకి ఎవరో ప్రవేశించి పిల్లి కడుపులో గాజు ముక్కలు గుచ్చి వుంటారంటావు, ఆవునా?" అన్నాడు వచ్చే నవ్వు నాపుకుంటూ.

సుబ్బారావు సీరియస్‌గా చూసి, "ఖచ్చితంగా అదే జరిగింది. నేను సౌజన్య కోసం వంట గదిలోకి వెళ్ళినా, ఆమె అక్కడ లేదు. బాత్‌రూంలో వుందేమోనని అక్కడికి వెళ్లాను. ఇంతలో ఆమె మా పడగ్గది పక్కగా వస్తూ కనిపించింది. పిల్లి గురించి చెప్పగానే హడావిడిగా నాతో పడకగదిలోకి వచ్చింది" అన్నాడు.

"అంటే....సౌజన్య ఆ గాజు గ్లాసు ముక్కలు పిల్లి కడుపులోకి గుచ్చిందని నీ అభియోగం, అవునా?"

"అందుకవకాశ ముంది. తన తప్పు లేకుండా. నన్ను నమ్మించటానికలా చేసి వుంటుంది. నేను పాల గురించి మళ్ళీ నోరెత్తకుండా అయిపోయింది."

"చూడు సుబ్బారావ్, నీ అనుమానం నిరాధారం. పిల్లి పాలగ్లాసు మీదికి ఉరుకుతుందని పాలగ్లాసు పగిలిపోతుందని ఆ గాజు ముక్కలతో పిల్లి కడుపులో గాయం చెయ్యాలని సౌజన్య ముందే ఎలా ప్లాన్ వేసుకొగలదు? పిల్లి సమయానికి ప్రత్యక్షమవుతుందని ఆమె కల గన్నదా?....నీ మనసులో ఎందుకో అనుమాన బీజం పడింది. అది పెద్ద మానై శాఖలు విస్తరించటానికి ఎంతో కాలం పట్టదు. ఆదిలో నే దాన్ని తుంచెయ్యి" అన్నాడు జగన్నాథం.

సుబ్బారావు దీర్ఘంగా నిట్టూర్చి, "పోయిన రాత్రి జరిగిన మరో సంఘటన. మొన్న రాత్రి ఆ సంఘటన జరిగాక నేను చాలా ఎలర్టుగా వుంటున్నాను. ఆమె ప్రతి

చర్యా దీక్షగా పరీక్షగా వేయి కళ్ళతో కనిపెట్టుకుని వుంటున్నాను. పోయిన రాత్రి నేను నిద్రపోలేదు.

"మామూలుగా తాగేపాలు తాగలేదు. కడుపు నొప్పి, అజీర్తి అని సాకు చెప్పి తప్పించుకున్నాను. ఆమెకు నమ్మకం కలగటం కోసం అన్నం కూడా మానేశాను. అన్నంలో కూడా ఏదయినా విషం కలుపుతుందేమోననే భయం కూడా ఓ కారణం.

"నిన్న రాత్రి నేను నిద్ర నటిస్తూ చాలాసేపు అలాగే మెలకువగా వుండిపోయాను. సౌజన్య కూడా నిద్ర నటిస్తూన్నదని చాలా తేలికగా కనిపెట్టాను. రాత్రి పన్నెండు ఒంటి గంట మధ్య సౌజన్య నా ముఖంలోకి పరీక్షగా చూడటం నేను గమనించాను. కళ్ళు తెరవకుండా కను కొలకుల నుంచి కనిపెట్టాను. ఆమెకి నేను గాఢనిద్రలో వున్నానన్న భ్రమ కలిగించాను. ఆమె ఏదో ప్లాన్‌లో వుందని నాకు తెలుసు. ఈసారి ఆమె ప్రయత్నం భంగం చెయ్యడమే కాకుండా ఆమెను రెడ్‌హేండెడ్‌గా పట్టుకుని ఆమె చర్యను నిలదీసి అడగాలని నిర్ణయించుకున్నాను.

"అకస్మాత్తుగా ఆమె కుడిచేతిలోనికి సిరెంజినీడిల్ ప్రత్యక్షమయింది. సిరెంజి మాత్రం లేదు. ఉత్త సూది మాత్రమే! నాకు నా పరిస్థితి వెంటనే అర్థమైపోయింది. ఆ నీడిల్‌పై నేడ్ పూత పూసినదనీ, దాన్ని నా నరంలో గుచ్చిన మరుక్షణం రక్తం విషపూరితమై క్షణాల్లో ప్రాణాలు పోతాయనీ నాకు తెలుసు. నా మీద హత్యా ప్రయత్నం జరిగిన క్షణం నించీ నేను ఎలర్టుగా వుంటు న్నానని చెప్పాను కదూ! ఆమె నన్నంతం చెయ్యటానికి ఎన్ని మార్గాలు అవలంబించటాని కవకాశ ముందో అవన్నీ నేను గుర్తుపెట్టుకున్నాను.

"సౌజన్య చేయి గాల్లోకి లేచింది. నా చేతి నరంలోకి మరుక్షణం నీడిల్ గుచ్చుకుని వుండేదేమో! చాలా షార్ప్‌గా ప్రమాదం నించి తప్పించుకున్నాను. పక్క మీదికి ఇటు నుంచి అటు ఒక్కసారిగా దొర్లాను. సౌజన్య నిర్ఘాంత పోయిందని వేరే చెప్పనక్కర్లేదు. ఎగిరి పక్కమీద కూచుని ఆమె చేతి సందుకున్నాను, మణికట్టు దగ్గర పట్టి.

"అయితే ఆమె చేతిలో నీడిల్ లేదు. పరుపులో గుచ్చేసి వుండాలి. లేదా కిటికీలోనించి బయటకు పారేసి వుండాలి. ఏం ఎరగనట్టు 'ఏమిటండీ అలా వులిక్కిపడి లేచారు? ఏంటలా చెయ్యి పట్టుకుంటున్నారు? పీడ కలేవయినా వచ్చిందా? అంటూ సానుభూతి కురిపించింది. నేనేమీ బదులివ్వలేదు." ముగించాడు సుబ్బారావు.

జగన్నాధం నిట్టూర్చి, "సౌజన్య చెప్పినట్టు నువ్వు నిజంగానే ఏదో పీడకల కనివుంటావు. ఆమె మీది అనుమానం నీ మనస్సును, నీ సబ్‌కాన్షన్స్‌ని తన కంట్రోల్ లోకి తెచ్చుకుని నీకు అదుపు లేకుండా చేసింది. దాంతో ప్రతివిషయాన్ని అనుమానిస్తూ, ఆమె ప్రతి కదలికను సంశయిస్తూ ఆమె నిన్ను చంపటానికి ప్రయత్నిస్తున్నదనే భ్రమలో గాఢంగా మునిగిపోయావు. ఐ పిటీయూ సుబ్బారావ్?" అన్నాడు.

సుబ్బారావు తినేసేలా చూశాడు జగన్నాధాన్ని. "ఏదో ఫ్రెండువి కదా, ఏదయినా సలహా చెవుతావని, నన్నీ జంఝాటం నించి గట్టెక్కిస్తావనీ చెపితే గొప్ప పరిష్కారం సూచించావు. నీ జాలి, సానుభూతి, ఎవడిక్కావాలిరా?" అన్నాడు.

అతనికి బాగా కోపమొచ్చిందని గ్రహించాడు జగన్నాథం. అందుకే ఏం మాట్లాడితే ఎలా పరిణమిస్తుందో నని కాసేపు మౌనం వహించాడు. తర్వాత మిత్రుడి భుజం మీద మెల్లగా తట్టి, "నేనో మాట చెపుతాను, కోపగించుకోవు కదా!?...." అన్నాడు.

"చెప్పు, కోపం దేనికి?"

"మరేం లేదు. సౌజన్య మీద నీకు సందేహం తలెత్తింది కాబట్టి, ఆమెను కొన్నాళ్ళపాటు పుట్టింటికో, మరెక్కడికో పంపి వెయ్యి. ఆమె నీ నుంచి కావాలనే దూరమైపోవాలనుకుంటే మళ్ళీ నీ కోసం రాదు. తన దారి తను చూసుకుంటుంది. ఇది మొదటి సొల్యూషన్."

"రెండోది కూడా చెప్పు!"

"అది నీకు, సౌజన్యకి కూడా ఇబ్బందికరంగా వుండేదే! అయినా తప్పనిసరి పరిస్థితుల్లో అనుసరించవలసిన మార్గం! సూటిగా సౌజన్యతో నీ మనసులోని అనుమానాల గురించి వెల్లడి చెయ్యి. ఆమె నీ నుంచి దూరం కావాలనుకుంటే యధేచ్ఛగా వెళ్ళిపొమ్మను. విడాకులు కావాలేమో అడుగు. మీ పెళ్ళయి రెండేళ్ళు దాటింది కాబట్టి కోర్టు విడాకులకి అభ్యంతరం చెప్పదు...." చెప్పాడు జగన్నాథం.

సుబ్బారావేదో ఆలోచిస్తూ వుండిపోయాడు. తర్వాత మిత్రుడి వంక చూసి, "నేను ఆలోచించుకోవాలి. అయితే ఈ రెండింటిలో ఏదీ నా కిష్టం లేదని మాత్రం చెప్పగలను. నేను సౌజన్యను చాలా గాఢంగా ప్రేమిస్తున్నాను. ఏ కారణంచేతగాని ఆమెను దూరం చేసుకోలేను. ఇక విడాకుల ప్రసక్తే లేదు" అన్నాడు.

"మరి, అనుక్షణం ఆమెననుమానిస్తూ మానసికంగా

ఇలాగే నలిగిపోతుంటావా? ఇంకొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే నువ్వు పిచ్చివాడయిపోవటం ఖాయం!" అన్నాడు జగన్నాథం జాలిగా చూస్తూ.

"నీకా భయ మక్కరలేదు. నేను మరీ అంత బలహీన మనస్కుడిని కాదు. నువ్వేదో మంచి సలహా యిస్తావని నా మనస్సు నీ ముందు పరిచాను. కాని నువ్వు ప్రాక్టికల్‌గా ఆలోచించటం లేదని చెప్పటానికి చింతిస్తున్నాను. వస్తాన్రా!" లేచి నిల్చున్నాడు సుబ్బారావు.

2

మర్నాడు మధ్యాహ్నం వరకు ఆఫీసులో ఎలాగో గడిపేసి అకస్మాత్తుగా ఇంటికి బయల్దేరాడు సుబ్బారావు. సౌజన్య దారితప్పకపోయినా, ఇప్పుడు తప్పకుండా తప్పుతుందని అతనికి నమ్మకంగా తెలుస్తోంది. ఆమె మీది వ్యామోహం తగ్గించుకోవాలని ఎప్పటి కప్పుడు ప్రయత్నిస్తున్నాడు గాని సాధ్యం కావటం లేదు.

సౌజన్య లేకుండా తను బతకలేను? పోతే ఆమెతో పాటే తనూ పోవాలి. అంతే! స్థిరంగా నిర్ణయించుకున్నాడప్పటికే.

అయితే ఇప్పుడు తను ఇంటికెందుకు బయల్దేరి వెళ్తున్నట్టు? సౌజన్యను రెడ్‌హేండెడ్‌గా పట్టుకోవటానికా? ఆమె తప్పు చేస్తుండగా తను పట్టుకోవాలనుకోవటం ఎంత జుగుప్సాకరమైన ఆలోచన? అసలు ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్న భార్యను పరాయి మగాడితో ఊహించుకోవటం ఎంత బాధాకరమైన పరిస్థితి? దీన్ని తనెదుర్కోగలడా? ఆమె నిజంగా దారితప్పి ప్రవర్తిస్తుంటే అదిచూసి తను భరించగలడా?

ఉహూఁ! ఆమె తప్పుచేయదు, చేయదు. చేయదు.

కానీ....కానీ... తనని అంతంచెయ్యాలని ఎందుకు ప్రయత్నిస్తోంది? తనామె చర్యలకి అడ్డంకిగా భావించినప్పుడేకదా అడ్డు తొలగించుకోవటానికి ప్రయత్నిస్తుంది!?

అంటే....ఆమె ఖచ్చితంగా పరాయి మగాడితో సంచరించాలనుకుంటున్నట్టేగా? అలాంటి కులటతో తను కాపరం చెయ్యాలనుకుంటున్నాడంటే ఆమె కెంతగా సరెండరయిపోయాడో తెలుస్తోంది ఈ బలహీనతని ముందు జయించాలి. తన ప్రాణాన్నే బలితీసుకోవాలనుకుంటున్న రాక్షసి గురించి తనింకా మంచిగా భావించటం, ఉన్నతంగా ఊహల్లో నిలుపుకోవడం—ఇదంతా నిజంగా బలహీనతే!

సుబ్బారావు మనసులో ఓ స్థిరమైన నిశ్చయం రూపు దిద్దుకుంటోంది.

చింతల్‌బస్తీ స్టాప్‌లో బస్‌దిగాడు. మరో పదినిమిషాల్లో ఇల్లు చేరుకున్నాడు. పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ గుమ్మందగ్గరకు చేరుకున్నాడు. అంతలో ఏదో ఆలోచనరాగా, కాంపౌండువాల్ పక్కగా ఇంటి వెనక పక్కకు వెళ్తూ పడగ్గది దగ్గిర చటుక్కున నిల్చుండిపోయాడు.

లోపల్నుంచి మాటలు వినిపిస్తున్నాయి. అతని శరీరం మీది రోమాలు నిక్కబొడుచుకున్నాయి. పిడికిళ్ళు ఆవేశంతో బిగుసుకున్నాయి. దవడ కండరం పొంగింది. తనే పరిస్థితినైతే ఎదుర్కోకూడదని భావించాడో అదే ఎదురయ్యింది.

ఒక్కసారిగావెళ్ళి వాళ్ళిద్దర్నీ నరికి పారేస్తే? ఉహూ, అలా చెయ్యటంవల్ల తను బావుకునేదేమిటి? హంతకుడి ముద్రతో ఉరికంబమెక్కటం తప్ప! తను హంతకుడు

కాకూడదు. తెలివిగా ప్లాన్‌చేసి ఇద్దర్నీ అంతంచెయ్యాలి. తను నేరస్థుడు కాకుండా నేరం చెయ్యాలి.

వెనుతిరగబోతూ పరిచితమైన మొగకంఠం విని హఠాత్తుగా ఆగిపోయాడు సుబ్బారావు.

"నీ మొగుడికి నీమీద ప్రేమ కొంచెంకూడా చెక్కు-చెదరలేదు. పాపం నిన్ను వదులుకోలేని స్థితిలో వున్నాడు. అందుకే నిన్న నన్ను సలహా అడిగితే మనిద్దరికి అనుకూలంగా వుండేలా సలహా ఇచ్చాను. కాని వాటిని పాటించ దనుకుంటాను."

ఆ గొంతు తను గుడ్డిగా నమ్మి స్నేహితుడిగా ఆదరించి ఇంటికి రానిచ్చిన నయవంచకుడు జగన్నాథానిది!

'జగన్నాథం, ఎంత ద్రోహం చేశావురా కుక్కా?' కసిగా అనుకున్నాడు సుబ్బారావు.

"అయితే ఎలా? ఈ ఘటాన్ని వదిలించుకునే దారి లేదా?" ఆ గొంతు సౌజన్యది.

ఇప్పుడా గొంతులో తనపట్ల మార్దవం బదులు నిర్లక్ష్యం, గౌరవం బదులు చులకన భావం ధ్వనిస్తున్నాయి. తనీ తిరస్కారాన్ని ఎలా భరించగలుగుతున్నాడు?

జగన్నాథం కులుకుతూ నవ్వాడు "అందుకో ప్లాన్ సిద్ధంచేశాను కదా, నీకెందుకు వర్రీ?" అన్నాడు చిద్విలాసంగా.

"అలాగే ప్లాన్ చేశావు. రెండుసార్లు బెడిసికొట్టింది. మొదటిసారి సమయానికి నువ్వు గదిలో వున్నావు కాబట్టి పిల్లి పొట్టలో గాజుముక్కలు దించి కొత్త కథ నల్లావు. రెండోసారి అతను నా చేతిలోని సూది స్పష్టంగా చూసేశాడు. సమయస్ఫూర్తి నుపయోగించి సూదిని నా జుట్టులో దాచేశాను కాబట్టి బతికిపోయాను. మళ్ళీ అలాంటి

ప్రాణాంతకమైన ప్లాన్ వెయ్యకు మహానుభావా!" కిలకిల నవ్వుతూ అన్నది సౌజన్య.

తనగురించి తన భార్య ఏకవచన ప్రయోగం చేస్తూ ప్రియుడితో అంటున్న ఆ మాటలు అతని గుండెను తూట్లుగా పొడుస్తుంటే విలవిల్లాడిపోయాడు సుబ్బారావు.

చెవులు రిక్కించాడు. జగన్నాధం చెప్పబోయే ఆ ప్లాన్ గురించి వినటానికి "నీ మొగుడు రాత్రిళ్లు నిద్రపోకుండా నిన్ను కాపలా కాస్తూన్నాడు. ఆ మాట వాడి నోటిమీదనే నిన్న విన్నాను. కాబట్టి రాత్రిళ్ళు కుదరదు పగలే ప్లాన్ చెయ్యాలి. ఈ సాయంత్రం వాడు అఫీసునించి తిరిగొచ్చాక షైరు తీసుకు వెళ్ళమని బుంగ మూతి పెట్టుకుని అడుగు. ఎక్కడకి తీసుకు వెళ్ళమంటా వని అడుగుతాడు. అందుకే నూ నీ మైకంలో పడివున్నాడు. నీకోసం ఏదైనా చేస్తాడు. టాంక్ బండ్ మీదికి తీసుకు వెళ్ళమను.

సరిగ్గా ఏడుగంటల ప్రాంతాల నేను క్యాజువల్‌గా వచ్చినట్టు అక్కడికొస్తాను. వాడికి నేనంటే వల్లమాలిన నమ్మకం. నేను వాడ్ని హత్యచేస్తానని కల్లోకూడా అనుమానించడు. నీడిల్‌కన్న సురక్షితం, సులభం అయిన మార్గం మరోటి లేదు. రెడీగా సైనేడ్ నీడిల్‌తో వస్తాను. మాటల సందర్భంలో వాడి నాడీ మండలానికి క్షణంలో విషమెక్కిస్తాను. వాడు నీ గురించి కాషస్‌గా వుంటాడు గాని నా విషయంలో చాలా అజాగ్రత్తగా వుంటాడు. అవకాశం చూసుకుని సూదితో పొడుస్తాను.

"ఆ మరుక్షణం నువ్వు అమ్మో, బాబో, పాము కాటేసింది దేవుడోయ్ అంటూ గగ్గోలెత్తించెయ్యి జనాల్ని. అందరూ చేరతారు. అప్పటికే విషప్రభావంతో నీ పతిదేవుడు దేవుడి సన్నిధికి చేరిపోతాడు. అందరు పాము కాటుతోనే చచ్చాడని నమ్మేస్తారు....

నేను అప్పుడే వచ్చినట్టు ప్రేక్షకుల మధ్యనుంచి వస్తాను. ఆటోలో శవాన్ని తీసుకుపొమ్మని సలహా ఇస్తాను. ఆటోని నేనే అరేంజి చేస్తాను. ఇంటికి తీసుకుపో. అక్కడకూడా ఓ ఏడుపు ఏడిచేశాక నీ మొగుడి ఆఫీసువాళ్ళకి నేను కబురు చెప్తాను. అందరూ వచ్చేస్తారు. అప్పుడు ఘనంగా రేపుదయం నీ మొగుడికి చివరి కర్మలు చేసేద్దాం. ఎలా వుంది ప్లాన్?" అన్నాడు జగన్నాథం చిద్విలాసంగా.

"ఈ ప్లానేదో బానే వున్నట్టుంది....సరే సాయంత్రం సరిగ్గా ఆరున్నర ప్రాంతాల ఇద్దరం టాంక్‌బండ్ మీదుంటాము. ఇక నువ్వెళ్ళితే బావుంటుందేమో....??"

"తప్పకుండా....టైం నాలుగు కావస్తోంది. ఇంకో గంటలో వాడొచ్చేస్తాడు. చెప్పిందంతా జాగ్రత్తగా ఫాలో కావాలి, తెలిసిందా?"

"తెలిసింది మహాశయా, అబ్బ, ఇక వదులు బాబూ! ఇప్పటిదాకా నలిపేసింది చాలు. నా ఎముకలు విరిగిపోయేలా వున్నాయి."

"ఓస్ ఈమాత్రానికేనా? ఓ వారం రోజులు పోనియ్, మనకిక అడ్డే వుండదు. మ్చ....మ్చ....బై!"

అప్పటికే సుబ్బారావు గేట్లోంచి బయటకొచ్చేసి రోడ్డెక్కాడు. అతని రక్తం సలసల మరిగిపోతోంది. ప్రతీ

తార వాంఛలో నరనరం పొంగిపోతోంది.

"ఒరేయ్ జగ్గూ రాస్కెల్, గెట్ రెడీ!" అనుకున్నాడు కసిగా.

3

సుబ్బారావు, సౌజన్య టాంక్‌బండ్ మీద సిమెంట్ బెంచీమీద కూర్చున్నారు.

సాయంత్రం ఆరూనలభై అయింది.

సౌజన్య భర్తమీద ఒరిగిపోతూ చాలా హుషారుగా కబుర్లు చెపుతోంది. మధ్య మధ్య అతనేం మాట్లాడినా అదో జోక్ అన్నట్టు పడిపడి నవ్వుతోంది.

ఏడుగంట లవుతుండగా జగన్నాధం వారిముందు నుంచి వెళ్తూ అకస్మాత్తుగా ఆగి "వాటే సర్‌ప్రైజ్! సుబ్బారావ్, ఈరోజు చాలా ఫ్రెష్‌గా కనిపిస్తున్నావు. ఎవ్విరిథింగ్ సెటిల్డ్ ఐ థింక్!" అన్నాడు, సుబ్బారావు పక్కనే కూచుంటూ అతని చెవిలో.

సుబ్బారావు నవ్వుతూ చూశాడతనివంక. "సౌజీ అమృతమూర్తిరా! నేను నిన్న నీతో అన్న మాటలన్నీ వాపసు తీసుకుంటున్నాను. షి ఈజ్ ఏన్ ఏంజిల్! నిజంగా దేవతేరా" అన్నాడు పశ్చాత్తాపం నిండిన గొంతుకతో.

"నాకు తెలుసు, సౌజన్యగారు చాలా మంచి మనిషి. నీ కనుకూలమైన అణుకువగల భార్య. ఇప్పటికయినా ఆమెని సరిగ్గా అర్థం చేసుకున్నందుకు చాలా సంతోషంగా వుంది సుబ్బారావ్. కంగ్రాట్స్ ఇప్పటికయినా నీ సంసారం చక్కబడ్డందుకు" హుషారుగా చెప్పాడు జగన్నాధం.

ముగ్గురు సరదాగా మాట్లాడుకుంటూ జోక్స్ కట్ చేసుకుంటూ ఎనిమిదిన్నరవరకు గడిపేశారు.

టాంక్‌బండ్ పూర్తిగా పలచబడిపోయింది. ట్రాఫిక్ కూడా బాగా తగ్గిపోయింది.

ఉండి వుండీ ఒకో స్కూటరో, ఆటోనో, సిటీ బస్సో బండ్‌మీద వెళ్తున్నాయి.

జగన్నాధం కొంచెం కొంచెం సుబ్బారావువైపు జరిగాడు. సుబ్బారావు చాలా ఎలర్టుగా వున్నాడు.

జగన్నాధం కుడిచెయ్యి ముందుకు జరగటం తనని తాకబోతుండటం షార్ప్‌గా గుర్తించాడు సుబ్బారావు. చటుక్కున లేచిపోయాడు.

జగన్నాధం చెయ్యి విసురుగా వచ్చి సౌజన్య చేతిమీద అతి చిన్న గాయం చేసింది. మరుక్షణం అతని చేతిలో వున్న సైనేడ్ నీడిల్ విషాన్ని ఆమె శరీరంలో కక్కటం ఆమె బెంచీమీద ఒరిగిపోవటం, మెరుపువేగంతో సుబ్బారావు జగన్నాధం చేతిలోని నీడిల్ అందుకుని జగన్నాధం కాలి నరంమీద గుచ్చటం చాలా వేగంగా జరిగిపోయాయి.

ఇద్దరు చెరోవైపుకి ఒరిగిపోయారు. సైనేడ్ చాలా తొందరగా పనిచేసింది. చాలా పవర్‌ఫుల్ సైనేడ్!

విగతజీవులై రాలిపోయిన ఆ ఇద్దరివంక అసహ్యం నిండిన చూపుల్తో చూసి నెమ్మదిగా అక్కడ్నుంచి అడుగులు వేస్తూ రోడ్‌మీది కొచ్చి పోతున్న ఆటోని పిలిచి ఎక్కి కూచున్నాడు సుబ్బారావు.

ఇప్పుడతని మనసు చాలా తేలిగ్గా వుంది! □

రక్షణ కవచాలు

ఫణిబాబు

బూటు లేసులు బిగించుకోవడం పూర్తికాగానే లేచి నిలబడ్డాను.

అది చాలా ప్రత్యేకమైన బూటు. ఎంత వేగంగా పరిగెత్తినా ఏ మాత్రం శబ్దం కాదు. నాకున్న అనేక వ్యాపారాలలో చెప్పుల వ్యాపారం ఒకటి. మా కంపెనీలో తయా

రయిన బూట్లవి. ప్రత్యేకంగా ఈ రోజుకని వేసు కున్నాను.

మంచంవైపు నడిచాను. దిండు క్రిందవున్న పిస్టల్ తీసి జేబులో పెట్టుకున్నాను. ఆ తర్వాత డ్రస్సింగ్ టేబుల్‌పై వున్న కుక్కను కట్టివేసే గొలుసు తీసి ఇంకో జేబులో వేసుకున్నాను.

ఇంటినుండి బయటపడ్డాను. నిర్మానుష్యంగా వున్నాయి రోడ్లు రాత్రి కావడంతో చీకటిలో మునిగి తేలుతున్నాయి. టార్చిలైటు కావాలనే తీసుకురాలేదు. నా వద్ద ఎక్కువ వస్తువులు ఉండటం మంచిది కాదు. ఉంటే శవం దగ్గర మర్చిపోయే ప్రమాదం వుంది.

యస్! నేను హత్య చేయాలని బయలుదేరాను. కరుణా కర్‌ని చంపివేయాలనే దృఢనిశ్చయంతో బయలు దేరాను.

కరుణాకర్ నా ప్రాణస్నేహితుడు. సృష్టిలో స్నేహాన్ని మించింది లేదని ఒకప్పుడు నేను గాఢంగా నమ్మాను. అందుకే వీధులవెంట ముష్టి ఎత్తుకునే కరుణాకర్‌కు నా కున్న అనేక వ్యాపారాలలో భాగం ఇచ్చాను. సంఘంలో ఒక స్థానం కల్పించాను.

కాని వాడేం చేశాడు? సృష్టిలో స్వార్థానికి మించింది ఏమీలేదని నిరూపించాడు. నా వ్యాపారంలో దొంగ లెక్కలు చూపి లక్షలకు లక్షలు కాజేసాడు. అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు నా దగ్గిర వున్నాయి. కావాలంటే ఈ క్షణంలో వాడిని చట్టానికి అప్పగించ గలను. కాని అలా చెయ్యను.

నాకు చేసిన నమ్మకద్రోహానికి వాడికి తగిన శిక్ష చావే. వాడిని నా చేతులతో చంపితేగాని నా కక్ష తీరదు.

అందుకు చాలా పగడ్బందీగా ప్లాన్ వేశాను.

నా ప్లాన్‌లో రాఘవరావుకు కూడా చోటుంది. రాఘవ రావు నాకు వరసకు మేనమామ అవుతాడు. ఆయన కూతురుని పెళ్ళి చేసుకుని ఆ వరసను సార్థకం చేద్దామని ఆశపడ్డాను.

రాఘవరావు సరోజ తండ్రి. సరోజ నేను ప్రేమించు కున్నాము. నా వంటి ఆస్తిపరుడు, అందగాడు కోరి నీ కూతురిని పెళ్ళి చేసుకుంటాను అని చెబితే ఎవరైనా ఆనందంగా నా కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిన జల్లుకుం టాను.

కాని రాఘవరావు ఒప్పుకోలేదు. నీ వంటి తాగుబోతుకు పిల్లను ఇవ్వను అని ఖండితంగా చెప్పేశాడు. అక్కడికి ఎంతో బ్రతిమాలాను. నేను బ్రతికివుండగా నా కూతుర్ని నువ్వు పెళ్ళి చేసుకోలేవు అన్నాడు.

సో! ఇప్పుడు నేను కొట్టవలసింది రెండు పిట్టల్ని. ఒకే ఎయిమ్‌లో పడగొట్టాలి. ఒక దెబ్బకు రెండు పిట్టలు.

అందుకే ఏమాత్రం అనుమానం కలగకుండా రాఘవరావు పిస్టల్ సంపాదించాను. అంతేకాదు రాఘవ రావు కాల్చిపారేసిన సిగరెట్టు పీకలు కూడా జాగ్రత్తగా ఏరి దాచాను.

పిస్టల్ తుడిచి క్రొత్త అమ్యూనిషన్‌తో లోడ్ చేశాను. బుల్లెట్స్ ఎక్కించిన తర్వాత పిస్తోల్‌ని జాగ్రత్తగా నా వేలిముద్రలు లేకుండా తుడిచేశాను.

ఇక మిగిలింది పిస్తోల్‌లోని ఆరు బుల్లెట్లు కరుణాకర్ గుండెల్లోకి పంపడం మాత్రమే. ఇప్పుడు నేను బయలు దేరింది అందుకే.

రాత్రి పదిగంటల ప్రాంతం కావడంతో వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. కరుణాకర్ ఇంటిముందు ఆగి చుట్టూ చూశాను. ఎవ్వరూ లేరు. గేటుతాళం వేసివుంది. మరోమారు చుట్టూ చూశాను. అయినా ఎవ్వరూ లేరు. గేటు ఎక్కి లోపలకు దూకాను.

ఇప్పుడు లైకా కోసం ఎదురుచూడాలి. అలాగే నిల బడ్డాను. చేయబోయే సాహసం గుర్తుకువచ్చి నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

ఒక్క అడుగు కూడా కదలకుండా అలాగే నిల బడ్డాను. షడన్‌గా నా కుడివేపు అలికిడి వినిపించింది. చటుక్కున తలత్రిప్పి చూశాను.

అక్కడ....

2

నేలపై నుండి నాలుగడుగుల ఎత్తులో వుందది. దాని చెవులు నిక్కబొడుచుకుని వున్నాయి. కళ్ళు చాలెంజిగా నా వైపు చూస్తున్నాయి.

జర్మన్ షెపర్డ్ డాగ్. కుక్క అన్నింటిలోను అత్యంత విశ్వాస పాత్రమైన జాతి. దాని పేరు లైకా. లైకాను చిన్న పిల్లగా వున్నప్పుడు నేనే కరుణా కర్‌కు ప్రెజంట్ చేశాను.

"లైకా!" చిన్నగా పిల్చాను.

నా గొంతుకు వింటూనే లైకాలో మార్పు వచ్చింది. తోక వూపుతూ నా దగ్గరకు వచ్చింది. మృదువైన మాట లతో చిన్నగా దాని తలపై చెయ్యివేస్తూ నిమిరాను. హాపీగా నిట్టూర్చాను. లైకా నన్ను దగ్గరకు రానిస్తుంది. అయినా ఈ అర్ధరాత్రిపూట ఇక్కడ నా ఉనికిని సహి స్తుందా? అనే అనుమానంతో వున్నాను. ఒకవేళ అది

ఎదురు తిరిగితే దానికి ఒక బుల్లెట్ ఖర్చు చేద్దామను కున్నాను. అదృష్టవశాత్తు ఆ అవసరము లేదు.

దానిని పెరడు వయిపు తీసుకు వెళ్లాను. జేబులో నుండి గొలుసు తీసి దానిని కట్టేశాను. ఇప్పుడు నా పనికి మధ్యలో అది అడ్డు రాదు.

లోపలకు నడిచాను. పెరటి వయిపు తలుపు గుండా లోపలకు వెళ్ళాను. ముందు గదిలో సోఫాలో కూర్చుని వున్నాడు కరుణాకర్. వాడి ముందు ఒక టీపాయ్ వుంది. దానిమీద ఒక విస్కీబాటిల్, సోడా సీసా వున్నాయి. ప్రక్కన ప్లేటులో కాజూనట్స్, వున్నాయి. విస్కీసీసా మూడు వంతుల వయిగా ఖాళీగా వుంది.

చిన్నగా దగ్గాను. బరువుగా వాలిపోతున్న కనురెప్పలు పైకెత్తి నా వైపు చూసాడు కరుణాకర్. నన్ను గుర్తు పట్టినట్లు చిన్నగా నవ్వాడు.

నేను బదులు నవ్వలేదు. వాడిని చూస్తుంటే నా శరీరంలోని నరం నరం అసహ్యంతో బిగుసుకుంటు న్నాయి. జేబు నుండి మెరుపులా పిస్టల్ తీసాను.

దానిని చూస్తూనే అంత మత్తులోను కరుణాకర్ ఉలిక్కిపడ్డాడు. వాడి కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి. తక్కున లేచి నిలబడ్డాడు.

వాడి భుజంపైకి గురిపెట్టి కాల్చాను. వెనక్కి తూలి పడ్డాడు. కంగారుగా మళ్ళీ లేవబోయాడు. మళ్ళీ కాల్చాను. కుడి తొడలోనికి బుల్లెట్ చొచ్చుకు పోయింది. దెబ్బకు తాగిన మత్తంతా దిగిపోయి వుంటుంది. రెండు చేతులు దగ్గిరకు చేర్చి ప్రాధేయపూర్వకంగా చూసాడు.

జాలిపడలేదు నేను. ఈ భయం ముందే వుండాలి.

ఇప్పుడు చాలా ఆలస్యమైపోయింది. నిప్పును తెలిసి ముట్టుకున్నా, తెలీక ముట్టుకున్నా కాలుతుంది. ఎడమ భుజంపయివు గురిపెట్టి కాల్చాను.

సరిగ్గా అదే సమయంలో కరుణాకర్ ప్రక్కకు బోయాడు. వాడి ప్రయత్నం ఏమాత్రం ఫలించలేదు. బుల్లెట్ వాడి గొంతులో దిగిపోయింది. కట్టెలా వెనక్కు విరుచుకు పడిపోయాడు.

బాడ్ లక్! ఇంకా మూడు బుల్లెట్లు మిగిలి వుండగానే చనిపోయాడు. చేతిలోని పిస్టల్ ఆ గదిలోనే వున్న బీరువా క్రిందకు విసిరేసాను.

జేబులో నుండి చిన్న ప్లాస్టిక్ ఫోల్డర్ విప్పి సిగరెట్ పీకలు గది నలుమూలలకూ విసిరేసాను. పిస్టల్‌పై లేక పోయినా రాఘవరావు వ్రేలి ముద్రలు సిగరెట్స్ మీద వున్నాయి. ఒక్కసారి చేసిన పనంతా సమీక్షించాను.

రాఘవరావుకు కరుణాకర్‌కు మధ్య చాలా పాత కక్ష లున్నాయి. కరుణాకర్ చనిపోగానే పోలీసుల అనుమానం రాఘవరావుపైకి మళ్ళుతుంది. పైగా హత్య జరిగింది రాఘవరావు తుపాకీతో. ఆపైన ఆ గదిలో అతను కాల్చి పారేసిన సిగరెట్ బట్స్ వున్నాయి.

తృప్తిగా వెనుదిరిగాను. ఆ ఇంటి నుండి బయట పడగానే నేను చేసిన మొదటి పని నా చేతులకున్న ట్రాన్స్‌పరెంట్ గ్లౌజస్ తీసి జేబులో పెట్టుకోవడం.

3

మొదటి రెండు రోజులు ప్రశాంతంగా గడిచి పోయాయి.

రాఘవరావే కరుణాకర్‌ని చంపినట్లు సాక్ష్యాలు

స్పష్టంగా కనిపిస్తున్నాయి. పోలీసులు నన్ను అనుమానిస్తారనే చింత నాకు ఎప్పుడూ లేదు. అయినా రొటీన్ వర్క్‌గా రాఘవరావుతోపాటు నా వేలిముద్రలు తీసుకున్నారు.

అయితే మూడవ రోజు ఇన్‌స్పెక్టర్ రవి తన బలగంతో నా దగ్గిరకు వచ్చాడు.

"హల్లో ఇన్‌స్పెక్టర్!" ఎదురు వెళ్ళి విష్ చేసాను.

"హల్లో! ఒక చిన్న పనిమీద వచ్చాను" చెప్పాడు రవి.

"ఏమిటో చెప్పండి."

"మీ స్నేహితుడు కరుణాకర్‌కు మీరు ఒక కుక్కను ప్రజెంట్ చేసారట కదా?"

"అవును జర్మన్ షపర్డ్. చాలా మంచి బ్రీడ్ అది. నన్ను కరుణాకర్‌ని తప్ప ఇంకెవ్వరిని దగ్గిరకు రానివ్వదు."

"అయితే మిమ్మల్ని అరెస్టు చెయ్యక తప్పదు."

"ఎందుకు?"

"మీ స్నేహితుడు కరుణాకర్‌ని హత్య చేసినందుకు."

ఉలిక్కిపడ్డాను. కళ్ళలో ఆందోళన తళతళ మెరుస్తుండగ రవి వైపు చూసాను.

"చాలా నీట్‌గా ఏమాత్రం అనుమానం రాకుండా హత్య చేసారు. కాని కరుణాకర్ పెంపుడు కుక్కను తీసుకు వెళ్ళి పెరటిగేటుకు కట్టివేయడమే మిమ్మల్ని పట్టించింది. మీరు, కరుణాకర్ తప్ప ఆ కుక్కను ఇంకెవ్వరూ కట్టలేరు. రాఘవరావు కరుణాకర్‌ని చంపాలంటే ముందు ఆ కుక్కని చంపాలి. కాబట్టి మిమ్మల్ని అనుమా

నించాను'' చెప్పాడు రవి.

"ఇంత చిన్న ఆధారంతో నన్ను అరస్ట్ చేస్తారా?" ఆశ్చర్యంగా అన్నాను.

"అంతే కాదు - ఇంకా బలమైన ఆధారం ఒకటి వుంది. బుల్లెట్లను పిస్టల్ బట్‌లో లోడ్ చేసినపుడు మీ వేలిముద్రలు ఆ కాట్రిడ్జెస్‌పై క్లియర్‌గా పడ్డాయి. మీరు ఫైర్ చేసిన మూడు బుల్లెట్లు తీసివేస్తే మిగిలిన మూడు బుల్లెట్లపైన మీ వేలిముద్రలున్నాయి'' చెప్పాడు రవి.

నాకు గొంతు తడారిపోయింది. మతిపోయినవాడిమల్లె చూసాను.

బుల్లెట్స్ లోడ్ చేసినపుడు వేలిముద్రలు బుల్లెట్ మెటల్ కేసింగ్‌పై పడతాయి. ఫైర్ అయిన బుల్లెట్స్‌ని మినహాయిస్తే మిగిలిన వాటిపై స్పష్టంగా వుంటాయి.

"అంతే కాదు - ఇంకో ఘోరమైన పొరబాటు కూడా మీరు చేసారు. కుక్కను కట్టడానికి పెరటివయిపు వెళ్ళినప్పుడు అక్కడి తడి నేలపై మీ బూటు ముద్రలు పడ్డాయి. ట్రాజడీ ఏమిటంటే ఆ బూటు చాలా మోడ్రన్‌గా వుంది.

"మీ షూ కంపెనీలో తయారయిన ఆ బూటు ఇంకా మార్కెట్‌లోకి రాలేదు. మీ కంపెనీ ఉద్యోగులు కూడా దానిని ఉపయోగించడం లేదు. కేవలం మీరు మాత్రమే వాడుతున్నారు.''

మాట్లాడలేదు నేను ....

మాట్లాడటానికి ఏముంది? నా రక్షణ కవచాలు ఒకొక్కటి దూదిపింజలై ఎగిరిపోతున్నాయి. మౌనంగా చేతులు చాపాను. □

15

పవిత్ర రాత్రి

జొన్నలగడ్డ రామలక్ష్మి

ఆ రోజు ఆఫీసుకు సెలవుపెట్టాను. ఎందుకో బాగా తలనొప్పిగా ఉంది. ఇంట్లో నేను తప్ప ఎవ్వరూ లేరు. శ్రీమతి పురిటికని పుట్టింటికి వెళ్ళింది. తనకింకా ఏడవ నెల. తొలికాన్పు కాబట్టి అయిదవ నెలలోనే తల్లి ఆమెను తీసుకుని వెళ్ళింది.

రెండు నెలలుగా ఒంటరిగా ఉంటున్నా నాకంత బాధగా అనిపించలేదు. ఆఫీసులో ప్రమోషన్‌కోసం పరీక్షలకు కడుతున్నాను. శ్రీమతి దగ్గరలేని ఈకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలికదా!

రోజూ ఉదయం పనిమనిషి వస్తుంది. ఇల్లు శుభ్రం చేసి నాకు కాఫీ కలిపి వెడుతుంది. టిఫిను. భోజనం బయటే కానిస్తున్నాను. వంట చేసుకోవడమంటే మహా బద్ధకం నాకు.

ఎన్నడూ లేని తలనొప్పి ఆరోజెందుకో మరి!

అలా కళ్ళు మూసుకుని పడుకున్నాను.

వెంటనే కళ్ళముందు శ్రీమతి ప్రత్యక్షమయింది. అమృతాంజనం రాయనా అని గోముగా అడిగింది. నేను మాట్లాడలేదు. ఆమె నుదుటిమీద చేయివేసి—"అబ్బా—జ్వరం—" అంది.

చటుక్కున కళ్ళు తెరిచాను.

గదిలో మళ్ళీ నేనొక్కడినే!

కానీ—నా తలనొప్పి మాయమైపోయింది.

ఊహలో శ్రీమతి స్పర్శకే తలనొప్పి మాయమైపోయిందా?

నాకు తెలుసు. అన్నింటికన్నా బలమైనది మనిషి మనసు. అది రోగక్రిములను కూడా తరిమివేయగలదు తలచుకుంటే!

నన్ను నిజంగా శ్రీమతి తాకినట్లే ఉంది. ఆ స్పర్శానుభూతికోసం మరోసారి కళ్ళు మూసుకున్నాను.

ఈసారి నాకు స్పర్శానుభూతి కలగలేదు.

"పోస్ట్!" అన్న కేక వినిపించింది.

వెళ్ళి తలుపుతీశాను.

కవరు ....

చిరునామా ముత్యాలకోవలాంటి దస్తూరిలో ఉంది. ఫ్రం అడ్రసులేదు ఆ దస్తూరీ నాకు పరిచితంగా తోచలేదు.

కవరు చింపి ఉత్తరం బైటకు తీశాను.

"డియర్ రాజూ!" అని ప్రారంభమైంది ఉత్తరం.

రాజు.. రాజు....

ఇలాగని అమ్మ నన్ను పిలుస్తుంది. అమ్మ చెల్లెలు పిన్నికూడా పిలుస్తుంది.

కానీ ఇద్దరిలో ఎవరూకూడా నన్ను డియర్ అనరు.

నా స్నేహితులెవరూ నన్ను రాజూ అనరు. రాజా అంటారు.

అమ్మ, పిన్ని కాక నన్ను రాజూ అనేవాళ్ళింకెవరో ఉన్నారు. ఎవరో ఉన్నారు. ఎవరు? ఎవరు వారు?

ఉత్తరం వెనక్కి తిప్పి సంతకం కోసం చూశాను.

"నీ — సురేఖ" అని ఉందక్కడ.

వెంటనే నాకు సురేఖ గుర్తుకు వచ్చింది.

ఉద్యోగంలో చేరే ముందు ట్రయినింగుకని పంపారు నన్ను. అదొక చిన్నపట్నం.

ఆ పట్నంలో నాకు పరిచయమయింది సురేఖ.

అక్కడ నేను ఆర్నెల్లున్నాను. ఆరు నెలలూ ఆరు క్షణాల్లా కరిగిపోయాయంటే అందుక్కారణం సురేఖ.

సురేఖ కళావంతుల పిల్ల. కానీ ఆమెకు పెళ్ళి చేసుకోవాలనుంది.

చూడగానే ఎంతో అందంగా అనిపిస్తుందామె. ఆమె నవ్వితే వెన్నెలలు కురిసినట్టే ఉంటుంది.

తల్లి ఆమె శరీరాన్ని వ్యాపారానికుపయోగించాలనుకుంటోంది. అప్పటికే సురేఖ తల్లికా ఊళ్ళో రెండుమేడ

లున్నాయి.

"నీకై నువ్వో రెండు మేడలు కట్టుకోవాలి" అంటుం దామె.

అప్పుడు సురేఖ వయసు పద్దెనిమిది ఉంటుంది. ఆమె చాలా ఆరిందాలా మాట్లాడేది. అందం కారణంగా ముఖంలో అమాయకత కనబడ్డప్పటికీ ఆమె చాలా చాలా తెలివైనది.

మా పరిచయం ఒక పార్కులో జరిగింది. ఆ తర్వాత నుంచి తరచుగా ఆ పార్కులోనే కలుసుకుంటూండే వాళ్ళం.

"అమ్మ నాకు పెళ్ళి కాదంటుంది. ఎవరైనా నన్ను పెళ్ళి చేసుకుందుకు ముందుకు వస్తే గనుక—ఇచ్చి చేయ డానికి తను సిద్ధమేనంటుంది. నన్ను పెళ్ళి చేసుకుంటా నని చాలామంది అంటున్నారు, అవన్నీ ఉత్తమాటలని నాకు తెలుసు. నా మనసు తెలుసుకుని నన్ను ప్రేమించే వాడికోసం చూస్తున్నాను నువ్వు కనిపించావు" అందామె ఒకరోజున నాతో.

"నాగురించి నీకు నమ్మకమా?" అనడిగాను.

"ఊఁ" అందామె.

"అందుక్కారణం!" కుతూహలంగా అడిగాను.

"కారణం చెప్పలేను. తొలిచూపులోనే నేను నిన్ను ప్రేమించాను. నాకు నువ్వు నచ్చావు. ఆడది వచ్చినవాణ్ణి నమ్మాలనుకుంటుంది. వాడు మోసగాడని ఇతరులు ఋజు వులు చూపించినా నమ్మాలనుకోదు. బహుశా నేనూ అదే స్థితిలో ఉన్నానేమో!"

అబద్ధమెందుకూ — నాకప్పుడు సురేఖ ఎంతగానో నచ్చింది. ఆమెను పెళ్ళిచేసుకోవాలన్న ఆవేశంకూడా

నాక్కలిగింది. ఆమె నాకు దక్కకపోతే నా జీవితం శూన్యమైపోతుందనిపించింది.

ఆ మాటలామెకు చెప్పాను.

"సిది తాత్కాలికావేశం. ఎదురుగా నేను కనబడుతున్నాను కాబట్టి నాగురించి ఆలోచిస్తున్నావు. నేను కనపడకపోతే నువ్వు నన్ను మర్చిపోతావు" అందామె.

"అసాధ్యం!" అన్నాను.

"అయితే వెంటనే మీవాళ్ళ కుత్తరం రాసి మన పెళ్ళికొప్పించు" అందామె.

"అలాగే!" అన్నాను ఆవేశంగా.

రాత్రి నాన్న పేరున ఉత్తరం రాయాలని కూర్చున్నాను. వెంటనే ఆయన విశ్వరూపం నాకళ్ళముందు ప్రత్యక్షమయింది.

ఉత్తరం రాయలేకపోయాను.

మర్నాడు సురేఖను కలుసుకున్నప్పుడా విషయం చెప్పాను. ఆమె నన్ను పరిహసిస్తుందనుకున్నాను కానీ నావంక ఆత్మీయత వొలికించే నవ్వొకటి విసిరి—"నువ్వు నిజాయితీ పరుడివి. అందుకే నువ్వంటే నాకిష్టం—" అంది.

"కానీ నా నిజాయితీకి ఋజువుకావాలి...." అన్నాను.

"నా మనసే అందుకు ఋజువు...."

"అలాకాదు. నేను సిన్ను తలిదండ్రులకు చెప్పకుండా పెళ్ళిచేసుకుంటాను—నువ్విష్టపడితే!"

సురేఖ నా వంక ఆశ్చర్యంగా చూసింది.

"నేను నిజం చెబుతున్నాను...." అన్నాను.

సురేఖ నా చేయితీసుకుని మృదువుగా ముద్దుపెట్టుకుని

"నువ్వు చాలా మంచివాడివి రాజూ!" అంది.

ఆమెకు నన్ను రాజూ అని పిలవాలని ఎందుకనిపించిందో తెలియదు. ఆ పిలుపు నా శరీరానికి గిలిగింతలు పెడుతుంది.

"మంచివాళ్ళందర్నీ అదృష్టం వరించదు. నిన్ను పెళ్ళి చేసుకుంటే నేను అదృష్టవంతుణ్ణవుతాను—" అన్నాను.

సురేఖ అదోలా నవ్వి—"డదానికి అందం గొప్ప విశేషంకాదు. అది శాశ్వతమూ కాదు. నీవంటివాడు నన్ను భార్యగా ఆదరిస్తే అది నా అదృష్టం" అంది.

"పెళ్ళి నీకిష్టమేగా...." అన్నాను.

"ఇష్టమే కాదు. అవసరం కూడా!"

"అవసరమెందుకయింది?"

"మా అమ్మ నాకు రెండు నెలలు గడువిచ్చింది. ఈ లోగా నన్నెవ్వరూ పెళ్ళి చేసుకోకపోతే - నేను తను చెప్పినట్లు వినాలట...."

నేను ఆశ్చర్యంగా - "కానీ - మీ అమ్మ నిన్నిలా ఫ్రీగా వదిలేసింది. ఏ పెళ్ళి నిన్నే చేసుకోమందా?" అన్నాను.

"అవును...."

"ఆ విధంగా ఆమె ఎంతో మంచిది."

సురేఖ నిట్టూర్చి - "పద్దెనిమిదేళ్ళ కన్నెపడుచు తనకు తానయి వరుణ్ణి వెతుక్కోగలదా? ఆమె తప్పటడుగు వేయదా? మోసానికి గురి కాదా? అలా జరిగితే అప్పుడు తన పని మరింత సానుకూలమవుతుందని మా అమ్మ ఆశ...." అంది.

"దారుణం...." అన్నాను.

"దారుణమే మరి!" అని నవ్వింది సురేఖ.

"నేను మీ అమ్మ ఆశలు త్రుంచేస్తాను...."

"థాంక్యూ రాజూ...." అందామె.

"మనమీరోజే గుడిలో పెళ్ళి చేసుకుందాం...." అన్నాను.

"గుడిలోనా?" అంది సురేఖ నిరుత్సాహంగా.

"అవును-ఏం? అది మన సంప్రదాయం."

"మన సంప్రదాయంలో గుడి అంటే నాకు భయం. గుడి మతం పేరిట మనుషుల మధ్య చిచ్చు రేపింది. గుడి కాలం పేరిట కొందరు మనుషుల్ని అంటరాని వాళ్ళను చేసింది. గుడి సంప్రదాయం పేరిట మావంటివారిని దేవ దాసీలను చేసి సామాన్య సుఖజీవితానికి దూరం చేసింది. మన సంప్రదాయంలో పెళ్ళి నాకు నచ్చింది. గుడి నచ్చ లేదు. మన పెళ్ళి గుడిలో జరిగితే - నాకు జరిగిన అన్యా యానికి నేనే తలవంచినట్లవుతుంది" అందామె.

ఆమె మాటల్లో ఆవేశముంది.

"అయితే మరెక్కడ?"

"రిజిష్ట్రారాఫీసులో...."

ఉలిక్కిపడ్డాను.

సురేఖ నన్ను నమ్మడం లేదా?

ఆమె నా కళ్ళలో అనుమానాన్ని చదివింది.

"నువ్వు నన్ను నిష్కల్మషంగా పెళ్ళి చేసుకోవాలను కుంటున్నావు. అలాంటప్పుడు గుడిలో బదులు రిజిష్ట్రా రాఫీసులో పెళ్ళి చేసుకుందుకు నీ కభ్యంతరముండ కూడదు" అందామె.

"అభ్యంతరం కాదు. నువ్వు నా నిజాయితీని శంకిస్తు న్నావు...."

"అలాగంటే నువ్వు నన్ను శంకిస్తున్నట్లు" అంది

సురేఖ.

"ఎందుకని?"

"మన పెళ్ళికి తిరుగులేని ఋజువుండాలి నాకు. అందుకే రిజిష్ట్రారాఫీసు కోరుకుంటున్నాను...." అని అందామె.

"నేను నిన్ను మోసం చేస్తానని అనుమానమా?"

"రాజూ! నువ్వు మోసం చేస్తానంటే మోసపోవడానికి సిద్ధంగా ఉన్నాను. మన పెళ్ళి రిజిష్ట్రారాఫీసులోనే జరగవచ్చు. కానీ నేనది నీ దగ్గిర ఋజువుగా ఉపయోగించను. నీ విశ్వాణ్నించి వెళ్ళిపోయాక నన్ను తీసుకుని వెళ్ళకుండా - నీ తలిదండ్రుల మాట విని మళ్ళీ పెళ్ళి చేసుకున్నావనుకో. నేను మళ్ళీ నీ జీవితంలో ప్రవేశించను."

"అయితే మన పెళ్ళికి ఋజువెందుకు?"

"ఋజువు నా కోసం. నన్ను మా అమ్మ బారినుంచి రక్షించుకోవడం కోసం...." అంది సురేఖ.

నాకామె అభిప్రాయం అర్థమయింది. ఆమె అబద్ధమాడటం లేదని నమ్మకం కుదిరింది.

అయిదు వారాల తర్వాత మా యిద్దరి పెళ్ళి రిజిష్ట్రారాఫీసులో జరిగింది. సాక్షి సంతకాలకు నా స్నేహితుడొకడు. సురేఖ తల్లి వచ్చారు.

సురేఖ తల్లి నాతో - "బాబూ! నువ్వావేశంలో ఈ పెళ్ళి చేసుకున్నావు. నీ తలిదండ్రులీ పెళ్ళి నామోదించరు. సమాజం వెక్కిరిస్తుంది. నువ్వది భరించలేవు. నీ వంటి వాడికి జీవితం సాఫీగా నడిచిపోవాలి. నీ జీవితంలో సురేఖ తుఫాను అవుతుంది" అని హెచ్చరించింది.

"పెళ్ళయిపోయాక కన్న తల్లిగా మీరిలా మాట్లాడకూడదు" అన్నాను.

"నేను కన్నతల్లిగా మాట్లాడడం లేదు. అనుభవంతో మాట్లాడుతున్నాను. మీ సంసార జీవితం సాఫీగా సాగదు" అందామె.

సురేఖ తల్లి నా స్నేహితుడితో - "నీ మిత్రుడు రేపు మరో వివాహం చేసుకుంటే నా కూతురికేదో అన్యాయం జరిగిపోయిందనుకుని నీవు రక్షించడానికి బయల్దేరకు. అతడేం చేసినా నాకూ, నా కూతురికీ సమ్మతమే!" అంది.

నా కాశ్చర్యంగా ఉంది. పెళ్ళయిన వెంటనే ఇలాంటి హామీలు లభించే అవకాశం పెళ్ళికొడుకులకుంటే - చాలా మంది రోజుకో పెళ్ళి చేసుకుంటారు.

ఆ రాత్రి మొదటిసారిగా నేను, సురేఖ ఏకాంతంగా గడిపాం.

స్థలం—సురేఖ తల్లి యిల్లు!

కళావంతుల యిల్లు కాబట్టి శోభనం గది కళాత్మకంగా అలంకరించబడింది.

అలాంటి గదిలో ఒక్కరాత్రి గడిపితే చాలు ...జన్మ ధన్యమైనట్లే అనిపించింది నాకు.

పాన్పుమీద సురేఖ నాకు కాస్త దూరంగానే కూచుంది. నేను దగ్గరగా జరగబోతే వారించి - "మనం కొన్ని విషయాలు మాట్లాడుకోవాలి" అంది.

"ఇది శృంగార వేళ ...." అన్నాను.

"ముందు నేను చెప్పేది విను ...." అందామె.

"వినను... ఈ పూట నేను చెప్పేది నువ్వు వినాలి" అన్నాను.

"రాజూ! ...." అందామె హెచ్చరికగా.

నేను మంత్రముగ్ధుడినయిపోయాను. ఆపైన ఆమె

చెప్పేది వినక తప్పనూలేదు.

"మా అమ్మ మాటలు విన్నావుగా. రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి జరిగినా మనది తాత్కాలిక వివాహమనే అనుకుం టోందామె. నువ్వు నన్ను మరిచిపోతే ఆ దెబ్బతో నేను తనకు లొంగివస్తాననుకుంటోంది...." అంది సురేఖ.

"ఇంటికి వెళ్ళగానే అది నా వ్యక్తిత్వానికి సవాలుగా తీసుకుంటాను—...." చాలా ఆవేశంగా అన్నాను.

"నీ వ్యక్తిత్వానికి సవాలిప్పుడే ఇక్కడే ప్రారంభ మవుతోంది...."

ఉలిక్కిపడ్డాను.

"అవును రాజూ! మా అమ్మ నిన్ను తప్పు అంచనా వేసింది. నువ్వు కేవలం నా శరీరంమీద మోజుపడి నన్ను పెళ్ళి చేసుకున్నావనుకుంటోంది. మోజు తీరగానే నన్ను వదిలేస్తావనుకుంటోంది. వదిలేయడానికే నిన్ను ప్రోత్స హిస్తోంది...."

"అయితే?"

"రాజూ—నువ్వు నన్ను శరీరంమీద మోజుతో పెళ్ళి చేసుకోలేదు. నిజంగా నన్ను నీ జీవిత భాగస్వామిగా చేసుకోవాలనుకున్నావు...."

"అయితే?"

"నీవు నీ తలిదండ్రులకు చెప్పి ఒప్పించు. మనం కాపురం పెట్టాకనే దగ్గరవుతాం. అంతవరకూ ఎప్పటి లాగే స్నేహంగా ఉందాం...."

దెబ్బతిన్నాను. ఆమెవంక అదోలా చూస్తే—"అలా చూడకు రాజూ! అందరు మగాళ్ళూ అలాగే చూస్తారు నా వంక. నువ్వు నా భర్తవు. వాళ్ళకు భిన్నంగా ఉండాలి. మనం కలిసి కాపురం ప్రారంభించేవరకూ నువ్వు నన్ను

తాకకూడదు....'' అంది.

"ఇది చాలా దారుణం. నువ్వు నన్నవమానిస్తున్నావు...."

"ఇందులో అనుమానమూ లేదు, అవమానమూ లేదు. సమాజం ఒక భయంకర సంప్రదాయంతో అక్రమ పురుష సంబంధాన్ని నాకు కులవృత్తి నిచేసింది. అది తప్పించుకునేందుకే నాకీ పెళ్ళి. నేను సమాజంలో గౌరవంగా బ్రతకడానికి నన్నే శక్తీ అడ్డగించకుండా ఉండాలనే నాకీ పెళ్ళి... ''

"ఈ పెళ్ళి జరక్కపోయినా నీవు గౌరవంగా బ్రతకొచ్చుగా....''

"కుదరదు. నా మెడలోని తాళిబొట్టు, రిజిస్ట్రాఫీసులోని రికార్డు—ఏ పురుషుడు నామీద చేయివేసినా వాణ్ణి నేరస్థుణ్ణి చేస్తాయి. చట్టం నాకు రక్షణ నిస్తుంది. మన పెళ్ళి నాకు రక్షాకవచం....''

చాలా తెలివైనది సురేఖ!

నన్ను బుట్టలో వేసింది. పెళ్ళి చేసుకుంది. కాపురానికి తీసుకువెళ్ళమని నన్నామె నొక్కించదు. నేను మరోపెళ్ళి చేసుకుంటే వారించదు. కానీ నేను తనతో కలిసి నలుగురికీ తెలిసేలా కాపురం పెడితే తప్ప నాకు దగ్గర కాదు.

నా నిరుత్సాహానికి అంతులేదు.

సురేఖ నెమ్మదిగా—"నీవు నన్ను తాకేవరకూ ఈ శరీరాన్ని పవిత్రంగా కాపాడుకుంటాను. అది నా బాధ్యత. నా బాధ్యతను నువ్వు నా కెక్కువకాలం ఉంచవని నమ్ముతున్నాను....'' అంది.

అప్పుడు నాకు కోపం వచ్చింది.

సురేఖ అందం చూసి పెళ్ళి చేసుకోవాలని ఎలా ఆవేళ

పడ్డానో, ఆమె నన్ను భర్తగా దూరంగా ఉండమంటే కూడా అలాగే ఆవేశపడ్డాను.

పెళ్ళిజరిగిన ఆరువారాలకు నేను ఇంటికి తిరిగివెళ్లాను. ఎంత ప్రయత్నించినా యింట్లో ఈ విశేషం చెప్పలేక పోయాను.

ఈలోగా ఉద్యోగానికి పోష్టింగొచ్చింది నాకు.

విశాఖపట్నం మా ఊరికి బాగా దూరం.

అందువల్ల అక్కడ సురేఖతో కాపురం పెట్టవచ్చుననే అనుకున్నాను.

స్వతంత్రుణ్ణి నన్నిప్పుడెవ్వరేం చేయగలరు?

కానీ—అప్పుడే అనుకోని విశేషం జరిగిపోయింది.

ఉన్నపళంగా లక్షరూపాయల ఆఫర్‌తో నాకు సంబంధం వచ్చింది. నాన్న బలవంత పెట్టాడు. ఎలా కాదనాలో తెలియలేదు.

సంబంధం గురించిన పూర్తి వివరాలనిస్తూ—"నాకీ పెళ్ళి చేసుకోవాలనిలేదు. కానీ యింట్లో నీ గురించి చెప్ప డానికి ధైర్యమూ చాలడంలేదు. సురేఖా! నువ్వు నన్ను తిడుతూ ఉత్తరం రాయి. నా మనసును ప్రభావితం చేయ డానికెలాంటి వాక్యాలుపయోగించాలో నీకు తెలుసు. అవి ఉపయోగించు. లేదా నువ్వే బయల్దేరి మా యింటికి వచ్చేయ్. నేను నీకు అవమానం జరగనివ్వను. సురేఖా! నిజం చెబుతున్నాను. నేను నీవాణ్ణి! నా పిరికితనం నుంచి నన్ను రక్షించి సహాకరించు—...." అని రాశాను.

జవాబు వస్తుందనే అనుకున్నాను. రాలేదు. నేనే స్వయంగా వెళ్ళి సురేఖను కలుసుకుందామా అనుకున్నాను. పరిస్థితులు కలిసిరాలేదు.

నాకు సుమిత్రతో పెళ్ళైపోయింది. క్రమంగా సురేఖను

మరిచిపోయాను.

ఆ తర్వాత మళ్ళీ ఇన్నాళ్ళకు సురేఖ నుంచి ఉత్తరం. అందులోని డియర్ రాజూ అన్న పదం నన్నొక్కసారి అంతలా గతానికి తీసుకునిపోయింది.

వాస్తవంలోకి వచ్చి ఉత్తరం చదవసాగాను.

"నీ ఉత్తరం అందింది. వెంటనే బదులు రాస్తున్నాను.

"నీ పెళ్ళి ఆపడానికి నేను వెంటనే బయల్దేరి రావాలను కున్నాను. కానీ యిక్కడ అమ్మ నన్ను కదలకుండా ఆంక్షలు పెట్టింది. ఇల్లుకదిలే అవకాశంలేదు నాకు. నన్నొక భాగ్యవంతుడి ఉంపుడుకత్తెగా మార్చడానికి ప్రయత్నిస్తోందమ్మ. ఆ దారుణాన్నాపడానికి నేను కూడా అశక్తురాలిని. నువ్వొక్కడివే నన్ను రక్షించగలవు.

వెంటనే బయల్దేరివచ్చి నన్ను కాపాడు. నీతో తీసుకునివెళ్ళు. నేను కలలు కంటున్న జీవితానికి దారి చూపించు

మరో ముఖ్య విషయం. నీ క్కాబోయే భార్య గురించిన వివరాలు రాశావు. ఆమె నాకు తెలుసు. ఒక రోజున ఆమెను కొందరు దుండగు లపహరించి మా అమ్మకు అమ్మేశారు. అమ్మ ఆమెను వృత్తిలోనికి దింపడానికి రౌడీని నియమించింది. ఆమె ప్రాణభయంతో ఆ రౌడీకి లొంగిపోయింది, అందుకు నేనే సాక్షిని! ఈలోగా ఆమె ఫలానా వ్యక్తి కూతురని తెలిసి అమ్మ సగౌరవంగా వెనక్కు అప్పజెప్పవలసివచ్చింది. ఆమె తండ్రి గంగాధరరావు సమాజంలో పేరు, పలుకుబడి ఉన్నవాడు. వయసులో ఉన్నప్పుడు మా అమ్మతో పరిచయం కూడా ఉండేదిట. గంగాధరరావు జరిగిన విషయాన్ని రహస్యంగా ఉంచడానికి డబ్బు వెదజల్లి—వీలయినంత త్వరలో

కూతురి పెళ్ళి చేయాలనుకుంటున్నాడు. ఆయన తన కూతురి కెలాగయినా పెళ్ళి చేయగలడు. నీవు మాత్రం ఈ పెళ్ళికి అంగీకరించకు.

వెంటనే వచ్చేస్తావు కదూ?

నీ కోసం నా పవిత్రతను కాపాడుకుంటూ ఎదురు చూస్తూంటాను."

ఉత్తరం చదివి ఆశ్చర్యపడ్డాను.

ఇదేమిటి? ఈ ఉత్తరం మిప్పుడొచ్చింది?

తేదీని చూస్తే అది నా పెళ్ళికి ముందు లేఖ.

కవరు పరిశీలించాను.

చాలా కాలం క్రితం పోస్టయిందది. దాన్నిండా ఎన్నో ముద్రలున్నాయి.

అంటే పోస్టలు డిపార్టుమెంటు కట్టుకున్న పుణ్యమన్న మాట యిది!

పాపం సురేఖ - ఏం చేస్తోందో యిప్పుడు!

తల్లి ఆమెను లొంగదీసుకుందా? వృత్తిలోకి దింపిందా?

నేనేం చేయాలిప్పుడు?

సురేఖ ఉత్తరంలో అన్నీ నిజాలే రాసింది.

నా భార్య వివాహమైన తొలిరాత్రి శోభనం గదిలో కళ్ళనీళ్ళు పెట్టుకుని నా కాళ్ళమీద పడిపోయి—తన ఇష్టానికి వ్యతిరేకంగా మానభంగానికి గురయినట్లు చెప్పింది.

నేను షాక్ తిన్నాను. ఆమెను నిందించాను.

"నిజం తెలిసే లక్షరూపాయల కాశపడి మీరీ పెళ్ళికి ఒప్పుకున్నట్లు నాన్న చెప్పాడు. నన్ను నిందించకండి" అంది సుమిత్ర.

"నాకు నిజం తెలియదు. ఇప్పుడు కూడా నువ్వీ నిజాన్నెందుకు చెప్పినట్లు? నాకు సుఖం లేకుండా చేయ

డానికా?''

''కాదు. భార్యా భర్తల మధ్య అరమరికలుండకూడదు. నాన్న మీకు నిజం చెప్పాడో లేదో తెలియదు. కాని నా గతం మిమ్మల్ని బాధించదు. ఈ రోజుతో అది తుడిచి పెట్టుకుపోవాలి. చేసిన పాపం చెబితే పోతుందని ముందే ఈ విషయం మీకు చెప్పాను....'' అంది సుమిత్ర.

ఆమె మాటల్లో భయం లేదు. బెదురులేదు. డబ్బిచ్చిన అహంకారముంది. డబ్బు తెచ్చిన ధైర్యముంది.

''నీలో అహంకారముంది. నేనిప్పుడు నిన్ను వదలి పెడితే మీ నాన్న నన్ను వేటాడతాడు. అదే నీ ధైర్యం'' అన్నాను.

సుమిత్ర నిట్టూర్చి - ''పెళ్ళయిన ఆడదాని బలం భర్తలో ఉంది. తండ్రిలో ఉండదు'' అంది.

''అయితే మరి ఏ ధైర్యంతో తొలిరాత్రే నాకీ విషయం చెప్పావు?''

''పెళ్ళి కోసం అబద్ధమాడినా - అబద్ధంతోనే నేను జీవించలేను. మీకు నిజమెందుకు చెప్పానంటే - తప్పు నేను కావాలని చేయలేదు. కావాలని ఇక ముందు కూడా తప్పు చేయను. ఇది మీకు స్పష్టం చేయాలన్నదే నా తాపత్రయం. మీ ముఖంలో కనబడే మంచితనం, సంస్కారం నాకు ధైర్యాన్నిచ్చాయి'' అంది సుమిత్ర.

సుమిత్రను నేను క్షమించగలిగాను. అందుక్కారణం ఆమె తెలివితేటలో, నా సంస్కారమో, లేక ఆమె తండ్రి డబ్బు, అధికారమో - నాకు తెలియదు. కానీ పెళ్ళికి ముందే సురేఖ ఉత్తరమంది ఉంటే ఆమెను పెళ్ళి చేసుకుని ఉండేవాణ్ణి కాదని మాత్రం చెప్పగలను.

ఇప్పుడు నేను అర్జంటుగా సురేఖను కలుసుకోవాలి.

ఆమె ఎలాంటి పరిస్థితుల్లో ఉందో తెలుసుకోవాలి. తర్వాత వీలునుబట్టి సురేఖ గురించి సుమిత్రకు చెప్పాలి.

ఆరోజెలాగూ ఆఫీసుకు సెలవు. ఆ తర్వాత రెండు రోజులు సెలవు పెడితే శని. ఆదివారాలు వస్తాయి.

నే నెక్కువ ఆలోచించలేదు.

2

అందమైన ఆ మేడ ఇప్పటికీ అందంగానే ఉంది. ఆ యింట్లో సురేఖ ఉండే ఉండాలి.

ఇంట్లో అడుగు పెట్టాను.

ఇల్లు ప్రశాంతంగానూ, నిశ్శబ్దంగానూ ఉంది.

ఒక పనివాడు తలుపు తీశాడు. ఎవరు కావాలని అడిగాడు.

సురేఖ పేరు చెప్పాను. పనివాడేదో అనేలోగా - "ఎవరూ?" అన్న గొంతు వినిపించింది. ఆ వెనుకనే ప్రత్యక్షమయింది సురేఖ తల్లి.

ఆమె నన్ను వెంటనే గుర్తుపట్టలేదు. నా గురించి చెప్పుకోగానే - "వచ్చేవా బాబూ! సురేఖ నీకోసం మేడ మీద గదిలో ఎదురు చూస్తోంది. వెళ్ళు...." అంది.

పనివాడామె వంక ఆశ్చర్యంగా చూశాడు.

నాకా యిల్లంతా పరిచయమైనట్లే ఉంది. ఏళ్ళు గడిచి పోయినా నేనా యిల్లు మరిచిపోలేదు.

చకచకా మేడ మెట్లెక్కాను. నా గది చేరుకున్నాను.

గది లోపల్నుంచి మల్లెలు గుబాళిస్తున్నాయి.

అప్పుడు నాకు కలిగిన దుఃఖమింతా అంతా కాదు.

ఒకనాడు నాకు, సురేఖకు శోభనం గదిగా నిర్ణయించ.

బడినది. ఇప్పుడిక్కడ ఆమెకు నిత్య శోభనం....

తలుపు తట్టబోగా దానంతటదే తెరుచుకుంది.

లోపల....

ఆనాడు అలంకరించిన విధంగానే ఉంది శోభనం గది.

మంచం మీద కూర్చుని ఉంది సురేఖ. ఆమె కూడా ఆనాటి సురేఖలాగే ఉంది.

"రాజూ - వచ్చేవా?" అందామె.

నేను దిగ్భ్రాంతుణ్నయ్యాను.

ఆమెకు నేను వస్తానని ముందే తెలుసా? ఈ ఏర్పాట్లన్నీ నా కోసమా లేక ఉన్న ఏర్పాట్లను ఈ రోజుకు నా కోసం మార్చిందా?

రాజూ! అందామె. తన ప్రియుణ్ణి. తన కోసం వచ్చిన ప్రతి పిటుణ్ణీ అలాగే పలకరిస్తుందేమో!

నేనామెను సమీపించాను.

ఆమె మంచందిగి నాకెదురుగా నిలబడింది.

ఇద్దరం కాసేపొకరివంక ఒకరు చూసుకున్నాం.

చట్టప్రకారం వివాహమాడిన భార్యాభర్తలం మేము.

"రాజూ!" అందామె.

"ఊఁ" అన్నాను.

"అమ్మ నాపవిత్రతను దెబ్బతీయాలనుకుంది. ఆమెను నేనోడించి లొంగతీసుకోగలిగాను. ఏదో ఒక రోజున నువ్వొస్తావని నాకు తెలుసు. ప్రతిరోజూ నీ గురించి పాన్పు నలంకరించి ఉంచుతున్నాను. ఈ గదిని నీకై ప్రత్యేకించాను. నీవుకాక ఎవరు గదిలో అడుగు పెట్టినా వాళ్ళను కరిచిపారేస్తున్నాను. అప్పటికీ నన్ను బలవంతం చేస్తే దగ్గర విషముంచుకొన్నాను—మింగేయ

దానికి! ఇదంతా నీకోసం....నా పవిత్రత నీకోసం....దా....రాజూ....ఈ రోజు మనం జన్మసార్ధక్యం చేసుకుందాం''

నేనామెను సమీపించాను. కౌగిలిలో బంధించాను. మా యిద్దరిజన్మలూ సార్థకమయ్యాయి.

*   *   *

''బాబూ!'' అని ఎవరో పిలుస్తూంటే ఉలిక్కిపడి లేచాను.

నాఎదురుగా సురేఖ తల్లి!

''నన్ను క్షమించు బాబూ!'' అందామె.

''ఎందుకు?'' అన్నానాశ్చర్యంగా. నాకింకా మత్తు పూర్తిగా విడలేదు.

''కన్నకూతురే అయినా దాని మనసు నర్థం చేసుకోలేకపోయాను. నీ ప్రేమనూ అనుమానించాను. దాన్ని బలవంతంగా వృత్తిలోకి దింపాలనుకున్నాను. నీ కది అమానుషంగా కనపడొచ్చు. మా కుటుంబాని కది మామూలు బాబూ! నేనూ అలాగే వృత్తిలోకి దిగాను. నాకొక్కగానొక్క కూతురిది. దీనికీ అదే బ్రతుకను కున్నాను. అది నన్నెంతగానో హెచ్చరించింది. నేను లక్ష్యపెట్టలేదు. తన పవిత్రతను కాపాడుకోవడం కోసం అది చివరకోరోజున విషం మింగి చచ్చిపోయింది. ఆ విషయం నీకెలా చెప్పాలో తెలియక నువ్వే తెలుసుకుంటావని గదిలోకి వెళ్ళమన్నాను. నువ్వెప్పటికీ రాకపోయేసరికి కంగారుపడి నువ్వే అఘాయిత్యం చేశావోనని ఇక్కడకొచ్చాను....''

''ఆఁ'' అన్నాను.

అప్పుడు పరీక్షగా గదినిచూస్తే —

గదిలో మల్లెలు లేవు. అలంకరణ లేదు. మంచం మాత్రముంది. ఆ మంచంమీద నేనున్నాను.

గదిలో గోడకు సురేఖ ఫోటో వ్రేలాడుతోంది. ఫోటోకు చేమంతుల దండ — అగరుదూపం!

మరి — నేను చూసిన సురేఖ!!!

నావళ్ళు జలదరించింది. అంతవరకూ సుఖానుభూతులతో మైమరచిన నే నిప్పుడు భయంతో వణికిపోతున్నాను.

ఫోటోలో సురేఖ నవ్వుతోంది.

తన పవిత్రతను నిలబెట్టుకునేందుకు ప్రాణాలనే వదిలిన ఆ కళావంతులబిడ్డ — తన ప్రాణాలకోసం పవిత్రతను వదులుకున్న కులసతికి భర్తనైన నన్ను చూపి పరిహసిస్తోందా అన్నట్లుందా నవ్వు....

ఆ ఇంట్లో మళ్ళీ సురేఖ కనపడుతుందేమోనని మరో మూడురోజు లున్నాను.

తన పవిత్రతను నాకు ధారపోసి భార్యగా ఋణం తీర్చుకున్నాననుకుందో, నావంటివాడి స్పర్శతో ఆమె ఆత్మ కలుషితమై పవిత్రతను పోగొట్టుకుందో కానీ - సురేఖ ఆత్మకూడా మళ్ళీ నాకు కనపడలేదు.

తర్వాత నేను ఈ కథను నాభార్యకు చెబితే ఆమె అసూయగా "నేను మిమ్మల్ని తనకుకాకుండా చేశాను. అందుకని ఆమె ఆత్మ మీ పవిత్రతను కాజేసి నాపై పగ తీర్చుకుంది—" అంది.

ఎవరేమనుకున్నా సురేఖ పవిత్రత మరపురానిది, మరువలేనిది! □

నైట్ డ్యూటీ నర్సు

యస్.పి.వి.అజీజ్

నైట్ డ్యూటీ పూర్తి చేసుకుని ఉదయం ఎనిమిది గంటల వేళ ఇల్లు చేరుకొన్న సిస్టర్ సౌజిత తన ఇంటిముందు జనం గుమికూడి వుండడం చూసి కంగారెత్తిపోయి.... అక్కడున్నవారిని ఉద్దేశించి అడిగింది:

"ఏం జరిగింది?"

వారేమి జవాబివ్వలేదు.

సౌజిత గుమికూడి వున్న జనాన్ని తప్పుకొంటూ వెళ్ళి చూసింది. తన ఇంటి తలుపులు తెరచివున్నాయి. ఆమెలో అనుమానం పెచ్చేగిపోయింది. ఒక్క అంగలో లోపలికి చేరుకుంది.

పోలీసులు!

విగతజీవుడై నెత్తుటి మడుగులో పడున్న తన భర్త శ్రీనాథ్. ఆ దృశ్యాన్ని చూసి భరించలేని సౌజిత కెవ్వున అరచి స్పృహతప్పింది.

* * *

తాను తిరిగి స్పృహలోకి వచ్చేసరికి బెడ్ పై వుంది.

ఇన్‌స్పెక్టర్ అభిరాం సౌజిత వంక పరీక్షగా చూస్తూ అన్నాడు.

"ప్లీజ్! కంట్రోల్ యువర్ సెల్ఫ్"

కాసేపటి తర్వాత ఆమెలోని భయాన్ని పోగొట్టి ఎంక్వయిరీ ప్రారంభించాడు.

"మీరు నిన్న ఎన్నింటికి హాస్పిటల్‌కు వెళ్ళారు?"

"ఏడు వరకు వారికోసం ఎదురుచూశాను. వారు రాలేదు. నా డ్యూటీకి టైం అవుతుండడంవల్ల .... ఫ్రంట్ డోర్ లాక్‌చేసి వెళ్ళిపోయాను. నైట్ డ్యూటీ ముగించుకొని మళ్ళీ ఇంటికొచ్చేసరికి ...." ఆపైన చెప్పలేకపోయింది సౌజిత.

"మీ దగ్గర స్పేర్‌గా కీస్ వుంటాయా?"

"అవును. నా దగ్గర ఒకటి ఉంటుంది. మావారి వద్ద ఒకటి వుంటుంది."

"సాధారణంగా మీవారు రోజూ ఎన్నింటికి ఇంటికి వస్తారు?"

"చెప్పలేను" పెదవి విరుపుగా అంది సౌజిత.

"దేనికి?" ఆశ్చర్యం వ్యక్తంచేశాడు అభిరాం!

"రోజూ ఎనిమిదింటి తర్వాతే ఇంటికి వస్తున్నారు. గత మూడు నెలలనుంచి నాకు నైట్ డ్యూటీ వుండడం కారణంగా ఎప్పుడు వస్తారో తెలియడంలేదు. నేను డ్యూటికి వెళ్ళేలోపల మాత్రం రారు. ఉదయంపూటే మా కలయిక. లేట్ గురించి అడిగితే ఏవో కారణాలు చెప్పి పోట్లాటకు దిగుతారు. రెండుమూడుసార్లు చెయ్యి కూడ చేసుకొన్నారు. అందుకే అడగడం మానివేశాను" స్థిమితపడుతూ అంది సౌజిత.

"మీవారు పనిచేసేది బ్యాంక్‌లో అనుకొంటాను"

"అవును"

"మరి బ్యాంక్ సాయంకాలం అయిదింటికే క్లోజ్ అవుతుందిగా! అప్పట్నుంచి రాత్రి ఎనిమిదింటి వరకు ఎక్కడుంటారు?"

"మావారికి తాగుడు అలవాటు వుంది. బ్యాంక్ వర్క్ అయిపోగానే ఏ బార్‌కో వెళ్ళి ఫుల్‌గా తాగేస్తారు. వారి జీతమంతా తాగుడుకే సరిపోతుంది....నా జీతంమీదే .... సంసార పోషణ జరుగుతూ వుంది."

"ఈ విషయమై మీ ఇద్దరిమధ్య స్పర్ధలు ఏమైనా వచ్చేవా?"

"వచ్చేవి"

"మీరేం చేసేవారు!"

"కొన్నాళ్ళపాటు వారిని మార్చాలని చూశాను. లాభం లేకపోయింది . వారిని మార్చడం నావల్ల కాదుకదా, ఆ

భగవంతుడివల్ల కూడా కాదనిపించింది. అప్పట్నుంచి వారిని మార్చే ప్రసక్తిమానుకొని మిన్నకుండిపోతున్నాను" దీర్ఘంగా నిట్టూర్చి అంది సౌజిత.

"మీ భర్తను ఎవరో తలపై బెడ్‌లైట్‌తో మోది చంపారు. హంతకుడు....ఎవరో కాని తెలివైనవారు. బెడ్‌లైట్ మీద తమ చేతి వేలిముద్రలు లేకుండా జాగ్రత్త వహారు....అయినా సరే. హంతకుడ్ని తప్పకుండా పట్టుకు తీరుతాం! అన్నట్టు మీ కెవరిమీదయినా అనుమానం వుందా?"

లేదన్నట్టు తలాడించింది సౌజిత్.

"మీవారికి పరిచయమున్నవారు....మీ ఇంటికి ఏమైనా వచ్చేవారా? ఐమీన్....విత్ యువర్ హజ్‌బెండ్"

"లేదండి! వారు ఎవర్ని ఇంటికి తీసుకువచ్చేవారు కాదు....తన ఫ్రెండ్స్ గురించి నాతో ఏ విషయం చెప్పే వారు కాదు."

"మీవారిపై ఎవరికైనా వ్యక్తిగత కక్షలు లాంటివి ఏవైనా వున్నాయా?" ఆమెనంక సూటిగా చూస్తు అడిగాడు అభిరాం.

"తెలియదండి!" స్థిమితంగా జవాబిచ్చింది సౌజిత.

"సరే, అవసరమైతే మళ్ళీ కలుస్తానండి!" లేచి నిలుచున్నాడు ఇన్‌స్పెక్టర్ అభిరాం.

"మంచిది" రెండుచేతులు జోడించి అంది సౌజిత.

అప్పటికి ఆమె భర్త శ్రీనాథ్ హత్య జరిగి సరిగ్గా ఇరవైనాలుగు గంటలయ్యింది!

2

మర్నాడు సాయంకాలానికి ఇన్‌స్పెక్టర్ అభిరాంకు శ్రీనాథ్ హత్యతాలుకు పోస్టుమార్టం రిపోర్టు అందింది.

రిపోర్టు చదవగానే అభిరాం కనుబొమలు ముడిపడ్డాయి. అతని మస్తిష్కంలో ఆలోచనల పరంపర.

రిపోర్టునుబట్టి చూస్తే సిండికేట్ బ్యాంక్ క్యాషియర్ శ్రీనాథ్ హత్య సాయంకాలం ఏడు తర్వాత....రాత్రి ఎనిమిది లోపు జరిగినట్లు తెలుస్తోంది.

ఆవేళప్పుడు అతన్ని అతని ఇంట్లోనే హత్య చెయ్యవలసినంత అవసరం ఎవరికుంది? ఒకవేళ ఎవరికైనా అతనిపై వ్యక్తిగత కక్షలు లాంటివుంటే బయటే ఎక్కడో ఒకచోట వీలు కల్పించుకొని చంపవచ్చు కదా! ఇలా ఊహిస్తే బయటి వ్యక్తులు చంపలేదని తెలుస్తోంది? మరి ఎవరు చంపినట్టు?

అతని భార్య సౌజితా?

ఆమె ఏడింటికే ఇంటికి తాళంవేసి డ్యూటీ వెళ్ళిపోయింది. హత్య జరిగింది ఏడు తర్వాత? ఆమే మళ్ళా వెనక్కు వచ్చి హత్యచేసిందా? అయినా ఆమెకు భర్తను చంపవలసినంత అవసరం ఏముంది? ఏమో చెప్పలేము. భర్త ప్రవర్తన మీద విసుగు కలిగి చంపివుండొచ్చు! ఏది ఏమయినా సౌజితే మొదటి అనుమానితురాలు కాబట్టి మొదట ఆమెవైపునుంచే పరిశోధించుకొంటూ రావాలి అన్న నిర్ధారణ కొచ్చిన ఇన్‌స్పెక్టర్ అభిరాం ఆమె పని చేస్తున్న హాస్పిటల్‌కు వెళ్ళాడు.

సూపరింటెండెంట్‌ను కలసి సౌజిత విషయమై అడిగాడు.

అతను తనకు తెలిసింది చెప్పాడు.

"షి ఈజె వెరిగుడ్ పర్సన్. తన నర్సు వృత్తిపట్ల అభిమానం....సిన్సియారిటీ వున్న అమ్మాయి. రోగుల్ని సొంత బిడ్డల్లా ట్రీట్ చేసేది. వారినుంచి ఒక్క కాణీ

పైసాకూడ ఆశించేదికాదు. ఎవరెన్ని విధాలుగా కానుక లాంటివి ఇవ్వజూపినా తీసుకొనేది కాదు....చిర్నవ్వుతో వాటిని తిరస్కరించేది. తన వృత్తిపట్ల అంతటి ప్రేమ - అభిమానం....వున్న అమ్మాయిని నా ఇరవైఅయిదేళ్ళ సర్వీసులో ఎక్కడా చూల్లేదు. సౌజితలాంటి అమ్మాయి ఇక్కడ పనిచెయ్యడం ఈ హాస్పిటల్‌కే గర్వకారణం!"

ఎంతో హుందాతనాన్ని చూపిస్తూ మెడికల్ సూపరింటెండెంట్ చెప్పిన విషయాన్ని ఓమారు మననం చేసుకున్న ఇన్‌స్పెక్టర్ అభిరాం సౌజితతోపాటు ఆరోజు నైట్ డ్యూటీలో వున్న ఆమె కోలిగ్ విజయశ్రీ దగ్గరికి వెళ్ళి విచారించాడు.

ఆమెకూడ మెడికల్ సూపరింటెండెంట్ ఎలా చెప్పాడో అలాగే చెప్పింది. అయినా తన అనుమానం తీరక ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ అభిరాం "మొన్నటిరోజు సౌజిత ఎన్నింటికి డ్యూటీకి వచ్చిందో చెప్పగలరా?"

"ప్రతిరోజు లాగే ఆరోజుకూడ ఏడున్నరకొచ్చింది"

"అపుడు ఆమె ఏదైనా భయాందోళన చెందుతున్నట్టుగా మీకు అగుపించిందా?"

"అలాంటి ఏదీ లేదు. రోజులాగే ఆరోజుకూడ నవ్వుతూ పలకరించి అటెండెన్స్ రిజిష్టర్‌లో సైన్‌చేసి డ్యూటీలో జాయినయ్యింది....మీరు ఆమెను అనుమానిస్తున్నట్టున్నారు?" ఇన్‌స్పెక్టర్ అభిరాంవంక సూటిగా చూస్తూ అడిగింది విజయశ్రీ.

"అనుమానించడం .... మా వృత్తిలో ప్రథమ కర్తవ్యం. వస్తానండి! థ్యాంక్యూ ఫర్ యువర్ ఇన్‌ఫర్మేషన్" అంటూ బయటికి వచ్చేశాడు.

సౌజిత గురించి ఆమె ఇంటి ఇరుగు పొరుగు వ్యక్తు ల్నందర్నీ వాకాబు చేశాడు. ఎవరూ కూడ ఆమె గురించి చెడుగా చెప్పలేకపోయారు. విసుగొచ్చేసింది ఇన్‌స్పెక్టర్ అభిరాంకు. చివరలో ఒక గృహిణి ఆరోజు రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఒక యువతిని, ఎనిమిది గంటల ప్రాంతంలో మరో యువకుడిని ఆ ఇంట్లో నుండివెళ్ళటం చూశానంది. అయితే వాళ్ళెవరో తెలియలేదు.

సౌజిత వుంటున్నది వెంకటరమణ కాలనీలో కాబట్టి.. ఆ కాలనీ వూరికి కాస్త దూరంలో వుండడంవల్ల.... అక్కడుండే ఆటోడ్రైవర్స్‌ను, రిక్షా పుల్లర్స్‌ను వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు! ఇన్‌స్పెక్టర్ అభిరాం ఓరోజు వారి నందరిని స్టేషన్‌కు పిలిపించి ఎంక్వయిరీ చేశాడు. ఒక ఆటోడ్రైవర్ తనకు తెలిసింది చెప్పాడు. వాడి కథనం ఇలా సాగింది.

"నేను సిటీబస్టాప్ దగ్గర ఆటో పెట్టుకొని వుంటా నండి! ఆ అమ్మగారు ఎప్పుడూ నడిచే వచ్చేవారండి.... ఆటో ఎక్కేవారేకాదు. సిటిబస్సే ఎక్కి వెళ్లేవారు. ఆ రోజుకూడ రోజువారి లాగే నడిచి వచ్చారండి! ....ఏం గుర్తుకు వచ్చిందో ఏమో. మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయా రండి! వెళ్ళి....ఓ అరగంటతర్వాత మళ్ళీ వచ్చారండి! సిటీబస్‌కోసం వెయిట్ చెయ్యకుండా నా దగ్గిర కొచ్చి 'అర్జెంటుగా హాస్పిటల్‌కు పోనీ" అంటూ ఆటో ఎక్కి కూర్చున్నారండి! నేను చాల స్పీడుగా....ఆటో తోలి.... ఓపదినిముషాల్లో హాస్పిటల్‌కు తీసుకు వెళ్లానండి! ఇంతే నండి నాకు తెలిసింది!"

"ఆమె ఎన్నింటికి ఆటో ఎక్కింది?"

"టైం చూసుకోలేదండి....ఏడు దాటి వుంటుందండి."

"నీ ఆటో ఎక్కుతున్నప్పుడు ఆమె ముఖాన భయాందోళన లాంటిది గమనించావా?"

"లేదండి!"

"సరే!....నీవిక వెళ్ళొచ్చు! ...అవసరమొస్తే... పిలిపిస్తే స్టేషన్‌కు రావలసి వుంటుంది....

"అలాగే నండి!"

3

ఇన్‌స్పెక్టర్ అభిరాం సౌజిత ప్రతి చర్యనూ గమనిస్తూనే వున్నాడు. ఆమె ప్రతి కదలికా కనిపెట్టేందుకు ఓ కానిస్టేబుల్‌ను మఫ్టీలో ప్రత్యేకంగా నియమించాడు.

రెండ్రోజుల తర్వాత అతని నిఘా ఫలించింది. సమాచారం లభించింది. చెమటలు గ్రక్కేలా పరుగెత్తుకుంటూ స్టేషన్ కొచ్చి ఇన్‌స్పెక్టర్ అభిరాం ముందు తాను విన్నదంతా వెళ్ళగక్కాడు.

"సార్! మొన్నటిలాగే ఈరోజు కూడ ఆమె వెంట ఫాలో అయ్యాను. ఆమె డ్యూటీ అవగానే ఇంటికి వెళ్ళి డ్రస్ మార్చుకొని సత్యనారాయణగుడికి వెళ్ళి....గుడి ముందున్న గార్డన్‌లో....ఒక పొద మాటున కూర్చుంది. నేను దూరంగా వుండి గమనిస్తూనే వుండిపోయాను. కాసేపటికి పాతికేళ్ళు పైబడిన కుర్రాడొకడు అటు ఇటు దిక్కులు చూస్తూ....ఆ పొద దగ్గిరికే వెళ్ళి ఆమెకు చేరువగా కూర్చున్నాడు. నేను కొన్ని అడుగులు ముందుకు వేసి పొద వెనక్కు వెళ్ళి వారి మాటల్ని వినడానికి ప్రయత్నించాను. వారు లోగొంతుతో మాట్లాడుకోవడం వల్లా సరిగా వినిపించలేదు. కాని ఒక మాట మాత్రం స్పష్టంగా వినిపించింది

"ఏమిటది?" ఆత్రంగా ప్రశ్నించాడు అభిరాం.

"శాతకర్ణి! నా కెందుకో భయంగా వుంది....ఆ ఇన్ స్పెక్టర్ అభిరాం....ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే రకంలా వున్నాడు. నేను సెలవుల్లో వున్నప్పుడు హాస్పిటల్‌కు వచ్చి నా గురించి ఎంక్వయిరీ చేసాడట."

"డోంట్ వర్రీ సౌజితా! ఇలాంటి పరిస్థితుల్లోనే నిబ్బరంగా వుండాలి. అసలు నీవు...." అంటూ ఏదో అనబోతూ ఆగిపోయి ఇటు అటు చూశాడు. అతను నన్ను గమనించేలోపు నేను అక్కడ్నుంచి తప్పుకుని బయటికి వచ్చేశాను....వారు బయటికి వచ్చేంతవరకు....బయటే పచార్లు చేస్తూండిపోయాను. ఇద్దరు బయటికి రాగానే తిరిగి ఫాలో అయ్యాను. ఇద్దరు కొద్దిదూరం నడిచి వెళ్ళారు. ఆ తర్వాత....ఇద్దరి దారులు వేరయిపోయాయి. ఆమె రిక్షా తీసుకుని గాంధీనగర్ వయిపు వెళ్ళింది. అతను ఆటో తీసుకొని అశోక్‌నగర్ వయిపు వెళ్ళాడు.

"మరి నువ్వేం చేశావు?" ఉద్వేగంగా ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ అభిరాం.

"నే కూడ ఓ ఆటో ఎక్కి అతన్ని ఫాలో అయ్యాను. అతను ఎక్కిన ఆటో అశోక్‌నగర్ ఏరియా దాటి.... హాంద్రీబ్రిడ్జి మీదుగా వెళ్ళి నరసింగరావు పేటలో ఓ ఇంటి ముందు ఆగింది. నేను ఆటో ఆ ఇంటికి కొద్ది దూరంలో ఆపి....కాసేపు వెయిట్ చేశాను అతను ఆ ఇంటి నుంచి బయటికి వస్తాడేమోనని. రాలేదు. నాకు అనుమానం వచ్చి అటుగా వెళుతున్న ఆ పేట వాడిని అడిగాను.

"ఆ ఇంట్లో ఎవరుంటున్నారు?"

"ఓ మెడికల్ రిప్రజెంటేటివ్."

"మీకేమైనా అతని పేరు తెలుసా?"

"శాతకర్ణి అనుకుంటాను."

ఆ పేటవాసి సమాధానంతో అతడుంటున్నది ఆ ఇంటి లోనే అని నిర్ధారించుకుని వచ్చేశాను " అతడు చెప్పింది విన్న తర్వాత ఇన్స్పెక్టర్ అభిరాం ముఖంలో వెలుగు దృగ్గోచరమయింది. ప్రశంసాపూర్వకంగా అతన్ని భుజం తట్టి చెప్పాడు.

"నీ బుర్ర కూడ బాగానే పనిచేస్తోంది నర్సయ్యా!.... ఈ దెబ్బతో కేసు సెటిల్ అయినట్టే! వెంటనే వెళ్ళి జీపు రెడీ చెయ్యి... క్విక్!"

4

ఇన్స్పెక్టర్ అభిరాం....తన అసిస్టెంట్లతో జీపులో బయల్దేరి శాతకర్ణి వుంటున్న ఇల్లు చేరుకొనేసరికి పది నిముషాలు పట్టింది. ఆ సమయానికే బయటికి వెళ్ళ బోతున్న శాతకర్ణి తన ఇంటిముందు పోలీసుజీపు ఆగడం అందులో నుంచి ఇన్స్పెక్టర్, పోలీసులు దిగడం చూసి అవాక్కయిపోయాడు. అతని గుండె దడదడలాడింది. వాళ్ళంతా ముచ్చెమటలు పట్టాయి. అయినా వారి బారి నుండి తప్పించుకోవాలని చూశాడు. కాని అప్పటికే వారి చేతికి చిక్కిపోయాడు. బలవంతంగా తీసుకెళ్ళి జీపు ఎక్కిస్తూండగా గొంతు పెద్దది చేసి గట్టిగా అరచి అడిగాడు.

"నన్నెందుకు అరెస్టు చేశారు?"

"సమాధానం ఇక్కడ కాదు. స్టేషన్లో" కరకుగా పలికాడు ఇన్స్పెక్టర్ అభిరాం.

జీపు తిరిగి స్టేషన్కు చేరుకోగానే శాకతర్ణిని లోపలికి లాక్కెళ్ళి లాకప్లో వేసి కానిస్టేబుల్స్ లాఠీలతో కాసేపు

బాదాక ఇంటారాగేషన్ మొదలెట్టాడు ఇన్స్పెక్టర్ అభిరాం.

"సౌజిత నీ కెలా తెలుసు?"

"నాకు తెలియదు."

అంతే!

శాతకర్ణి చెంప చెళ్ళుమంది!

"చెప్పు! నీకూ సౌజితకు....ఏమిటి సంబంధం?"

"......................"

మరోమారు 'చెళ్ళు' మన్న శబ్దం!

ఆతని క్రిందిపెదవి పగిలి నెత్తురు వచ్చింది. అయినా పలుకు జారలేదు శాతకర్ణి.

ఇన్స్పెక్టర్ అభిరాంలో ఆవేశం పెల్లుబికింది. చివరికి తన 'పోలీసు పద్ధతి' చూపించాడు. క్షణక్షణానికి తలకు బిగుసుకుపోతున్న తాడు ఇంకాసేపలా జరిగితే తన కపాలం ఎక్కడ చిట్లిపోతుందో అన్నంత బాధ! భయంకరమైన బాధ! ఆ బాధను అణచుకోలేకపోయాడు శాతకర్ణి.

"చెబుతాను....తాడు తీసేయండి!" హీనస్వరంతో అరిచాడు.

అతని కణతల దగ్గిర చుట్టుకొన్న తాడు తొలగిపోయింది. శాతకర్ణి జరిగింది చెప్పడం మొదలుపెట్టాడు.

"చిన్నప్పట్నుండి ఇంటర్‌దాక సౌజిత నా క్లాస్‌మేట్. సౌజితకు చిన్నప్పట్నుండి నర్సుగా పని చెయ్యాలన్న అభిలాష ఉండేది. ఆమె కోరిక ప్రకారమే ఇంటర్ అయిపోగానే ఆమె ఇంట్లోవారు నర్స్ ట్రైనింగ్‌కు పంపిం

చారు. నేను బి. యస్‌సి. లో చేరాను....

మేమిద్దరం చిన్నప్పట్నుంచి చనువుగా వుండేవాళ్ళం. ఇంటర్ తర్వాత ఆ చనువు 'ప్రేమ'గా మారింది. చదువు పూర్తి కాగానే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించు కొన్నాము.

మా చదువు పూర్తయిపోయింది....మా నిర్ణయాన్ని మా పెద్దలకు తెలిపేలోపు ఆలస్యం జరిగిపోయింది. సౌజిత పెళ్ళి సిండికేట్ బ్యాంక్ ఉద్యోగి శ్రీనాథ్‌తో జరిగిపోయింది.

కొన్నాళ్ళు బాధపడ్డాను. ఆ తర్వాత ఉద్యోగంలో చేరాను. అప్పట్నుండి సౌజిత ఛాయలకు వెళ్ళలేదు. ఆమె వైవాహిక జీవితంలో ఏమాత్రం జోక్యం చేసుకొనే వాడ్ని కాదు.

ఆమె గురించి....ఆమెకు సంబంధించిన ఆలోచనలు దూరం చేసుకోవడానికి నేనెప్పుడూ బిజీగా టూర్లు వెళు తుండేవాడ్ని. అందువల్ల నా ఆరోగ్యం దెబ్బతింది. ట్రీట్ మెంట్‌కు ఓ రోజు హాస్పిటల్‌కు వెళ్ళాను. సౌజిత కని పించింది. పలకరించాను.

సౌజితలో చాలా మార్పు కనిపించింది. మునుపటిలా చలాకీగా నవ్వుతూవుండక ఏదో పోగొట్టుకొన్నదానిలా ఉదాసీనంగా వుండడం గమనించి అడిగాను. ముందు కాసేపు సంశయించినా ఆ తర్వాత తన భర్త ప్రవర్తన గురించి చెప్పి 'జీవితంలో ఏ మాత్రం ఆనందాన్ని అనుభ వించలేకపోతున్నాను' అంటూ కంట తడిపెట్టింది. నా మనసుకు బాధవేసింది.

"నీ భర్తకు నచ్చజెపుతాను" అన్నాను.

"వద్దు! ఆయనింకా పెచ్రేగిపోయి మనల్ని అపార్థం చేసుకొనే అవకాశముంది."

మరేం సలహా ఇవ్వాలో తోచక కాసేపు మౌనంగా వుండిపోయి చెప్పాను.

"నావల్ల ఏదైనా సహాయం కావలసివస్తే ...తప్పకుండా రా! ఓ స్నేహితుడిలా హెల్ప్ చేస్తాను" అంటూ నా విజిటింగ్‌కార్డు యిచ్చి వచ్చేశాను. మళ్ళీ నేను హాస్పిటల్‌కు వెళ్ళలేదు. నెలరోజుల తర్వాత....టూర్ నుంచి ఇంటికి వచ్చి పడుకోబోతుండగా నేను అద్దెకుంటున్న ఇంటి ఓనర్ నుంచి పిలుపొచ్చింది. వెళ్ళాను.

"నీకు ఫోన్?" అంటూ ఫోన్ అందించాడు.

అది సౌజిత చేసిన ఫోను. అప్పుడు రాత్రి ఎనిమిదయి వుంటుంది.

రిసీవర్ ఎత్తగానే...."శాతకర్ణీ! వెంటనే హాస్పిటల్‌కు రా!" గద్గద స్వరంతో సౌజిత పలికింది.

"ఏమయ్యింది సౌజితా?" అని అడిగేలోపు ఫోన్ పెట్టేసింది.

ఎందుకో నా మనసు కీడును శంకించింది. అదురుతున్న గుండెలతో ఆటో తీసుకుని హాస్పిటల్‌కు వెళ్ళాను. అప్పటికే వార్డుబయట నా కోసం కాలుకాలిన పిల్లిలా అటు ఇటూ తిరుగుతూ ఎదురుచూస్తున్న సౌజిత నన్ను చూడగానే విసురుగా వచ్చి నన్ను వాటేసుకుని మెల్లిగా ఏడ్వడం ప్రారంభించింది. ఆమెను దూరంగా తీసుకెళ్ళి సముదాయించి అడిగాను.

"ఏం జరిగింది?"

"నే....నే....నేను....హ ....హ ....హత్య చేశాను" నిలువెల్లా వొణికిపోతూ అంది.

"హత్యా!" విస్తుపోయి అడిగాను.

"అవును ...."మాటల్ని అతికష్టంగా కూడబలుక్కొని అంది.

"ఎవర్ని?" నొసలు చిట్లించి అడిగాను.

"నా భర్తను."

"శ్రీనాథ్‌నా?! .." మిన్ను విరిగి నా మీద పడ్డట్టయ్యింది.

"అవును."

సౌజిత చెప్పింది విని కాసేపు మనిషిని కాలేక పోయాను. ఆ తర్వాత తేరుకొని అడిగాను.

"ఎందుకు చంపావు?"

"నేను కావాలని చంపలేదు. ఇదంతా ఆయనవల్లే జరిగింది!"

"అసలేం జరిగింది?"

"రోజులాగే సాయంకాలం ఏడింటివరకు ఆయన కోసం ఎదురుచూశాను. రాలేదు. విసుగొచ్చి ఇంటి తాళం వేసి నడుచుకొంటూ సిటీ బస్‌స్టాప్ దగ్గరికి వెళ్ళాను. అక్కడికి వెళ్ళిం తర్వాత వెంట మనీపర్సు తేలేదన్న విషయం గుర్తొచ్చి గబగబా నడుచుకుంటూ యింటికి వెళ్ళాను.... ఇల్లు తెరచివుంది. ఆయనే వచ్చివుంటాడు అనుకొన్నాను. లోపలికి అడుగు పెట్టబోయి ఆగి పోయాను ...."

"ఎందుకు?" ఆత్రంగా ప్రశ్నించాను.

"మావారితో పాటు వున్న యింకో కొత్త వ్యక్తిని చూసి ...."

"ఎవరా వ్యక్తి?"

"కిరాయికి తెచ్చుకొన్న పడుపుగత్తె! ఇద్దరూ నన్ను చూసి స్థాణువులయ్యారు. విషయం అర్థమైపోయిన నేను ఆవేశం పట్టలేక ముందు దాని చెంపమీద ఈడ్చికొట్టి.... బయటికి పంపి పెల్లుబికిన ఆవేశంతో మా వారిపై పడ్డాను. అన్నాళ్ళుగా అణుచుకొన్న వ్యథ అగ్నికీలగా మారింది.

'ఇన్నాళ్ళుగా మీరు సాగిస్తున్న వ్యవహారం ఇదా?' అంటూ ఆయన చెంప కూడ చెళ్ళుమనిపించాను.

"నన్నే కొడతావా!....నిన్ను....నిన్ను చంపేంత వరకు నిద్రపోను" అంటూ నా గొంతుచుట్టూ చేతులువేసి ఉరితాడులా బిగించి చంపబోయారు. నేను విదిలించుకొని పక్కనేవున్న బెడ్ల్యాంప్ తీసుకొని వారి తలపై బలంగా బాదాను. ఒకసారికాదు. అనేకసార్లు... పిచ్చిగా నా ఆవేశం తగ్గేంతవరకు బాదాను. వారు అరుపు కూడా లేకుండా వెనక్కి విరుచుకుపడిపోయారు. ఆవేశం తగ్గాక దగ్గిరికి వెళ్ళి చూశాను. ప్రాణం పోయివుంది. భయమేసింది వెంటనే నా మనీపర్సు తీసుకొని తలుపు కూడా వేయకుండా బయటికి వచ్చేసి ఆటో ఎక్కి హాస్పిటల్కు వచ్చేశాను....... ఇక్కడికొచ్చిం తర్వాత........అసలు విషయం గుర్తుకు వచ్చింది. నీవు జ్ఞప్తికి వచ్చావు. వెంటనే ఫోన్ చేశాను...."

"ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

"నువ్వెలాగయినా రిస్క్ తీసుకొని మా ఇంటికి వెళ్ళి బెడ్ల్యాంప్మీద పడివుండే నా వేలిముద్రలు చెరిపివేసి రావాలి. ప్లీజ్ శాతకర్ణీ! ఇది నేను కావాలని చేసిన హత్య కాదు. నా ప్రాణాలు రక్షించుకోవడానికి చేసిన హత్య.

ఈ విషయం ఎవరు నమ్ముతారు చెప్పు!? ఈ సమాజం నమ్మదు....పోలీసులు నమ్మరు. న్యాయస్థానం అసలే నమ్మదు .. ప్లీజ్ శాతకర్ణి సేవ్ మీ...." ఏడుస్తూ భయంతో హిస్టీరియా పేషెంటులా వూగిపోయింది.

ఆమె ఆవేదన చూసిన నాకు మనసు చెదిరిపోయింది. ఆమె చెప్పినట్టు చెయ్యడానికే నిర్ణయించుకొని ఆమెను.... 'ధైర్యంగా వుండు' అంటూ చెప్పి .... అక్కడ్నుంచే ఆటో తీసుకొని వెంకటరమణ కాలనీ వెళ్ళి....సౌజిత చెప్పిన గుర్తులు .. మననం చేసుకొంటూ ఆమెఇల్లు చేరు న్నాను. తలుపు తెరిచేవుంది. లోపలికి వెళ్ళాను. శ్రీనాథ్ రక్తపు మడుగులో విగతజీవుడై పడివున్నాడు....అతన్ని చూసి నాకూ్కడ భయంవేసింది.

శవం దగ్గరిగా వెళ్ళకుండా దూరంనుంచే బెడ్ లైట్ అందుకుని నా జేబులోనుంచి కర్చీఫ్ తీసి శుభ్రంగా తుడిచి తిరిగి దాన్ని యథాస్థానంలోనే వుంచేసి తలుపుమూసి బయటికొచ్చాను....తర్వాత ఇంటికి వెళ్ళి రిలాక్సయి.... సౌజితకు ఫోన్ చేసి "అంతా నువ్వు చెప్పినట్లు చేశాను. ఇక ఏమాత్రం అధైర్యపడక .... నిబ్బరంగా వుండు!" అంటూ చెప్పేసి ముందు జాగ్రత్తగా కొన్నాళ్ళపాటు ఆమెను కలుసుకోలేదు...." అంటూ చెప్పడం ముగిం చాడు శాతకర్ణి. అతను చెప్పింది విని అక్కడ వున్న వారందరూ చిన్నగా నిట్టూర్చారు.

ఇన్స్పెక్టర్ అభిరాం....శాతకర్ణి భుజంతట్టి అతని కళ్ళలోకి తొంగిచూసి....చిన్నగా ఓమారు అదోలా నవ్వి "నర్సయ్యా.... ఫాలో మీ ... !" అంటూ బయిటికి నడి చాడు....

□

షాలునేత్రం

వి.యస్.రావ్
సీరియల్

(గతసంచిక తరువాయి)

25

ఆలోచనలతో నిద్రపట్టని మోహన్ మంచంమీద దొర్లుతున్నాడు.

హాల్లో గడియారం నాలుగు గంటలు కొట్టింది.

మోహన్ ఉలిక్కిపడి లేచి కూచున్నాడు. సిగరెట్ వెలిగించి, కిటికీ ముందుకి నడిచాడు. చల్లటి గాలివీస్తోంది.

అమ్మ మాటల్నిబట్టీ, తన తండ్రికి బ్యాంక్ దోపిడీ గురించి ముందే తెలుసని అర్థమవుతోంది. తన తండ్రి అప్పుల్లో మునిగి తేలుతున్నాడు. దోపిడీ జరిగించడంలో తన తండ్రికి సంబంధం వుందని అతను అనుకోలేకుండా వున్నాడు. ఉందనుకున్నా, తన తండ్రి వసంత్‌ని కలుసుకోలేదు.

అయితే రంగనాథం స్థానంలో తన తండ్రి ఆ రోజు డ్యూటీ చేశాడు. రంగనాథం ఆ రోజు డ్యూటీకి రాలేదు. అతని భార్య గాయపడింది. మాస్క్‌వ్యక్తి ఆమెని గాయపరిచాడు. రంగనాథం ఆ రోజు డ్యూటీకి వెళ్ళకుండా ఆపబడ్డాడు!

ఎందుకు? ఎవరికి లాభం? ఆ ప్రశ్నలకి సమాధానం వెంటనే చిక్కింది మోహన్‌కి.

అతని స్థానంలో కూచునే వ్యక్తి గాయపడితే యాభై వేలు చేతిలో వాలుతుంది! అంటే తన తండ్రికి యాభై వేలు లభిస్తాయి! గుడ్‌గాడ్!

అయితే తన తండ్రికి లక్షరూపాయలూ, కొడుక్కి ఉద్యోగం లభించాయి! లక్షరూపాయలు తన తండ్రి తీర్చలేని అప్పుకాదు. ఇల్లు అమ్మేస్తే అప్పుతీరి, ఇంకా కొంత మిగుల్తుంది! లక్షకోసం తన తండ్రి ప్రాణాలమీదికి తెచ్చుకున్నాడంటే నమ్మశక్యం కాకుండా వుంది...."

అయితే రంగనాథం భార్యని గాయపరచిన వ్యక్తి ఎవరు?

వసంత్‌ని కలుసుకున్న వ్యక్తి యెవరు? ఇద్దరూ ఒక్క

రేనా?

రంగనాథం నాటకం ఆడుతున్నాడా? మోహన్ బుర్ర వేడెక్కుతోంది. బలహీనంగా మంచంమీద కూచున్నాడతను.

నాటకం ఆడితే రంగనాథానికి లాభం ఏమిటి?

తన తండ్రికి కాకుండా మరెవరికి లాభించింది? మోహన్ గుండె టకటక కొట్టుకుంది.

బ్యాంక్ మేనేజర్ గణపతికి లాభించింది:

అయితే అతను ప్రాణాలకి తెగించి, దోపిడీ ముఠా నాయకుణ్ని చంపేశాడు. ఆ సాహసం అతని నిజాయితీని చాటుతోంది: నేరుగా కాకుండా, పరోక్షంగా రంగనాథంకి ఏదేనా లాభించిందా? దోపిడీ ఏర్పాటుచేసి, అందులో తర వాత వాటా సంపాదించాడా? వసంత్‌ని కల్సుకున్న వ్యక్తి లావుగా బలంగా వున్నాడు. రంగనాథం కూడా లావుగా బలంగా వున్నాడు.

* * *

"నా మిత్రుడు వసంత్. వసంత్ ఈయన రంగనాథం గారు!" మోహన్ పరిచయంచేశాడు. వసంత్ తల పంకిం చాడు. సాయంత్రం అయిదు దాటింది. ముగ్గురూ హోటల్లో కూచున్నారు.

మోహన్ టీ ఆర్డరిచ్చాడు. ఏవో బ్యాంక్ విషయాలు చెప్తూ, మధ్యమధ్యలో రంగనాథాన్ని ప్రశ్నలువేస్తున్నాడు. రంగనాథం అతని సందేహాలకి సమాధానాలు చెప్తున్నాడు. వసంత్ మౌనంగా వాళ్ళ సంభాషణ వింటున్నాడు.

పదిహేను నిమిషాలు గడిచాయి. వసంత్ ఇబ్బందిగా కదుల్తున్నాడు. మోహన్ అతన్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"వసంత్, వెళ్ళాలా?"

వసంత్ పైకి లేచాడు. "ఒక్క-క్షణం....మీతో వొంట రిగా మాట్లాడాలి...." అంటూ కదిలాడు. క్షణంలో వస్తా నని రంగనాథంకి చెప్పి మోహన్ అతన్ని వెంబడించాడు. బైటికి నడిచి, వసంత్ ఆగాడు. మోహన్‌వైపు నవ్వుతూ చూశాడు. మోహన్ ఆత్రుతగా కాచుకున్నాడు.

"ఇతను కాదు!" వసంత్ మెల్లిగా అన్నాడు. మోహన్ నిట్టూర్చాడు.

"ఓకే, వసంత్. థాంక్యూ! వెళ్తావా?" అన్నాడు మోహన్. వసంత్ తలాడించాడు.

"అవసరమైతే తరువాత కలుసుకుంటాను" మోహన్ చెయ్యిచాచాడు. వసంత్ అతని చేతిని పట్టుకుని వదిలేసి, వెనుదిరిగి వెళ్ళిపోయాడు. మోహన్ హోటల్లోకి వెళ్లాడు. అతన్ని చూడగానే రంగనాథం లేచాడు.

"మిస్టర్ మోహన్, వెళ్దాం...."

"రంగనాథంగారూ, రెండుమూడుసార్లు మీ ఇంటికి రమ్మన్నారు. ఇవాళ మీతో వస్తాను?" మోహన్ నవ్వుతూ అన్నాడు.

"వెల్‌కమ్! వెళ్దాం. కమాన్!" అంటూ రంగనాథం కదిలాడు.

*　　　*　　　*

మోహన్ ఇంటివేపు నడుస్తున్నాడు. రంగనాథం భార్య తలకి గాయం తగిలిన మాట నిజమే. తనని గాయపరిచిన వ్యక్తిని తను పోల్చుకోలేనంది ఆమె.

కింద పడిపోతూ క్షణకాలం మాత్రం అతన్ని చూసిం దామె. ఎత్తుగా, బలంగా వున్నాడనిమాత్రం ఆమె గుర్తిం చింది. తను ఆమెని రకరకాలుగా ప్రశ్నించాడు; క్యూరి యాసిటీ నటిస్తూ. ఆ సమయంలో రంగనాథం బాత్‌రూమ్‌కి

వెళ్ళాడు.

"సిస్టర్, రంగనాథంగార్ని స్టేషన్‌కి పంపించమని ఒక వ్యక్తి మీకు ఫోన్‌లో చెప్పాడు. అతని కంఠం మళ్ళీ వినిపిస్తే మీరు పోల్చుకోగలరా?" తను ప్రశ్నించాడు. ఆమె తటపటాయిస్తూ పోల్చుకోగలనేమో అంది. మోహన్ తృప్తికరంగా నవ్వుకున్నాడు. మరో పావుగంట రంగనాథం ఇంట్లో గడిపి అతను ఇంటికి బయల్దేరాడు.

నడుస్తూ మోహన్ సిగరెట్ వెలిగించాడు. వసంత్‌ని కలుసుకున్న వ్యక్తీ, రంగనాథం భార్యకి ఫోన్‌చేసిన వ్యక్తీ, ఆమెని గాయపరచిన వ్యక్తీ ఒక్కడే ఎందుకు కాకూడదు?

26

"హలో!" స్త్రీ కంఠం.

మోహన్ వెనక్కితిరిగాడు. తనవైపు నవ్వుతోన్న వింధ్యని నవ్వుతూ చూశాడు. రక్తవర్ణంలో వున్న చిగురాకుల మధ్యలోంచీ తొంగిచూస్తున్న మొగ్గల్లా ఆమె పళ్ళు మెరుస్తున్నాయి. గాలి ఆమె ముంగురులతో ఆడుకుంటోంది. కోలమొహంలోంచీ పెద్దపెద్ద కళ్ళు తనవేపు పలకరింపుగా చూస్తున్నాయి. తన చూపులూ, మౌనం ఆమెని ఇబ్బంది పెడుతున్నట్టు మోహన్ గ్రహించాడు.

"హలో...." అన్నాడు మెల్లిగా, ముందుకి నడుస్తూ. ఆమె అతని పక్కనే నడవసాగింది.

"ఇవాళ ఎస్.బి.లో వేశారు. తలనొప్పి వచ్చేసింది! మీకెలా వుంది?" వింధ్య నవ్వుతూ అడిగింది. ఆమె నవ్వు వినడానికి ఇంపుగా వుంది.

"తల బొప్పికట్టింది!" మోహన్ నవ్వుతూ అన్నాడు. వింధ్య హాయిగా నవ్వింది. మోహన్ ఆగి, ఆమెవేపు

చూశాడు. చెదురుతున్న ముంగురుల్ని సరిచేసుకుంటూ వింధ్య నిలబడింది.

"మిస్ వింధ్యా, మనిద్దరికీ ఉద్యోగాలొచ్చాయి. కానీ మనం సెలబ్రేట్ చేసుకోలేదు! కమ్మటి కాఫీ తాగుదామా?" మోహన్ నవ్వుతూ అన్నాడు.

"పదండి!"

పక్కనేవున్న హోటల్లోకి దూరారిద్దరూ. వింధ్య అతన్ని నవ్వుతూ చూసింది.

"ఉద్యోగం వచ్చినందుకు ఉండాల్సినంత ఆనందంగా మీరు లేరు!"

మోహన్ ఆశ్చర్యంగా చూశాడు. "ఎందుకలా అంటున్నారు?"

"రోజూ మిమ్మల్ని చూస్తున్నా. మీరెందుకో ఉషారుగా లేరు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కనిపిస్తున్నారు. మిస్టర్ మోహన్, ఈ ఉద్యోగం మీకు ఇష్టంలేదా!"

మోహన్ ఆమెని ఓదేకంగా చూశాడు. వింధ్య కనురెప్పలు ఎందుకో టపటపలాడాయి. విశాలమైన కళ్ళు నీలి రంగు కొలనుల్లా వున్నాయి.

"నిజం చెప్పమంటారా?" మోహన్ మెల్లిగా అడిగాడు.

"నిజాన్నే వినడం నాకిష్టం!" వింధ్య నవ్వింది.

"మామూలుగా రావాల్సిన పద్ధతిలో నాకు ఈ ఉద్యోగం రాలేదు. పశువుని బలి తీసుకుని దేవత ఇచ్చిన వరంలా వుంది: నా శక్తితో కాకుండా మానాన్న చావుతో ఈ ఉద్యోగం నాకు లభించింది. ఆ భావాన్ని నేను భరించలేకుండా వున్నాను...." మోహన్ కంఠం విచారంతో బరువెక్కింది.

"మిస్టర్ మోహన్, నా హృదయంలోని భావాన్ని మీరు అక్షరాల్లో పొదిగారు. ఆ భావం నాకూ ముల్లులా గుచ్చుకుంటూనే వుంది. అమ్మ దుర్మరణం నాకు ఉద్వేగంగా మారింది. కానీ, అది నన్ను ఏకాకిగా మార్చింది!"

మోహన్ ఆమెని సానుభూతితో చూశాడు. "మిస్ వింధ్యా, విధి మనిద్దర్నీ ఒకే పరిస్థితిలో పడేసింది. నాకు నాన్నపోయాడు. మీకు అమ్మపోయింది. అయామ్ సారీ. మీరు ఏకాకి అన్నారు. నాఅన్నవాళ్ళు ఎవ్వరూ లేరా?"

వింధ్య తల అటూ ఇటూ ఊగింది. రింగులు ఆమె బుగ్గలకి బంగారు మలామా పూశాయి. "నాన్న ఎప్పుడో పోయాడు. నేనొక్కర్తే సంతానం...."

"అయామ్ సారీ...." మోహన్ మళ్ళీ అన్నాడు. సర్వర్ కాఫీలు పెట్టి వెళ్ళాడు. ఇద్దరూ కాఫీ తాగేశారు. మోహన్ వింధ్య మొహంలోకి చూశాడు.

"మీతో ఒక విషయం చెప్పాలనిపిస్తోంది. అలా పార్కులో కెళ్దామా?"

వింధ్య అతన్ని అదోలా చూసింది. అతని కళ్ళల్లో ఏదో సానుభూతి దీపంలా వెలుగుతోంది. అమ్మపోయాక, అద్దంలో చూసుకుంటే ఒకోసారి అతని కళ్ళల్లోని భావమే తన కళ్ళల్లో కనిపించడం ఆమెకి గుర్తొచ్చింది. ఎందుకో తన కళ్ళల్లోకి చూసుకుంటున్నట్టే అనిపించింది వింధ్యకి. ఆమె తటాలున లేచింది.

"పదండి."

మోహన్ లేచాడు.

పార్కులో ఏకాంతంగా వున్న మూలలో పచ్చగడ్డిమీద వింధ్య కూచుంది. ఆమె ముందు నిలబడి, ఆమెవేపు చూశాడతను. అంతవరకూ ఆమె దుస్తులరంగుని తను

ప్రత్యేకించి గుర్తించలేకపోయినందుకు మోహన్ విచారించాడు. వింధ్య కట్టుకున్న చీర పార్కు నేలని కప్పిన పచ్చిక రంగులో కలిసిపోయింది. ఆమె తలెత్తి అతని వేపు నవ్వింది.

"నన్నూ నుంచోమంటారా?"

మోహన్ నవ్వుతూ కూచున్నాడు. "తండ్రిని పోగొట్టుకున్న నేనూ, తల్లిని పోగొట్టుకున్న మీరూ—దాదాపుగా ఒకే మానసిక స్థితిలో వున్నాం. ఒకేజాతి పక్షులయ్యాం. అంచేత.... ఈ విషయం మీకు చెప్పాలనిపిస్తోంది. మీ హృదయంలో దాచుకుంటారా?"

వింధ్య అతన్ని ఆశ్చర్యంతో చూసింది. ఉపోద్ఘాతంగా ఆమెలో ఏదో ఆలోచనల్నీ, అనుమానాల్నీ రేపుతోంది. "చెప్పండి" ఆమె ముక్తసరిగా అంది.

"మిస్ వింధ్యా, బ్యాంకు దోపిడీ మామూలు దోపిడీల్లా జరగలేదని నాకు అనిపిస్తోంది...."

"అంటే?" వింధ్య ఆశ్చర్యంగా అడిగింది.

"ఎవరో స్వార్థపరులు, పథకంవేసి, దోపిడీ సాగించారని నాకు అనిపిస్తోంది...."

"అన్ని దోపిడీలూ స్వార్థపరుల పథకాలద్వారానే జరుగుతాయి!" వింధ్య నవ్వుతూ అడ్డుతగిలింది.

"నా అర్థం అదికాదు! ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాలకోసం ఈ దోపిడీ జరిపించబడిందని నా అనుమానం...." మోహన్ తన ఆలోచనల్ని ఆమెకి వివరించాడు. వింధ్య కళ్ళు ఆశ్చర్యంతో విప్పుకుంటున్నాయి. తన చెవుల్ని నమ్మలేనట్టు ఆమె వింటోంది. చివర్న మోహన్ ఇలా అన్నాడు:

"స్వార్థపరుల పథకం మూలంగా మనిద్దరికీ నాన్నా, అమ్మా పోయారు. ఆ పథకం లేకుంటే మానాన్న బతికి వుండేవాడు. మీరు ఏకాకి అయ్యేవారు కాదు!"

వింధ్య కళ్ళల్లో భయం గోచరించింది. క్షణంలో ఆమె లోని దుఃఖం భయాన్ని తరిమేస్తూ ఆమె కళ్ళల్లోకి ప్రవేశించింది. ఆమె పెదవులు గులాబీ రేకుల్లా కదిలాయి.

"ఆ పథకానికి కారకులైన వాళ్ళని కనిపెట్టడానికి నేను నిశ్చయించుకున్నా!" మోహన్ మెల్లిగా అన్నాడు.

వింధ్య కంగారుగా చూసింది. "ఎలా కనిపెడతారు?" ఆమె కంఠం వణికింది.

మోహన్ చిన్నగా నిట్టూర్చాడు. "కనిపెట్టాలి. ఎలాగో చెప్పలేను. ఈ ప్రయత్నంలో మీ సహకారం కావాలి...."

వింధ్య ప్రశ్నార్థకంగా చూసింది. "మిస్టర్ మోహన్, నేను ప్రస్తుతం మేనమామ ఇంట్లో వున్నాను. అయినా నేను ఏకాకినే. దుష్టశక్తుల్ని ఎదుర్కొనే ధైర్యం నాకు లేదు!" అందామె నిస్సహాయంగా.

మోహన్ చిన్నగా నవ్వాడు. "ముక్కలు చెక్కలైన ఓడలోంచి సముద్రంలోకి పడిపోయి చిక్కుపడ్డ ఇద్దరు ప్రయాణీకుల్లా వున్నాం మనం. ప్రమాదం ఇద్దర్నీ ఒకే గొడుగుకిందికి చేర్చింది. మీరు ఏకాకి కాదు; మీకు తోడుగా నేనున్నాను!"

వింధ్య ఉలిక్కిపడుతూ చూసింది. ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి. కిందపెదవిని పంటితో నొక్కిందామె. రెండు బుగ్గలమీదా కన్నీళ్ళు గీతలు గీశాయి.

"వింధ్యా....అయామ్ సారీ....నొప్పించాను...."

వింధ్య వణికే చేతుల్తో బుగ్గల్ని తుడుచుకుంది. 'మిస్' అనడం మరచిపోయిన మోహన్ని చిరునవ్వుతో

చూసింది.

"....మోహన్, థాంక్యూ సోమచ్. ఏం చెయ్యమంటారో చెప్పండి" అందామె.

మోహన్ నవ్వాడు, "'మిస్టర్'ని తీసిపారేసి మీరు పలుకుతూంటే నా పేరు ఎంతో బాగుంది!"

వింధ్య నవ్వింది. ఆమె కనురెప్పలు కిందికి వాలాయి. "నా....సహకారం కావాలన్నారు...."

"యస్. ఇందాకా నేను కనుక్కున్న విషయాలన్నీ మీకు వివరిస్తాను. మీరు చేయాల్సిందేమిటో చెప్తాను...." అంటూ మోహన్ అటూ ఇటూ చూశాడు. దరిదాపుల్లో ఎవ్వరూ లేరు. పార్కులో లైట్లు వెలిగాయి. అతను తగ్గ స్వరంలో ప్రారంభించాడు....

27

"మేనేజర్‌గార్ని కలుసుకోవాలి!"

తనకి పరిచయమైన కంఠం విని మోహన్ తలెత్తి చూశాడు.

వసంత్ అతన్ని నవ్వుతూ చూస్తున్నాడు. మోహన్ నవ్వలేదు. మెల్లిగా లేచాడు. రెడీగా వుంచుకున్న నాలుగు స్టేట్‌మెంట్స్‌నీ, రిజిస్టర్నీ తీసుకుని మేనేజర్ గదిలోకి నడిచాడు. వసంత్ కౌంటర్‌వెనక్కి వచ్చి, అతన్ని వెంబడించి, స్వింగ్‌డోర్ ముందు ఆగాడు.

మోహన్ లోపలికెళ్ళి స్టేట్‌మెంట్స్‌నీ, రిజిస్టర్నీ టేబుల్‌మీద పెట్టాడు. గణపతి అతన్ని నవ్వుతూ చూశాడు.

"మోహన్, వర్క్ ఎలావుంది?"

"ఇంటరెస్టింగ్‌గా వుంది సార్! ఎంత రాసినా, ఏం రాసినా డబ్బు గురించేగా?" మోహన్ నవ్వుతూ అన్నాడు.

గణపతి అదోలా చూస్తూ నవ్వాడు. స్వింగ్ డోర్ తోసుకుని వసంత్ లోపలికి వచ్చాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ...." అన్నాడతను.

గణపతి తలెత్తి ప్రశ్నార్థకంగా చూశాడు. మోహన్ వసంత్‌ని చూడ్డంలేదు. అతని కళ్ళు గణపతి మొహం మీదే వున్నాయి. గణపతి కళ్ళల్లో ఏదో అనుమానం రెప్పపాటుకాలం లీలగా కనిపించి మాయమైంది.

"యస్ః" అన్నాడతను.

వసంత్ అతని ఎదురుగావున్న కుర్చీలో కూచున్నాడు. నవ్వుతూ గణపతిని చూశాడు.

"మేనేజర్‌గారూ.... నేను బి.కామ్ పాసయ్యాను. ఉద్యోగం లేదు. మీరు యేదేనా లోన్ గ్రాంట్ చేస్తే...."

గణపతి, దగ్గి గొంతు సవరించుకున్నాడు. "ఇప్పుడు ఆ స్కీమ్ లేదు...." మెల్లిగా అన్నాడతను.

"ఉందని విన్నాను సార్ః ఒకటో తారీఖున మేం కొంతమంది చెయిర్మన్‌గార్ని కల్సుకోవాలని వచ్చాం. కానీ సమయానికి దొరకలేదు "

"మోహన్, అయిదునిమిషాల్లో సంతకాలుచేసి పంపుతాను. వెళ్ళి పనిచూసుకో" గణపతి వసంత్‌కి అడ్డు తగుల్తూ అన్నాడు. మోహన్ అలాగే అన్నట్టు తల పంకిస్తూ చూశాడు.

గణపతి మొహం బిగుసుకుపోయినట్టుంది. నుదుట మీద చెమట మెరవడం ప్రారంభించింది. మోహన్ బైటికి నడిచాడు. తన సీటుముందుకు వెళ్ళి పేపర్స్‌నీ, లెడ్జర్స్‌నీ సర్ది, ఇవతలికి నడిచాడు.

బ్యాంకుకి కొంచెందూరంలో నిలబడి సిగరెట్ వెలిగిం

చాడు. అతని చూపులు బ్యాంకు ఎంట్రన్స్‌మీదే వున్నాయి. సిగరెట్ సగం కాలింది. అతని కళ్ళు మెరిశాయి. వసంత్ గబ గబా నడుస్తూ అతన్ని సమీపించాడు.

"మిస్టర్ మోహన్, మనిషి అతనో కాదో నేను చెప్ప లేను. కానీ... అదే కంఠం!" వసంత్ ఉద్రేకంతో అన్నాడు.

మోహన్ వేళ్ళసందులోంచీ సిగరెట్ కిందికి జారింది. "వసంత్, నువ్వు పొరబడ్డం లేదుగా?"

వసంత్ ఆవేశంతో తలని అడ్డంగా ఊపాడు. "నో! అతని కంఠాన్ని పోల్చుకోడానికి, అతను ఎక్కువసేపు మాట్లాడేలా చూశాను. ప్రదర్శన జరిపించమన్న గెడ్డం వ్యక్తి గురించి అతనికి అమాయకంగా చెప్పాను. అతని మొహం చెమటతో తడిసిపోయింది! మిస్టర్ మోహన్, ఆ రోజు విన్న కంఠాన్ని ఈ రోజు మళ్ళీ విన్నాను!"

మోహన్ తటాలున వసంత్ చెయ్యి పట్టుకున్నాడు. "వసంత్, నీకో అయిదువందలిస్తాను. నాకో సహాయం చేస్తావా?"

"ఒక టేమిటి? అయిదు సహాయాలు చేస్తాను! చెప్పండి!" వసంత్ నవ్వుతూ అన్నాడు.

మోహన్ నవ్వుతూ అతనికో సిగరెట్ అందించి, తనొకటి వెలిగించాడు. "జరిగిందంతా నువ్వు మరిచి పోవాలి!"

వసంత్ కళ్ళు చిట్లించాడు. "ఎందుకు? ఇంతకీ మీరు ఎందుకు ఇదంతా చేయించారు?"

"వసంత్, ప్రస్తుతం నేను ఏమీ చెప్పలేను. నేనో ప్లాన్ వేస్తున్నా. అది పూర్తయ్యాక, నేనే అంతా చెప్తాను. ప్రశ్నలు అడక్కుండా వుంటానికి నూరో

రెండువందలు కలిపి యిస్తాను!" మోహన్ నవ్వుతూ అన్నాడు.

వసంత్ నవ్వాడు. "నేను నోరు తెరిస్తే నా ఫ్రెండ్సుకి దాచుకోకుండా అంతా చెప్పేస్తాను. చెప్తే ఈ ఏడువందల్లో వాటాలివ్వాలి!"

"అయితే, అంతా మరిచిపోతావా?" మోహన్ అడిగాడు.

"ఎప్పుడో మరచిపోయానుగా!" వసంత్ పక పకా నవ్వాడు. మోహన్ అతనితో శృతికలుపుతూ జేబులోంచీ పర్స్ తీశాడు. వసంత్‌ని మేపడం కొంచెం ఖర్చుతో పనే....

*   *   *

స్వింగ్‌డోర్స్ తోసుకుని మేనేజర్ గదిలోకి ప్రవేశించా డతను. గణపతి తలెత్తి ప్రశ్నార్థకంగా చూశాడు. మోహన్ చేతిలోని కాగితాన్ని అతని ముందు పెట్టాడు.

"ఒంట్లో ఎలాగో వుంది సార్. ఇవాళ వెలవు కావాలి...."

"ఓకే మోహన్. రేపొస్తావుగా?" లీవ్‌లెటర్ మీద పేనాతో గీకుతూ అన్నాడు గణపతి.

"వస్తాను సార్. థాంక్స్!" అంటూ మోహన్ నడిచాడు.

ఇరవై నిమిషాల తర్వాత మోహన్ నేతాజీనగర్‌లో ఆటో దిగాడు. మెయిన్‌రోడ్‌లోంచి సందులోకి తిరిగి, మెట్లెక్కి వరండాలో, తలుపు ముందు నిలబడ్డాడు. మెల్లిగా వేళ్ళతో తలుపు మీద చప్పుడు చేశాడు. రెండు నిమిషాల తర్వాత తలుపు తెరుచుకుంది. గుమ్మంలో నిలబడ్డ సుజాత ప్రశ్నార్థకంగా చూసింది. క్షణంలో అతన్ని

గుర్తించి నవ్వింది.

"లోపలికి రండి. ఏమిటిలా వచ్చారు?" అందామె లోపలికి నడుస్తూ.

"ఇవాళ సెలవు పెట్టాను. పనిమీద ఇలా వెళుతూంటే మీరు గుర్తొచ్చారు....తల మీద గాయం ఎలా వుంది?" మోహన్ హాల్లోకి నడుస్తూ అడిగాడు.

సుజాత అతనికి సోఫా చూపించింది. "థాంక్స్.... నొప్పి తగ్గింది....కాఫీ....టీ....?"

"నో థాంక్స్...." అంటూ మోహన్ కొంచెం ఇబ్బందిగా కదిలాడు.

సుజాత అతని ఎదురుగా కూచుంది. మోహన్ ఆమె వైపు చూశాడు.

"సిస్టర్, మీరో చిన్న సాయం చేయాలి...."

"చెప్పండి....ఏమిటి?" సుజాత ఆశ్చర్యంగా అడిగింది.

"నేను ఒక నంబర్ డయల్ చేసి, ఒక వ్యక్తిని ఫోన్‌లో కనెక్టు చేస్తాను. మీరు రెండు లక్షలు ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేయాలనుకుంటున్నట్టు అతనికి చెప్పండి. అతని సహాయం కావాలనండి, అతనేం చెప్తాడో జాగ్రత్తగా విని, నాకు చెప్పండి. మీ పేరు చెప్పకండి. అతను అడిగితే మిసెస్ రవీంద్రనాథ్ అని చెప్పండి."

"ఎవరా వ్యక్తి?"

"కుబేరా ఫైనాన్స్ కార్పొరేషన్ తాలూకు వ్యక్తి...." మోహన్ తడుముకోకుండా అన్నాడు.

"ఫిక్సెడ్ డిపాజిట్ గురించి ఎందుకడగాలి?" సుజాత కళ్ళు చిట్లిస్తూ అడిగింది.

"సిస్టర్, మీరు రిసీవర్ పెట్టేశాక చెప్తాను....ప్లీజ్."

సుజాత నవ్వింది. లేచి గోడవారగా వున్న టెలిఫోన్ వయిపు కదిలింది. మోహన్ గబ గబా నడిచాడు. టెలి ఫోన్ ముందు నిలబడ్డాడు. వీపుని సుజాత వయిపు తిప్పి, నంబర్ డయల్ చేశాడు. ఎంగేజ్‌టోన్. రిసీవర్ని పెట్టేసి క్షణం తర్వాత మళ్ళీ పైకెత్తి నంబర్ తిప్పాడు. అటు వయిపు కంఠం పలికింది.

"హలో....మేనేజర్‌గారా? మా అమ్మగారు మీతో మాట్లాడతారు...." అంటూ మౌత్‌పీస్‌ని అరచేత్తో మూశాడు. "అతను ఎఫ్. డి. గురించి చెప్పేదంతా జాగ్రత్తగా వినండి!" అంటూ రిసీవర్ని సుజాతకు అందించాడు.

"మీ దగ్గర రెండు లక్షలు ఫిక్సెడ్‌లో పడేయాలనుకుంటున్నా...."

"............"

"మిసెస్ రవీంద్రనాథ్....ఎఫ్.డి. వివరాలు చెప్తారా?" సుజాత నవ్వుతూ అడిగింది; వోరగా మొహాన్ని చూస్తూ. మోహన్ ఆమెనే చూస్తున్నాడు.

రెండు నిమిషాలపాటు సుజాత వింటూ మౌనంగా నుంచుంది.

"వెంటనే రాలేను....రేపు... ఉండండి....పన్నెండింటికి అక్కడుంటాను. థాంక్స్....అలాగే...." అందామె. ఫోన్ పెట్టేసి 'చాలా?' అన్నట్టు మోహన్ని చూసింది.

మోహన్ ఆమె మొహంలోకి చూస్తున్నాడు. "సిస్టర్, ఆ వ్యక్తి కంఠాన్ని ఎప్పుడేనా విన్నారా?"

సుజాత ఆశ్చర్యంగా చూసింది. ఉన్నట్టుండి ఆమె నోరు తెరచుకుంది. "మైగాడ్!" గుసగుసగా అందామె.

"మోహన్....ఎవరతను? ఆరోజు ఆయన్ని స్టేషన్‌కి రమ్మని ఫోన్‌లో చెప్పిన వ్యక్తి అతనే! అదే కంఠం! ఆ కంఠాన్ని ఎప్పుడో, ఎక్కడో విన్నట్టనిపించింది. కానీ నువ్వడిగేదాకా గుర్తుకి రాలేదు."

మోహన్ ఉద్రేకంతో చూశాడు. "థాంక్స్ సిస్టర్! మీ మేలు మరిచిపోలేను."

"మోహన్....ఆ వ్యక్తి ఎవరు?" సుజాత అడ్డొస్తూ అడిగింది.

"రంగనాథంగారి ప్రాణమిత్రుడు!" మోహన్ నవ్వుతూ అన్నాడు.

సుజాత అయోమయంగా చూసింది. "అయితే నా చేత ఎఫ్.డి, నాటకం ఎందు కాడించారు మీరు?"

ఈ ప్రశ్నకి మోహన్ దగ్గర సమాధానం రెడీగా వుంది. "అతను సైకలాజికల్ పేషెంట్. ఆ రోజు మీకు ఫోన్‌చేసి చెప్పినట్టే, నిన్న మా అమ్మకీ చెప్పాడు. నన్ను బస్టాండుకి పంపించాడు. అతని మీద నాకు అనుమానం వేసింది. వయసు మళ్ళిన వ్యక్తి. ఫైనాన్స్ కార్పొరేషన్ నడుపుతున్నాడు."

"అలాగా....?" సుజాత మెల్లిగా అంది.

"అవును. అతను మా నాన్నగారి బాల్యమిత్రుడు. అందుకే కన్‌ఫర్మ్ చేసుకోడానికి మిమ్మల్ని పలకరించమన్నాను. థాంక్స్! వాళ్ళబ్బాయికి చెప్పి సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసికెళ్ళమంటాను. వస్తాను సిస్టర్!" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"పాపం....కాఫీ తాగి వెళ్ళండి...." సుజాత నవ్వుతూ అంది.

"ఇంకోసారి వస్తాను. అర్జెంట్ పనుంది" అంటూ మోహన్ గుమ్మం వేపు కదిలాడు.

*　　　*　　　*

తలుపు తీసిన అనూరాధ, అతని వయిపు ప్రశ్నార్థకంగా చూసింది.

"మేనేజర్ గారున్నారాండీ?" మోహన్ అడిగాడు. మేనేజర్ లేడనీ, పది నిమిషాల క్రితం స్కూటర్ మీద ఎటో వెళ్ళాడనీ అతనికి తెలుసు.

"బజారుకెళ్ళారు.... మీరు...." అనూరాధ ఆగింది.

"నా పేరు మోహన్. ఈ మధ్యే మీవారి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఇవాళ సెలవు పెట్టాను. రేపుకూడా డ్యూటికి వెళ్ళలేను. పనిమీద ఇటువేపు వచ్చాను. మేనేజర్‌గారికి ఒకమాట చెప్పి వెళ్దామనుకుని...."

"లోపలికి రండి....వచ్చేస్తారనుకుంటా...." అనూరాధ గుమ్మంలోంచి కదిలింది. మోహన్ హాల్లోకి నడిచాడు. ఆమె చూపించిన కుర్చీలో కూచున్నాడు. ఆమె వైపు చిరునవ్వుతో చూశాడు.

"మీకు తెలిసే వుంటుంది.... ఈమధ్య బ్యాంక్ దోపిడీలో మా నాన్నగారు — గోవిందరావుగారు — చనిపోయారు. నాకు ఉద్యోగం వచ్చింది...."

"ఓహ్....గోవిందరావుగారు అన్యాయంగా బలైపోయారు. అయామ్‌సారీ...."

"థాంక్స్. మేనేజర్‌గారు ఆరోజు చాలా ధైర్యంగా వ్యవహరించారు! ఆ షాక్‌ని మీరెలా తట్టుకున్నారు!" మోహన్ నవ్వుతూ అన్నాడు.

అతని ఎదురుగా కూచుని అనూరాధ నవ్వింది. "ఆరోజు నేను లేను. ఇన్స్‌పెక్షన్ గొడవల్తో తీరికవుండ

దని, ఆయన నన్ను మా పుట్టింటికి పంపేశారు. చాలా ఆలస్యంగా తెలిసిందినాకు! ఆయనది మొండిధైర్యం. ప్రాణాలకి తెగించారు."

మోహన్ క్షణకాలం మౌనంగా వుండిపోయాడు. ఆ రోజు ఇన్స్పెక్షన్ వున్నట్టు అతను భార్యకికూడా చెప్పా డన్నమాట! ఏదో కారణం లేకుండా ఎవ్వరూ అబద్ధా లాడరు!

"అవును. మేనేజర్‌గారు ప్రాణాల్ని లెక్కచేయ కుండా దోపిడీ సాగించిన వ్యక్తిని చంపేశారు. పేపర్లన్నీ ఆయన్ని ఆకాశానికెత్తేశాయి!" మోహన్ నవ్వుతూ అన్నాడు.

"బ్యాంక్స్‌లో మీరంతాకూడా జాగ్రత్తగా వుండాలి!" అనూరాధ చిరునవ్వుతో అంది.

"కరెక్ట్....వెళ్ళొస్తానండీ....రేపు ఆయనకి ఫోన్ చేస్తాను," అంటూ లేచాడు మోహన్.

రోడ్డమ్మట నడుస్తూ సిగరెట్ వెలిగించాడతను. అత నిలో ఏదో ఉత్సాహం ఉరకలేస్తోంది. దాన్ని వెంటా డుతూ ఏదో భయం లీలగా వ్యక్తమవుతోంది.

తన తండ్రికిలాగే మేనేజర్‌కీ పారితోషికం లభించింది. తన తండ్రీ, గణపతీ ఇద్దరే గాయపడ్డారు! చనిపోయి నష్ట పరిహారాల్ని పొందిన తండ్రిమీద అనుమానం కలిగినట్టే, యాభై వేలూ, కీర్తీ సంపాదించుకున్న గణపతిమీదా తనకి అనుమానం కలిగింది. చివరికి తన అనుమానం, అర్థ రహితం కాదని తేలిపోయింది!

తన పరిశోధన రెండు విషయాల్ని రుజువుచేస్తోంది: ఒకటి — బ్యాంకులో దోపిడీ జరుగుతుందని గణపతికి

ముందే తెలుసు. రెండు—జరగబోయే దోపిడీని అతను ఆపే ప్రయత్నం చేయలేదు. పోలీసులకి తెలియజేసి, వాళ్ల సహాయం తీసుకోలేదు.

మోహన్ తటాలున ఆగాడు. అతని బుర్రలో ఏదో ఆలోచన అగ్గిపుల్లలా వెలిగింది. దోపిడీని అరికట్టలేక పోయినా, అతను దొంగని కాల్చి చంపేశాడు! దొంగని చంపకుండా గాయపరచివుంటే సొమ్ము మాయమయ్యేది కాదు. తతిమ్మా దొంగలు దొరికిపోయేవారు! వాళ్ళతో బాటే అతను కూడా!

మోహన్ గుండె దడదడ కొట్టుకుంది. అయితే, గణపతి దోపిడీదొంగను చంపడంలో వేరే ఉద్దేశం వుందన్న మాట! కాలిపోయిన బ్యాంక్ రికార్డ్సుకీ, చంపబడిన దొంగకీ, దోపిడీ అయిన డబ్బుకీ, గణపతి మోటివ్‌కీ ఏదేనా లంకె వుందా?

28

గణపతి టైం చూసుకున్నాడు. మూడుకావస్తోంది.

ఇవాళ ఇంటికెళ్ళగానే అనూరాధను తీసుకొని బజారు కెళ్ళాలి. ఆమెకి నెక్లెస్‌కొనాలి. తను పాడుచేసిన ఆమె నగలన్నీ మెల్లిమెల్లిగా మళ్ళీ సంపాదించాలి. గతాన్ని మరిచిపోయి, తను ఇంక జాగ్రత్తగా, నిజాయితీగా బతకాలి. తనకేసు జస్టిపై అయింది చేసిన తప్పుకి శిక్ష అనుభవించాడు తను! ఇంక హాయిగా జీవించే హక్కు తనకివుంది! తనముందున్న కాఫీ కప్పుకోసం చెయ్యి చాచాతడను.

టెలిఫోన్ మోగింది. కాఫీ చప్పరిస్తూ మోగుతున్న ఫోన్ని విసుగ్గా చూశాడతను. తియ్యటి ఆలోచనల్ని టెలిఫోన్ తెంచేస్తోంది. ఎడంచేత్తో రిసీవర్ని విసురుగా లాగి,

చెవికి ఆనించాడతను.

"యస్ ..." అన్నాడు విసుగ్గా.

"గణపతా!"

గణపతి పళ్ళుకొరుక్కున్నాడు. మనుషులకి మర్యాద తెలీదు. "యస్! హూ యీజ్ దట్?"

"గణపతీ, క్షేమంగా వున్నావా?" సన్నటి కంఠం మెల్లిగా అంది.

గణపతి కళ్లు చిట్లించాడు. "ఎవడు!" కసిరాడతను.

"నీ యోగక్షేమాల్ని ఎప్పుడూ కాంక్షించే వ్యక్తిని: నిట లాక్షరావుని!" అవతలి కంఠంలో నవ్వు ధ్వనించింది.

గణపతి ఉలిక్కిపడ్డాడు. శరీరంమీద కనిపించని గొంగళిపురుగులు పాకుతున్నట్టనిపించిందతనికి. నిటలాక్ష రావు. అసంభవం! తన చేతులారా ఆ రాక్షసుడిని చంపే శాడు....

"గుర్తున్నానా?"

"నువ్వెవరో నాకు తెలీదు....రాంగ్ నంబర్... "

"ఫోన్ పడేయొద్దు. నేనెవరో నీకు తెలుసు. నీనంబరు నాకు తెలుసు! గణపతీ, అర్జెంటుగా అరవైవేలు కావాలి. నువ్వు యాభై సర్దితేచాలు. తతిమ్మది ఎలాగో ఏర్పాటు చేసుకుంటా ...."

గణపతికి ముచ్చెమటలు పోస్తున్నాయి. కుడిచేతిలోని కాఫీ కప్పు వణకసాగింది. కప్పుని బల్లమీదకుక్కి ఆరి పోతున్న పెదాల్ని తడుపుకున్నాడతను. కలా? నిజమా? ఎవరీవ్యక్తి? నిటలాక్షరావు కాకపోయినా, అతని గురించీ, తనగురించీ తెలిసిన వ్యక్తి అనడంలో సందేహంలేదు: గుడ్ గాడ్!

"నిటలాక్షరావు బూడిదయ్యాడని నువ్వు అనుకుం

టున్నావ్. నువ్వు బూడిదచేసింది నక్షత్రకమూర్తిని. నా సంగతి నీకు తెలీదు. నేను నీలాంటివాళ్ళకి అందను. కానీ నా మూడోకన్ను, ఫాలనేత్రం నిన్ను అనుక్షణం గమనిస్తూ వుంటుంది. రెడీగా వుండు. రేపు సూచన లిస్తాను! చెప్పినట్టు వినకపోతే నా ఫాలనేత్రం తెరుచు కుంటుంది. కాలి బూడిదైపోతావ్!"

గణపతి గజగజ వణకసాగేడు. అతని చెవిలో క్లిక్కు మంది. తనుకూచున్న గది గిర్రున తిరుగుతుంది. కడు పులో ఏదో శూన్యం. చెవుల్లో రొద. రెండోసారి ధ్వనిం చిన 'క్లిక్' శబ్దాన్ని వినేస్థితిలో అతనులేడు.

* * *

తన తండ్రి అప్పులపాలైనట్టే గణపతి అప్పుల పాలయ్యాడా? తన తండ్రి ఒకవిధంగా శక్తికిమించి అప్పు చేశాడు. యాభైవేలకోసం గణపతి అంత రిస్క్ తీసు కున్నాడా? తనకి తెలీని మెలిక, అర్థంకాని గూడుపుఠాణీ ఏదో వుంది. అది తెలిస్తేగానీ, తన అనుమానాలకి అర్థం వుండదు.

"ఏమిటి, ఏదో లోకంలో వున్నారు?" వింధ్య కంఠం అతన్ని వర్తమానంలోకి లాక్కొచ్చింది. అప్పుడే నిద్ర మేల్కొన్న వ్యక్తిలా చూశాడు మోహన్.

"వింధ్యా, బాంకుదోపిడీగురించి ఇద్దరివ్యక్తులకి ముందే తెలుసు...."

"ఎవరెవరికి!" వింధ్య అడ్డొస్తూ ప్రశ్నించింది.

"మా నాన్నకి...."

"మోహన్!" వింధ్య ఆశ్చర్యాన్ని దాచుకోలేక పోయింది.

"మేనేజర్‌కి" మోహన్ ఆమె ఆశ్చర్యాన్ని గమనించ కుండా అన్నాడు.

వింధ్య కళ్ళు విశాలంగా అయ్యాయి. ఏదో అదుర్దా ఆమె మొహం మీద అద్దంలో ప్రతిబింబంలా అవుపిస్తోంది.

"తెలిసినా వాళ్ళిద్దరూ దోపిడీని ఆపే ప్రయత్నం చేయలేదు. ఎందుకు? ఏమిటి వాళ్ళ మోటివ్? నాన్న మోటివ్ చూచాయగా నాకు తెలుసు. గణపతి మోటివ్ ఏమిటి?"

"మోహన్...."

మోహన్ వింధ్యని ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఇవాళ.... టెలిఫోన్ మోగింది. ఆ టేబుల్ దగ్గర అకౌంటెంటు లేరు. ఫోన్ని అందుకున్నాను. అది మేనే జర్‌గారిది. ఎవరో వ్యక్తి చాలా నిర్లక్ష్యంగా ఆయన్ని ఏకవచనంలో పలకరించాడు. అప్రయత్నంగా విన్నాను. అది తప్పని నాకు తెలుసు...."

"వింధ్యా, ఏమిటి విన్నావో చెప్పు!" మోహన్ అడ్డు తగిలాడు.

తగ్గుస్వరంలో వింధ్య చెప్పసాగింది. మోహన్ చెవులు రిక్కించి విన్నాడు. ముగించి. వింధ్య అతన్ని సాభిప్రాయంగా చూసింది. మోహన్ కళ్ళు రవ్వల్లా మెరుస్తున్నాయి. చేతులమీద వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. అతను ఆవేశంతో లేచి నిలబడ్డాడు.

వింధ్య నిలబడి అతన్ని అయోమయంగా చూసింది. మోహన్ ఆమె దగ్గరగా కదిలాడు. రెండుచేతుల్తో ఆమె భుజాల్ని పట్టుకున్నాడు. అప్రయత్నంగా అతని చేతులు ఆమెని దగ్గరగా బలంగా లాగాయి.

"వింధ్యా, థాంక్యూ, థాంక్యూ! యూ ఆరే డార్లింగ్! నువ్వు చెప్పిన విషయం నా అనుమానాల్ని పటాపంచలు చేసింది....వింధ్యా....థాంక్యూ సోమచ్! థాంక్యూ ..."

పిచ్చివాడిలా అదురుతున్న మోహన్ చేతుల మధ్య ఇరుక్కుపోయిన వింధ్య ఇబ్బందిగా కదిలింది. ఆమె అరచేతులు అతని ఛాతీని నొక్కుతున్నాయి.

"మో....హ....న్.... ....ఎవరేనా....చూస్తారు...." వింధ్య కంఠం వణికింది.

మోహన్ తటాలున ఆమెని వదిలేశాడు. ఒక అడుగు వెనక్కివేసి, ఆమెని సిగ్గుపడుతూ చూశాడు వింధ్య బుగ్గలు కుంకుమతో నిండిన బంగారుగిన్నెల్లా వున్నాయి. ఆమె విశాల నేత్రాలు ఆనందాశ్చర్యాలలో నిండిన సరోవరాల్లా వున్నాయి.

"వింధ్యా....అయామ్....సారీ....నాకు...." మోహన్ వణికే పెదవుల్తో ఏదో చెప్పబోయాడు.

"మోహన్....ఇంకోసారి సారీ అనొద్దు!" అప్రయత్నంగా తన నోట్లోంచి జారిన ఏకవచనాన్ని ఆమె గుర్తించలేదు. మోహన్ గుర్తించాడు; ఆనందంతో.

"వింధ్యా, నేను ఒకచోటికి వెళ్ళొస్తాను. నువ్వు ఇంటికెళ్ళిపో...."

"మోహన్....ఎక్కడికి....? తొందరపడొద్దు.... .... ప్రమాదం...."

మోహన్ ఆమెని చిరునవ్వుతో చూశాడు. "వింధ్యా, నీ చెవులు నా కళ్ళకి సత్యాన్ని, భయంకరమైన సత్యాన్ని చూపించాయి! ఆ సత్యాన్ని చూడాల్సిన, చూడగలిగిన కళ్ళు వేరేవున్నాయి! ఆ కళ్ళని నేను తక్షణం చూడాలి! నువ్వు విన్నదీ, కన్నదీ మరచిపో, హాయిగా

నిద్రపో...."

"మోహన్...."

"మా నాన్నా, మీ అమ్మా దుర్మరణంపాలవడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులయిన దుర్మార్గులెవరో నాకు అర్థమవుతోంది. వాళ్ళు శిక్షించబడాలి. నాన్నా, అమ్మల ఆత్మలు శాంతించాలి...."

"జాగ్రత్తగా వెళ్ళిరా! నువ్వు రాకపోతే మళ్ళీ ఏకాకి అయిపోతాను మోహన్!" వింధ్య కళ్ళు తడిగా మెరిశాయి.

మోహన్ ఆమెని ఉద్రేకంతో చూశాడు. ఏదో బాధ, ఏదో ఆనందం అతనిలోంచి ఉప్పెనల్లా లేస్తున్నాయి. ఆమెని తనలో లీనం చేయడానికి ఉరకలేస్తున్నాయి. అతను ఆవేశంతో ఆమె దగ్గరగా కదిలాడు. కిందికి వొంగి తన కాళ్ళదగ్గరున్న ప్లాస్టిక్ సంచినీ ఎడంచేత్తో పట్టుకున్నాడు. కుడిచేతిని ఆమె భుజంచుట్టూ పోనిచ్చాడు. ఆమెని నడిపిస్తూ పార్కు గేటువైపు కదిలాడు.

29

అతను ఆవేశంతో, పూసగుచ్చినట్టు చెప్పిందంతా పోలీస్ కమీషనర్ ఆత్మానందరావు మౌనంగా, ఓపిగ్గా విన్నాడు. చెప్పడం ముగించి మోహన్ ఆయన్ని ఉద్రేకంతో చూశాడు.

పోలీస్ కమీషనర్ సిగరెట్ వెలిగించాడు. పొగ వూదుతూ మోహన్ని చూశాడు.

"మోహన్, నీ తెలివినీ, చొరవనీ, చాకచక్యాన్నీ మెచ్చుకుంటున్నాను. థిరెటికల్‌గా నువ్వు చెప్పింది చక్కగా వుంది. తార్కికంగా అతికినట్టుంది. అయితే మనకి ఉక్కుముద్దల్లాంటి ఎవిడెన్స్‌లు కావాలి...."

"సార్, బ్యాంకు దోపిడీ జరుగుతున్నట్టు అతనికి ముందే తెలుసు. అతను ఇన్‌స్పెక్షన్ జరగబోతున్నట్టు వసంత్‌కీ, అనురాధగారికీ చెప్పాడు.

"అతనే రంగనాధం భార్య సుజాతకి ఫోన్ చేశాడు. అతనే సుజాతని గాయపరిచాడు. అతనే ఆ రోజు రంగనాధం డ్యూటీకి రాకుండా చూశాడు.

"అతని కంఠాన్ని వసంత్, సుజాతా—ఇద్దరూ పోల్చారు!" మోహన్ ఉద్రేకంతో అన్నాడు.

కమీషనర్ ఆత్మానందరావు చిన్నగా నవ్వాడు. "క్రాస్ ఎగ్జామినేషన్‌లో వాళ్ళిద్దరి సాక్ష్యాల్ని చిల్లులు పొడవొచ్చు. మనకి ఇంకా గట్టిసాక్ష్యం కావాలి....!"

"నేనిస్తాను! అతనే రంగనాధం భార్యని గాయపరిచాడు. ఏదో కారణం లేకుండా ఏ వ్యక్తీ ఇన్ని అబద్ధాలాడడు. అమాయకురాలయిన ఒక స్త్రీని గాయపరిచాడు!"

"మోహన్...."

మోహన్ ప్లాస్టిక్ సంచీని కమీషనర్ ముందుకి తోశాడు. "సార్, నేను ఉత్తి చేతుల్తో రాలేదు! మీ డిపార్ట్‌మెంట్ ఆ రోజు రంగనాధం భార్యని గాయపరచడానికి ఉపయోగించిన స్పానర్‌మీది వేలిముద్రలు తీసుకున్నారు. అవి అతనివే అని నా నమ్మకం. అతను వొంటరిగా అన్నీ చేశాడు. అతని వేలిముద్రలున్న పేపర్‌వెయిట్‌ని జేబురుమాలతో చుట్టి ఈ బాగ్‌లో పడేసి తెచ్చాను. స్పానర్‌మీద వేలిముద్రల్నీ, ఈ పేపర్‌వెయిట్ మీది వేలిముద్రల్నీ పోల్చి చూడండి!"

కమీషనర్ మోహన్ని మెప్పుగా చూశాడు. నవ్వుతూ కాలింగ్‌బెల్ నొక్కాడు. లోపలికి వచ్చిన ఇన్‌స్పెక్టర్

రాజారాంకి ప్లాస్టిక్ సంచీ చూపించాడు.

"రాజారామ్, సంచీలో వున్న పేపర్ వెయిట్ మీది వేలిముద్రలు తీయించాడు. నెలక్రితం రంగనాథం అనే వ్యక్తి భార్య సుజాతని గాయపరచడానికి ఉపయోగించిన శ్పానర్ మీద దొరికిన వేలిముద్రల్తో పోల్చి చూడు. క్విక్!"

రాజారామ్ సంచీ తీసుకుని మౌనంగా నిష్క్రమించాడు.

కమీషనర్ మొహాన్ని తదేకంగా చూశాడు. "మోహన్, నాకు చెప్పిన విషయాలన్నీ ఇంకేవరికేనా చెప్పావా?"

"చెప్పాను; వింధ్యకి."

కమీషనర్ గుబురు కనుబొమలు ముడిపడ్డాయి.

"బ్యాంక్ రాబరీ సమయంలో ఒకావిడ మరణించింది. ఆమె కూతురు వింధ్య."

"ఓహ్....ఆ అమ్మాయికీ ఉద్యోగం వచ్చిందనుకుంటా" కమీషనర్ అన్నాడు. "మోహన్, ఆమె దాన్నంతా రహస్యంగా వుంచుతుందా?"

మోహన్ చిన్నగా నవ్వాడు. "సార్: మీ కళ్ళల్లోని నిజాయితీ ఆమె కళ్ళల్లో నాకు కనిపించింది."

కమీషనర్ గొల్లున నవ్వాడు "ఓకే, మోహన్. ఇంకా నీకేం తెలుసు?"

"దోపిడీ జరుగుతుందని తెలిసిన వ్యక్తులు ఇద్దరున్నారు. ఒక వ్యక్తి మా నాన్న...."

"మోహన్!" కమీషనర్ నివ్వెరపోతూ అరిచాడు.

"ఆయనా, మా నాన్నా - ఇద్దరూ కలిసి దీన్ని ప్లాన్ చేశారనీ, ఏదో కారణంవల్ల మా నాన్న మరణించాడనీ నాకు అనుమానంగా వుంది. దోపిడీ జరుగుతుందని

తెలిసిన ఆ వ్యక్తి, దాన్ని ఆపడానికి సక్రమంగా ప్రయత్నించలేదు. డబ్బు చెయ్యి జారిపోకుండా వుండటానికి, సకాలంలో తన సమయస్ఫూర్తిని ప్రదర్శించలేదు. మూట చెయ్యి జారిపోయేక, అతను సుబోధ్‌కుమార్ పేరుతో వున్న దొంగని షూట్ చేశాడు. అంటే అతని నోటిని శాశ్వతంగా మూసేశాడు. ఎందుకు?" మోహన్ కమీషనర్‌ని చూస్తూ అన్నాడు.

కమీషనర్ మోహన్ని తదేకంగా చూశాడు. "మోహన్ ఎందుకు?"

"అతను బతికుండడం అతని కిష్టం లేదు."

"ఎందుకు?"

"అతను బ్లాక్‌మెయిల్ చేయబడుతున్నాడని నాకు అనుమానంగా వుంది."

"వాట్?" కమీషనర్ ఆశ్చర్యంగా అరిచాడు.

"నా అనుమానానికి ఆధారం వుంది!" అంటూ మోహన్ వింధ్య తనకి చెప్పిన విషయాన్ని కమీషనర్‌కి వినిపించాడు.

కమీషనర్ ఏదో చెప్పబోయాడు. తలుపు తెరిచిన చప్పుడయింది.

ఇన్‌స్పెక్టర్ రాజారామ్ నవ్వు మొహంతో లోపలికి వచ్చాడు.

"శ్పానర్ మీది వేలిముద్రలూ, పేపర్ వెయిట్ మీది వేలిముద్రలూ ఒక్కరివే సార్!"

మోహన్ కుర్చీలో ముందుకి జరిగాడు. కమీషనర్ తల ఆవేశంతో పయికీ కిందికీ ఊగింది. మెరుస్తున్న కళ్ళతో అతను మోహాన్ని చూశాడు.

"మోహన్, యూ ఆర్ రైట్. రేపు నీకు ఫోన్

చేస్తాను. అయిదు గంటల్లోగా ఫోన్ రాకపోతే నువ్వే ఇక్కడికి వచ్చెయ్!"

"సార్, ఇందాకా చెప్పిన విషయం ..." మోహన్ సందేహిస్తూ ఆగాడు.

"అంతా మరిచిపో. ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకో!" కమీషనర్ నవ్వుతూ అన్నాడు.

మోహన్ నవ్వుతూ లేచాడు. కమీషనర్‌కి నమస్తే చెప్పి గదిలోంచీ బయటికి నడిచాడు. కమీషనర్ ఇన్స్పెక్టర్ రాజారామ్‌ని చూశాడు. చిన్న కాగితం ముక్కలో ఏదో రాసి, అతనికి అందించాడు.

"రాజారామ్, ఈ వ్యక్తి ఆఫీసులో, ఇంట్లో టెలిఫోన్స్ వున్నాయి. ఈ క్షణం నుంచీ నేను చెప్పేదాకా, ఆ రెండు టెలిఫోన్స్ ద్వారా జరిగే ప్రతి సంభాషణా మనకి తెలియాలి. ఏయే కాల్స్ ఎవరెవరు ఏయే నంబర్ల నుండీ చేశారో మనకి కావాలి అలాగే ఆ రెండు నంబర్ల నుండీ ఎవరు ఎవరితో ఏం మాట్లాడినా మనం వినాలి! అర్థమైందా?"

"యస్సర్."

"రెండో కంటికి, రెండో చెవికి తెలీకుండా ఈ ఏర్పాట్లు జరగాలి!" అంటూ కమీషనర్ ఆత్మానందరావు కుర్చీలో వెనక్కి వాలాడు. మోహన్ చెప్పిన మాటలు అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

30

నల్లటి లెదర్‌బాగ్ పట్టుకుని గణపతి పేవ్‌మెంట్ మీద నడుస్తున్నాడు. మళ్ళీ మెలకువలోంచి నిద్రలోకి, పీడ కలల్లోకి జారుకున్నట్టుందతనికి. అంతా అయోమయంగా వుంది.

నిటలాక్షరావు తనే అని నక్షత్రకమూర్తి తనకి నమ్మకం కలిగేలా నిరూపించుకున్నాడు. ఆ రోజుతో అతని పీడ విరగడయిపోయిందనుకుని హాయిగా నిట్టూర్చాడు తను.

కానీ అసలు నిటలాక్షరావు, గుళ్ళో మూలవిరాట్టులా ఎక్కడో భద్రంగా వున్నాడు. అతనిలా నటించి, తనని మోసం చేసిన లుచ్ఛా సర్వనాశనమయ్యాడు. తనని మళ్ళీ సర్వనాశనం చేయడానికి అసలు వ్యక్తి శివలింగంలా నిలబడే వున్నాడు: అంతా నమ్మశక్యం కాకుండా వుందతనికి. నిటలాక్షరావు కంఠంలో ధ్వనించిన దర్పం, హుందా అతని చేతుల్లో ఇంకా తురుపులున్నాయని తెలియజేస్తోంది.

మొదటిసారిగా, చివరి సారిగా నిటలాక్షరావుని చూడ్డానికి అతను నిశ్చయించుకున్నాడు. చివరిసారిగా, యాభై వేలని వాడి మొహాన విసిరికొట్టేస్తాడు. ఆ తరవాత....ఆ తరవాత వాడి పీడ వదిలించుకుంటాడు. తను ఇప్పటికే ఇద్దర్ని హతమార్చాడు. రెండు మేకల్ని తెగనరికిన వ్యక్తికి మూడో మేకని నరకడం కష్టమేం కాదు.

హోటల్ హిమాలయా ముందు ఆగి, గణపతి టైమ్ చూశాడు. తొమ్మిదవడానికి ఇంకా పదినిమిషాలుంది.

తను సరిగ్గా తొమ్మిదిగంటలకి ఆ తలుపుమీద తట్టాలి. నిటలాక్షరావు తనకి చాలా సూచనలిచ్చాడు. తన జేబులు ఖాళీగా వుండాలి. సిగరెట్లూ, లైటర్, అగ్గిపెట్టె, పేనా, బాల్‌పాయింట్, పెన్సిల్—ఏదీ తన జేబుల్లో వుండకూడదు, తను బెల్టు కట్టుకోకూడదు. చెప్పులే వేసుకోవాలి. బూట్లు నిషేధం. నల్లటి లెదర్‌బాగ్‌లో నైవేద్యం పట్టుకెళ్ళాలి: తను నిస్సహాయంగా అతను చెప్పినట్టు

నడుచుకోవాల్సిందే.

ఉక్రోషంతో తిట్టుకుంటూ గణపతి జేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాడు. సిగరెట్ వెలిగించాడు. పాకెట్‌లో ఇంకా మిగిలివున్న రెండు సిగరెట్లని విచారంతో చూశాడు. అన్నీ కాల్చడానికి తనకి వ్యవధిలేదు. పాకెట్‌నీ, అగ్గిపెట్టెనీ హోటల్ ముందున్న క్రోటన్ కిందికి విసిరాడతను. తిరిగొచ్చేటప్పుడు తీసుకోవచ్చు!

అతనికి అనూరాధ గుర్తొస్తోంది. నెక్లెస్ కొనటాన్ని తను వాయిదావేసినప్పుడు ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం విశ్వరూపంలో కనిపించింది తనకి. మళ్ళీ నక్షత్రకమూర్తి తనని కలుసుకున్నాడా అని అడిగిందామె. నక్షత్రకమూర్తి కల్పుకున్నా, ఫోన్‌చేసినా తను అదోలా అయిపోతాడని ఆమెకి తెలుసట!

సిగరెట్ పీకని గిరాటేసి, గణపతి హోటల్లోకి దూరాడు. తనకి ఇవ్వబడిన సూచనల ప్రకారం మెట్లవైపు తిరిగాడు. గబగబా మెట్లెక్కసాగేడు.

సరిగ్గా తొమ్మిది గంటలకి అతను తలుపుముందు నిలబడ్డాడు.

తనకి ఆందోళనా, భయం ఏవీ కలగకుండా వున్నందుకు ఆశ్చర్యపోతూ గణపతి వేళ్ళ కణుపుల్తో తలుపుమీద చప్పుడు చేశాడు. వెంటనే తలుపు లోపలికి లాగబడింది.

ముందు గదిలో చీకటిగా వుంది. తలుపు పక్కనే నీడలా సన్నటి వ్యక్తి నిలబడ్డాడు. అతని తల పాము పడగలా ఊగుతూ లోపలికి రమ్మని గణపతికి సైగ చేసింది. గణపతి గదిలో ప్రవేశించాడు. అతని వెనకే తలుపు మూయబడింది,

"చెప్పులు తీసెయ్!"

గణపతి యాంత్రికంగా చెప్పులు తీసేశాడు. అతని వీపుమీద ఏదో మొరటుగా గుచ్చుకుంది.

"చేతులు పైకెత్తి, కదలకుండా నుంచో! పాము బుసలా ధ్వనిస్తూ ఆ వ్యక్తి కంఠం ఆజ్ఞాపించింది.

గణపతి చేతులు పైకెత్తాడు. లెదర్ బాగ్ అతని చేతి లోంచీ వేళ్ళాడుతోంది. ఏదో చెయ్యి మొరటుగా అతన్ని ఆపాదమస్తకం తడివింది. "చేతులు దించు!"

గణపతి చేతులు దించాడు. ఆ వ్యక్తి వెనకనుంచీ సంచీని లాక్కున్నాడు. జిప్‌లాగి, లోపలికి చేతినిపోనిచ్చి దేనికోసమో వెతికాడు. జిప్‌లాగి, సంచీని గణపతికి అందించాడు. తలుపుపక్కనే వున్న స్విచ్‌ని నొక్కాడు.

"లోపలికెళ్ళు!" అన్నాడతను, తలుపుని తోస్తూ.

సింహం పడుకున్న గుహలోకి వెళ్తున్న కుందేలులా గణపతికి అడుగులు వేశాడు. ఎర్రలైటు డిమ్‌గా వెలుగు తోంది. ఎదురుగా కూచున్న వ్యక్తిని చూస్తూ, నివ్వెర పాటుతో అచేతనంగా నిలబడిపోయాడతను.

కుర్చీలో వెనక్కివాలి, ముందున్న టీపాయ్‌మీద కాళ్ళని వుంచుకున్నాడతను. పొడుగాటి విగ్రహం. పీపా లాంటి పొట్ట. గ్లోబులావున్న తల భుజానికి అతికించి నట్టుంది. బలిసిన ఎద్దు అర్రులాంటి మెడ తలకీ, భుజా లకీ మధ్య అదృశ్యమైపోయింది; బోడిగుండుమీద ఎర్రగా కాంతి ప్రతిఫలిస్తోంది. పాముచెవులు గణపతినే చూస్తు న్నాయి. నవ్వుతో విచ్చుకున్న పెదవుల మధ్య పళ్ళు మెరుస్తున్నాయి. ఆ నవ్వులో స్నేహభావం లేదు. ఎగతాళీ, బెదిరింపూ వున్నాయి.

ఆరోజు....ఆరోజు ద్వారపాలకుడుగా అండర్ వేర్‌లో,

నల్లటిరంగు శరీరంతో తనకి కనిపించిన పర్వతకాయుడు ఈరోజు నిటలాక్షరావుగా, దర్శనమిస్తున్నాడు!

అయితే ఈసారి అతని శరీరం నల్లగాలేదు. గోధుమ రంగు నాగులా అతను కనిపిస్తున్నాడు. తెల్లటి, పల్చటి పైజామా, జుబ్బా ధరించాడతను. కండలు తిరిగిన శరీరం పొరవదుల్తున్న పాములా అగుపిస్తోంది గణపతికి.

"నువ్వా!" తెప్పరిల్లిన గణపతి ఆశ్చర్యంతో అన్నాడు.

"నేనే;" అతని కంఠం కీచుగా ధ్వనించింది పిట్ట ఘనం; కూత కొంచెం!

"ఏమిటీ నాటకం?" గణపతి అతనికి అయిదడుగుల దూరంలో ఆగాడు.

"నాటకం!" అతను కిలకిల నవ్వాడు. "మైడియర్ ఇంటలిజెంట్ మేనేజర్, గతంలో నువ్వు నాటకాన్ని చూశావు. ఇప్పుడు నువ్వు చూస్తోంది యధార్థం!"

"యజమానికి టోపీ వేసి, అతని సింహాసనం ఎక్కావా? వాతలు పెట్టుకున్నంత మాత్రాన నక్క పులికాలేదు! నీ బుకాయింపులు...."

"మాట్లాడకు. నోరు మూసుకో, చెవులు తెరుచుకో! నీకోసం, ఆరోజు నా శిష్యుణ్ని నా సింహాసనంలో కాసేపు కూచోబెట్టాను. నీ కోసం నా శిష్యుడు నాలాగా నటిస్తూ నీ బ్యాంకుని దోచుకున్నాడు. నీ ప్లాను విన్నప్పుడే నిన్ను నేను అనుమానించాను. నా అనుమానం నిజం చేశావు. నా శిష్యుడ్ని చంపేశావు! గణపతీ నువ్వు పొరపాటు చేశావు. బిజినెస్ అగ్రిమెంటుని ఖూనీచేశావు. నా శిష్యుడు క్షేమంగా తిరిగి వచ్చివుంటే, నువ్వు ఏ బెడదా లేకుండా జీవించేవాడివి. మోసాన్ని నేను క్షమించను;

సహించను!" నిటలాక్షరావు గంభీరంగా అన్నాడు. జుబ్బా జేబులోంచీ కాగితాల బొత్తిని తీసి, నిర్లక్ష్యంగా గణపతివైపు విసిరాడు.

తనచుట్టూ చెల్లాచెదరుగా పడిన కలర్‌ఫోటోల్ని గణపతి కంగారుగా చూశాడు. నెగటివ్స్‌నీ ఫోటోల్నీ—అన్నింటినీ తను నాశనం చేశాడనుకున్నాడు! వణుకుతున్న అతని చేతిలోంచీ లెదర్‌బాగ్ కిందపడి చిన్నగా చప్పుడు చేసింది. అతను ఆందోళనతో నిటలాక్షరావు వైపు చూశాడు. నిటలాక్షరావు ఎడమచెయ్యి కుర్చీకిందికి దూరింది.

"గణపతీ కళ్లతో చూసే ఆధారాలూ, ఫోటోలూ కాకుండా, చెవులతో వినే ఆధారాల్ని నువ్వు నాకు సప్లయి చేశావు. విను!" అన్నాడతను కులాసాగా నవ్వుతూ.

గణపతి అయోమయంగా చూశాడు. టీపాయ్ కింది నుంచీ ఏవో కంఠాలు వినిపించసాగేయి. నక్షత్రకమూర్తి కంఠం రెండురకాలుగా మాట్లాడుతోంది. గణపతి అదిరిపడ్డాడు. తన కంఠం స్వచ్ఛంగా, స్పష్టంగా అతనికి వినిపిస్తోంది. తను బ్యాంకు దోపిడీ ప్లాన్‌ని, వివరిస్తున్నాడు! అతని శరీరమంతా వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. చెమట అతని శరీరాన్ని స్నానం చేయిస్తోంది.

'....నువ్వు సై అంటే నేను పనిచేస్తున్న బ్యాంకులో దోపిడి యేర్పాటు చేస్తాను....' తన కంఠం.

"వాట్!" నిటలాక్షరావు—నక్షత్రకమూర్తి—సుబోధ్ కుమార్ కంఠం.

'నేను చెప్పిన రోజు, చెప్పినటైమ్‌కి, చెప్పినవిధంగా దోపిడీ జరగాలి. నాప్లాన్ నీకు వివరిస్తాను....' తన కంఠం.

"స్టాపిట్!" గణపతి బొంగురు కంఠంతో కంగారుగా అరిచాడు. నిటలాక్షరావు మళ్ళీ గమ్మత్తుగా నవ్వాడు. అతని ఎడమచెయ్యి మన్నుతిన్న పాములా మెల్లగా కది లింది. గదిలో నిశ్శబ్దం ఆవరించింది.

గడగడ వణుకుతూ గణపతి అతన్ని చూశాడు. "ఇది ....ఇది....అన్యాయం...." ఏడుపుగొంతుతో అరిచా డతను.

నిటలాక్షరావు ఆక్షేపణగా నవ్వాడు. "అన్యాయాన్ని అన్యాయం అనే హక్కు నీకులేదు! ఇంతకాలం శోభని చంపినందుకు పరిహారం చెల్లిస్తూ వచ్చావు. ఈ క్షణం నుంచీ నాశిష్యుణ్ని చంపినందుకు పరిహారం చెల్లిస్తూ వుంటావు!"

"నో!" గణపతి ఆదుర్దాగా అరిచాడు. అతని కడు పులో ఏదో రాక్షసహస్తం కెలుకుతున్నట్టుంది. "ప్లీస్.... వద్దు....విధించిన శిక్షచాలు!"

నిటలాక్షరావు వికటంగా నవ్వాడు. "గణపతీ, నిన్ను నమ్మి నీదగ్గిరకు వెళ్ళొద్దన్నాను. శోభ వెళ్ళింది. మట్టిలో కలిసింది. నిన్ను పూర్తిగా గుడ్డిగా నమ్మొద్దని నా శిష్యు డికి చెప్పాను. నిన్ను గుడ్డిగా నమ్మి అతను అంతరిం చాడు! నీకు ఎంతకాలం శిక్ష అనుభవించాలో నేను నిర్ణ యించాను...."

"నో! బ్యాంకులో దోచుకున్నదంతా నీకే దక్కింది. ఇంక నన్ను వదిలెయ్. ఈ యాభై వేలు తీసేసుకో. ఆ నెగటివ్‌లూ, ఫోటో ఇచ్చెయ్!"

"నెగటివ్స్! గణపతీ. నీకే తెలివితేటలున్నాయను కున్నావ్. నువ్వు నా శిష్యుడి ఫోటో తీసుకుంది నాకు

తెలుసు. అతని ఇంటికి వెళ్ళింది నాకు తెలుసు. బ్యాంకు లన్నీ తిరిగిందీ తెలుసు. నిన్ను తప్పు దారి పట్టించడానికీ, నువ్వనుకున్నదంతా నిజమే అని నిన్ను నమ్మించడానికీ, నేను తగిన యేర్పాట్లు చేశాను.

"నీ తృప్తికోసం, నాశిష్యుడి ఇంట్లో ఒక డార్క్ రూమ్ లాంటిది యేర్పాటు చేశాను. నీ నెగిటివ్ కాపీలూ, ఫోటోలూ మరికొన్ని బూతుబొమ్మలూ అక్కడ స్టాక్ చేయించాను! నువ్వు కదిల్తే నేను చూడగలను. నాది ఫాలనేత్రం అని నీకు తెలీదు!

గోవిందరావుని చంపిపారేయమని అన్నప్పుడే నువ్వు మనిషిగా మారలేదని నేను నిశ్చయించుకున్నాను! సో, నీకుతగిన శిక్ష, తగిన కాలపరిమితితో నిటలాక్షరావు అమలుజరుపుతాడు! నువ్వు తోక ఆడిస్తే ఫాలనేత్రం నిప్పులు కక్కుతుంది! వెళ్ళు. తోకని కాళ్ళమధ్య ఇరికించుకుని, బుద్ధిగా వుండు! గెటౌట్!" నిటలాక్షరావు గర్జించాడు.

గణపతి రెండడుగులు ముందుకేశాడు. నీళ్ళతో నిండి మండుతున్న కళ్ళతో దీనంగా చూశాడు. "బ్యాంకులోని మొత్తమంతా ఊడ్చి నీకు వచ్చేలా చూశాను. ఇంక నన్ను ఏడిపించకు!"

నిటలాక్షరావు కిలకిల మంటూ నవ్వాడు. "నువ్వు చేసిన ఆర్థిక దుర్వినియోగం పూడిపోడానికీ, నీకు సహకరించిన గోవిందరావుని చంపడానికీ, తప్పుడు లోన్లని తెలియజేసే రికార్డ్సుని కాల్చి బూడిద చేయడానికీ ఆ పైకం ఫీజుకింద జమ చేయబడింది. అంటే నీ ఖాతా ఇంకా క్లోజ్ కాలేదు. నా శిష్యుడి కోసం నువ్వు ఇన్‌స్టాల్‌మెంట్స్ కడ్తూ వుండాల్సిందే! ఇంక వెళ్ళిపో!"

గణపతి నోరు వెళ్ళబెట్టి చూశాడు. అతనిలోని ఆందోళనా, విచారం, ఆగ్రహంగా రూపాంతరం చెందుతున్నాయి. అప్రయత్నంగా పిడికిళ్ళు బిగించాడు. నిప్పులు కక్కుతూ నిటలాక్షరావుని చూశాడు.

"ఛండాలుడా, నువ్వు విధించే శిక్షని నేను అనుభవించను! నేను సర్వనాశనం అయ్యేలోగా నీ అంతు చూస్తాను!"

నిటలాక్షరావు బిగ్గరగా నవ్వాడు. "వంటింటి కుందేలు ప్రగల్భాలు పలుకుతోంది!" అన్నాడతను ఎగతాళిగా.

గణపతి మూసిన గదిలో ఇరుక్కున్న పిల్లిలా అటూ ఇటూ చూశాడు. తటాలున కిందికి వంగి, కాళ్ళదగ్గిర పడున్న లెదర్ బాగ్‌ని అందుకున్నాడు. శక్తికొద్దీ దాన్ని నిటలాక్షరావుమీదికి విసిరాడు. నిటలాక్షరావు తల గ్లోబులా పక్కకి కదిలింది. తలపైగా దూసుకెళ్తున్న లెదర్ బాగ్ అతని చేతిలో ఇరుక్కుంది. బాగ్‌ని బొజ్జమీద వుంచుకుని నవ్వుతూ గణపతిని చూశాడతను.

"యాభై వేలు సరిగ్గా వుందా?" అన్నాడతను ఎగతాళిగా.

గణపతి పళ్ళు కొరుకుతూ చూశాడు. ఆవేశంతో ఒకడుగు ముందుకి వేశాడు. తివాచీకీ, అరికాలుకీ మధ్య ఏదో నున్నగా తగిలింది. పాదాన్ని పక్కకి జరిపి, రెప్ప వాల్చి చూశాడతను.

తన చేతుల్లోని ఎర్ర నెక్‌టై శోభ గొంతుకచుట్టూ బిగుసుకుంటోంది. ఏదో విచిత్రమైన ఆవేశం తన మొహంలో ప్రత్యక్షమవుతోంది. శోభ నాలుక ఎర్రటి పెదాల్ని చీల్చుకుంటూ ఎర్రగా బైటికి పొడుచుకు వచ్చింది....

ఎవరో మొహమ్మీద ఐస్‌వాటర్ చల్లినట్టనిపించిం దతనికి. తను కిందపడేసిన పేకముక్కని కట్ చేయ డానికి నిర్లక్ష్యంగా నిటలాక్షరావు విసిరిన తురుపు ముక్కలా ఆ ఫోటో అవుపిస్తోందతనికి. అతను నిస్సహా యంగా నిటలాక్షరావుని చూశాడు. తను నిరాయుధుడు! దృఢమైన కవచం శక్తివంతమైన ఆయుధాలూ ధరించిన నిటలాక్షరావుని తను ఇప్పట్లో ఏమీచేయలేడు!

గణపతి బలహీనంగా వెనక్కితిరిగి, ఎడారి ఇసుకలో నడుస్తున్న గాయపడిన వ్యక్తిలా అడుగులు వేయసాగేడు. నిటలాక్షరావు నవ్వు అతన్ని ముందుకి తరుముతోంది. వణికిపోతున్న శరీరాన్ని అదుపులో పెట్టుకోడానికి ప్రయ త్నిస్తూ అతను తలుపుని సమీపించాడు.

తలుపుని తెరవడానికి అతని చెయ్యి ముందుకి సాగింది. మంత్రశక్తితో ఎదో గుహతలుపు తెరుచుకుం టున్నట్టు తలుపు అతనివైపు వేగంగా జరిగింది. గణపతి, కంగారుగా వెనక్కి కదిలాడు....

*   *   *

సింహం గుహలోంచీ క్షేమంగా తప్పించుకుని ఇవత లికి వస్తూ, ద్వారంలో పెద్దపులుల్ని చూసిన కుందేలులా, అయిపోయాడు గణపతి.

తలుపుని బలంగా తోసుకుంటూ నలుగురు పోలీస్ ఇన్స్‌పెక్టర్లు ఒకేసారి లోపలికి జొరబడ్డారు. అందరి చేతుల్లోనూ రివాల్వర్లు మెరుస్తున్నాయి. వాళ్ళ వెనగ్గా పొడుగాటి, పోలీస్ కమీషనర్ లోపలికి దూరాడు.

"ఎవ్వరూ కదలకండి!" ఒక ఇన్‌స్పెక్టర్ హుంకరిం చాడు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు గదిలోపలికి వేగంగా పరు గెట్టారు. ఉన్నట్టుండి ఎదో రివాల్వర్ పేలింది. "ఢాం"

అన్న శబ్దం గదిలో ప్రతిధ్వనించింది. గణపతి ఆందోళనతో తిరిగిచూశాడు. కుర్చీముందు నిటలాక్షరావు గున్న ఏనుగులా నిలబడ్డాడు. అతని కుడిచెయ్యి రక్తసిక్తంగా వుంది. కొంచెందూరంలో, అతని రివాల్వర్ కిందపడివుంది. ఇద్దరు ఇన్స్పెక్టర్లూ అతనికి చెరోపక్కా నిలబడ్డారు.

"ఇన్స్పెక్టర్, గణపతిని అరెస్టుచెయ్!"

గణపతి ఉలిక్కిపడి తిరిగిచూశాడు. ఇద్దరు ఇన్స్పెక్టర్లు అతని దగ్గిరగా నిలబడ్డారు. ముందుగదిలో తనని సోదాచేసిన వ్యక్తి చేతులకు బేడీల్తో నిలబడ్డాడు. ఇదరు పోలీసులు అతన్ని పట్టుకున్నారు. గణపతి చేతులకి బేడీలు క్లిక్‌మన్నాయి. అతను తన చేతుల్ని చూసుకోలేదు. అతని చూపులు, కమీషనర్ పక్కనే నిలబడ్డ వ్యక్తిమీదే తాపడం అయిపోయివున్నాయి. ఆ వ్యక్తి, మోహన్ అతన్ని చిరునవ్వుతో చూస్తున్నాడు.

"గణపతీ, నువ్వు చంపించిన గోవిందరావు కొడుకు మోహన్‌ద్వారా నీ ఆటకట్టయింది!" అతని ఆలోచనల్ని పసిగట్టినట్టు, పోలీస్ కమీషనర్ అన్నాడు. గణపతి వెర్రిగా చూశాడు. ఏవో, ఎన్నోమాటలు అతని కంఠంలోంచీ బైటపడ్డానికి తన్నుకుంటున్నాయి. కానీ తాత్కాలికంగా అతను మూగవాడైపోయాడు.

పోలీస్ కమీషనర్ ముందుకు నడిచాడు. మోహన్, మరో ఇన్స్పెక్టర్ అతన్ని వెంబడించారు.

"కమీషనర్, ఏమిటది?" నిటలాక్షరావు గర్జించాడు.

"అరెస్ట్‌హిమ్!" కమీషనర్ అతని ప్రశ్నని నిర్లక్ష్యం చేస్తూ ఆజ్ఞాపించాడు. ఇన్స్పెక్టర్ రాజారామ్ జేబులోంచీ బేడీలు తీస్తూ ముందుకి కదిలాడు.

"కమీషనర్, తరువాత విచారిస్తారు. నే నెవరో

తెలుసుగా!" నిటలాక్షరావు హుంకరించాడు.

కమీషనర్ అతన్ని ఎగతాళిగా చూశాడు. "నిటలాక్ష రావ్! నుదురుమీద మూడో కన్ను వుందనుకుంటున్న గుడ్డివాడివి నువ్వు! తెలీకేం!"

నిటలాక్షరావు పళ్ళు కొరికాడు. "నేరం చేయలేని నన్ను నువ్వు బంధించలేవు!"

కమీషనర్ తివాచీమీద చెల్లాచెదురుగా పడున్న ఫోటోల్ని చూపించాడు. "ఈ ఫోటోలద్వారా నువ్వు గణపతిని బ్లాక్ మెయిల్ చేస్తున్నావు. బ్యాంక్‌దోపిడీ ప్లాన్ వున్న కాసెట్‌ద్వారా అతన్ని బ్లాక్ మెయిల్ చేయబోతున్నావు. మొదటి కోటా యాభై వేలు నల్ల లెదర్‌బాగ్‌లో అతను నీకు అర్పించుకున్నాడు! నీ ఆదేశానుసారం నీ శిష్యుడు నక్షత్రకమూర్తి ఉరఫ్ సుబోధ్‌కుమార్ గోవిందరావుని ఖూనీచేశాడు. నీ కోటంతా నా చేతుల్లో వుంది. నీ శిష్యులు అప్పుడే అప్రూవర్స్‌గా మూకుమ్మడిగా అప్రూవర్స్‌గా మారడానికి తయారుగా వున్నారు."

"నో!" నిటలాక్షరావు రంకె వేశాడు.

"యస్! వేరే ఎవిడెన్స్‌లు అవసరం లేకుండా నువ్వే నీ కథంతా ఇందాకా చెప్పావు. మేమంతా దాన్ని విన్నాం. పవర్‌ఫుల్ టేప్‌రికార్డర్ నీ ప్రతి మాటనీ రికార్డు చేసింది! కాసేపట్లో గణపతిని బ్లాక్ మెయిల్ చెయ్యడానికి గాలంలా నువ్వు వాడిన ఫోటోలూ, నెగటివ్‌లూ, కాసెట్, వాటితోబాటు బాంకులోంచి దోచబడిన పైకం అన్నీ మా చేతుల్లోకి వస్తాయి!" కమీషనర్ నవ్వుతూ అన్నాడు.

"నో!" నిటలాక్షరావు కీచుగా అరిచాడు.

"వాటన్నింటినీ ఎక్కడ దాచావో సకాలంలో నువ్వే దండకంలా అప్పజెప్తావ్! రాజారామ్, వాళ్ళని తీసుకెళ్ళు.

ఈ గదినీ, పక్క గదినీ నిటలాక్షరావు కట్టుకున్న మూడు ఇళ్ళనీ శుభ్రంగా దువ్వించు. దొరికిందంతా మనకి కావాలి!" కమీషనర్ గంభీరంగా అన్నాడు.

31

"మోహన్, కంగ్రాట్స్ అండ్ థాంక్స్. నువ్వు లేక పోతే ఈ కేసు చక్కగా భూస్థాపితం అయిపోయి వుండేది. రాత్రి గణపతి ఏడుస్తూ మొత్తం కక్కేశాడు. అయామ్ సారీ, మీ నాన్న దోపిడీలో సంపూర్ణంగా సహకరించాడు. గణపతి వాఙ్మూలం ప్రకారం దోపిడీ ఐడియా మీ నాన్నదే. మొదట్నించీ నీ ఆలోచనలు సక్రమమైన మార్గంలో సాగాయి. ఉత్తరోత్రా ప్రమాదం రాకుండా వుండటానికి మీ నాన్న నోరు నొక్కివేయబడింది.

"రాత్రే నేను బ్యాంక్ ఛైర్మన్‌తో చర్చించాను. నీకూ వింధ్యకూ త్వరలో నగదు బహుమతి ఇవ్వబడుతుంది. మా పోలీసుశాఖ తరఫున నీకు ధన్యవాదాలు చెప్పు కుంటున్నా. మా డిపార్ట్‌మెంట్ కూడా నిన్ను తగు విధంగా సత్కరించడానికి నిశ్చయించుకుంది...."

"నా డ్యూటీ నేను చేశాను. డ్యూటీ చేసిన వ్యక్తికి దండలు వేయనక్కర్లేదు సార్!" మోహన్ నవ్వుతూ అన్నాడు.

కమీషనర్ చిరునవ్వు నవ్వాడు. "బాగా చెప్పావ్! నీలాంటి కొడుకుని పొందిన మీ నాన్న అదృష్టవంతుడు. కానీ, కొడుకు గొప్పతనాన్ని చూడలేని దురదృష్టం కూడా ఆయనదే."

మోహన్ బరువుగా నిట్టూర్చాడు. "కమీషనర్‌గారూ, నా ఆలోచనల్ని విశ్వసించి, నా పరిశోధనకి విలువ ఇచ్చి దోషుల్ని పట్టుకున్నందుకు మీకు ధన్యవాదాలు చెప్పుకో

వాలి. వెళ్ళొస్తాను."

కమీషనర్ లేచి నిలబడి మోహన్ చేతిని ఆప్యాయంగా పట్టుకున్నాడు. నవ్వుతూ అతని మొహం కి చూశాడు.

"మోహన్ ప్రభుత్వం - బ్యాంకు దోపిడీలని అరికట్ట డానికీ, ఉద్యోగులలో స్ఫూర్తిని పెంపొందించడానికీ అమలు జరపాలనుకున్న పథకాన్ని స్వార్థసంకుచిత శక్తులు ఎలా దుర్వినియోగం చేస్తాయో నువ్వు నిరూపిం చావు! జీవితంలో నువ్వు ఎన్నో విజయాలు సాధిస్తావు. వెళ్ళి రా. గుడ్ లక్."

*　　　*　　　*

దగ్గరగా మూసి వున్న తలుపుని తోస్తూ మోహన్ లోపలికి నడిచాడు.

హాల్లో సోఫామీద ఆమె కూచుంది. ఆమె పక్కనే అరవయి యేళ్ళ వ్యక్తి కూచున్నాడు. సోఫా ముందు నేల మీద నాలుగయిదు దినపత్రికలు చెల్లాచెదురుగా పడు న్నాయి. ఆ పత్రికల్లో తన ఫోటో. వింధ్య ఫోటో, నిట లాక్షరావు ఫోటో, గణపతి ఫోటో వున్నాయని అతనికి తెలుసు.

మోహన్ వాళ్ళ ముందు కొంచెం దూరంలో ఆగాడు.

నేలమీదే వున్న అనూరాధ చూపులు మెల్లిగా పైకి లేచాయి; మోహన్ మొహమ్మీద నిలిచాయి. ఆమె కళ్ళు గాజు కళ్ళలా వున్నాయి. వాటిలో ఏదో చైతన్యం లోపించింది. చెదిరిపోయిన ముంగురులు నుదురుకి అతు క్కున్నాయి. దైన్యం, ఓటమి ఆమె మొహంలో విశ్వ రూప దర్శనం ఇస్తున్నాయి.

"అనూరాధగారూ....నన్ను క్షమించాలి...." మోహన్ మెల్లిగా అన్నాడు.

అనూరాధ రెప్పవేయకుండా అతన్నే చూస్తోంది. ఆమె కళ్ళల్లో తనపట్ల ఏహ్యాభావం, ఆగ్రహం లేవు. తన అంచనాతప్పిందని మోహన్ చిటికెలో గ్రహించాడు.

"బాబూ... నువ్వు మోహన్‌వి కదూ?" అనూరాధ పక్కన కూచున్న వృద్ధుడు రామ్మోహనరావు సన్నటి కంఠంతో ప్రశ్నించాడు.

మోహన్ అవునన్నట్టు తలాడించాడు. ఆయన కళ్ళ ల్లోని విచారం మాయమైంది. ఏదో మెరుపు ఆ కళ్ళల్లో వెలిగింది. "మోహన్, కంగ్రాచ్యులేషన్స్. శక్తికిమించిన కార్యాన్ని, ఘనమైన కార్యాన్ని సాధించావు."

మోహన్ ఆశ్చర్యంతో చూశాడు. "నేను చేసిన కార్యం అనూరాధగారికి నష్టాన్నీ, కష్టాన్నీ కలిగించింది. అందుకే ప్రత్యేకంగా క్షమాపణలు...."

"మోహన్, నాకు క్షమాపణ చెప్పుకోవాల్సిన అపరాధం నువ్వు చేయలేదు!" అనూరాధ మొదటిసారి మాట్లాడింది. ఆమె కంఠంలో వణుకు లేదు. "సభ్య మానవవేషాల్లో వున్న హంతకుల్నీ, దొంగల్నీ నువ్వు అందరికీ చూపించావు. నిన్ను మెచ్చుకుంటున్నా మోహన్...."

"అనూరాధగారూ....!" మోహన్ ఆశ్చర్యంతో, ఆనందంతో అరిచాడు.

"అవును మోహన్, ఒక హంతకుడికి అవినీతి పరుడికి భార్యగా వుండాలన్న తాపత్రయం నా కూతురికిలేదు" రామ్మోహనరావు సగర్వంగా అన్నాడు.

మోహన్ వాళ్ళిద్దర్నీ గౌరవ భావంతో చూశాడు. "అనూరాధగారూ....ఏదేనా సహాయం కావాలంటే.... సంకోచించకుండా అడగండి...."

అనూరాధ మొహమ్మీద చిరునవ్వు ప్రత్యక్షమైంది.

"మోహన్, ఇప్పటికే ఎంతో సహాయం చేశావు. నేను అమాయకంగా, దైవంగా ఆరాధించిన వ్యక్తి నిజ స్వరూపాన్ని చూపించావు. థాంక్స్ మోహన్...."

మోహన్ కదిలిపోతూ చేతులు జోడించి, వెనక్కి తిరిగాడు.

*　　　*　　　*

సోఫాలో కూచుని, పేపర్ చదువుతూన్న సావిత్రమ్మ తలెత్తి గుమ్మం వేపు చూసింది. ఆమె మొహం చిరునవ్వుతో విచ్చుకుంది,

మోహన్ ఆమె దగ్గిరగా నడిచాడు. అతని చెయ్యి అతని పక్కనే నడుస్తున్న వింధ్య చేతిని పట్టుకుంది. నీలం రంగు దుస్తుల్లో వున్న వింధ్యని సావిత్రమ్మ ప్రశ్నార్థకంగా చూస్తోంది.

"అమ్మా. బ్యాంకు దోపిడీ నాన్నను మనకి దూరం చేసినట్టే. వింధ్యకు తల్లిని దూరం చేసి, ఆమెను ఏకాకిగా చేసింది...."

సావిత్రమ్మ కళ్ళద్దాలు తీసి సోఫామీద పెట్టి వింధ్యను సానుభూతితో చూసింది.

"తను ఏకాకి కాదనీ, తోడుగా మనిద్దరం వున్నామనీ, నీలో తన అమ్మనూ, అత్తయ్యనూ ఇద్దర్నీ చూసుకోవచ్చనీ వింధ్యకి చెప్పి తీసుకొచ్చానమ్మా!" మోహన్ నవ్వుతూ అన్నాడు.

నల్లత్రాచులాంటి వాలుజడ. కోలమొహం. పెద్దపెద్ద కాటుకకళ్ళు. సిగ్గుతో ఎర్రబడిన బుగ్గలు. తడిగా మెరుస్తున్న పెదవులు. ఆరితేరిన శిల్పి చెక్కిన అద్భుత శిల్పంలా వున్న వింధ్యను తదేకంగాచూస్తున్న సావిత్రమ్మ తన చూపుల్ని తృప్తికరంగా కొడుకువైపు తిప్పింది.

"మంచిపని చేశావు నాన్నా" అందామె. "వింధ్యా, నాదగ్గరగా కూచో!" అంది వింధ్యవైపు చూస్తూ.

వింధ్య ఆమె దగ్గిరగా కూచుంది. సావిత్రమ్మ తల వాల్చి, కొడుకువైపు నవ్వుతూ చూసింది.

"నాన్నా, నాన్నగారికి మూడోకన్ను వుండేదని ఆ రోజు నీతో అన్నాను. నా అభిప్రాయం ఎంత పొరపాటో అర్థమైంది. నిజమైన ఫాలనేత్రం వుండేది నీకే! ఎవ్వరూ చూడలేకపోయిన సత్యాన్ని నువ్వు చూశావ్!" అందామె నవ్వుతూ.

మోహన్ నవ్వాడు. వింధ్య అతనితో శృతి కలిపింది.

"కాఫీ తెస్తాను" అంటూ సావిత్రమ్మ లేచి వంట గదిలోకి వెళ్ళిపోయింది. మోహన్ వింధ్యకి మరికొంచెం దగ్గిరగా జరిగాడు.

—: ఐపోయింది :—

కేడీగాడొచ్చాడు!



ఎలక్ట్రిక్ దున్న

కె.వి.యస్.యన్.మూర్తి

క్షేత్రయ్య కళాక్షేత్రం ముందు 'హౌస్‌ఫుల్' బోర్డు వ్రేలాడుతోంది.

అక్కడకొచ్చిన జనం చాలామంది టిక్కెట్లు దొరక్కపోవటంతో నిరుత్సాహంగా వెనక్కు తిరిగి వెళ్ళిపోతున్నారు. పది రూపాయల ఖరీదు చేసే టిక్కెట్టు పాతిక వరకు పలుకుతోంది బ్లాకులో.

లోపల సతీసావిత్రి నాటకం జరుగుతోంది.

యమధర్మరాజుగా, ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా అంతర్జాతీయంగా పేరుగాంచిన ఆదినారాయణ వేషం

వేస్తోన్నాడు. అనేక సన్మానాలను, సత్కారాలను అందు కొన్న అతడు ఆ పట్టణానికి రావటం అదే ప్రథమం కావటంవలన నాటక ప్రియులంతా ఎగబడి టిక్కెట్లు కొన్నారు. దానికితోడు అభినవ ఊర్వశిగా పేరుగాంచిన అరుంధతి, సావిత్రి పాత్రను పోషిస్తోంది. అందుకే జనం అంతగా ఎగబడుతోన్నారు.

ఆదినారాయణ చాన్నాళ్ళగా నాటకాలు వేసి పేరు గడించినా, అంత పేరు రావటం ఈ మధ్యకాలంలోనే జరిగింది—

దానికి కారణం సాక్షాత్తు అతడి తమ్ముడు నిరంజన రావే.

నిరంజరావుకూడా మంచి కళాకారుడే. కాని అన్నగారి కున్న రూపం, గళం, మాడ్యులేషన్ ప్రత్యేకించి నటనా లేవు. అతని భార్యే అరుంధతి. విడివిడిగా నాటకాలువేస్తే పైకి రావటం కష్టం అని తెలుసుకొన్న నిరంజనరావు, అన్నని కలిసాడు. ఆదినారాయణ కూడా 'సరే' అన్నాడు.

నిరంజనరావు నటుడిగా కాకపోయినా దర్శకుడిగా బాగా రాణించాడు. పైగా అతడు స్టేజిమీద రకరకాల ఎఫెక్ట్సను తీసుకు వచ్చి ఆడియన్స్‌ను బాగా ఆకట్టుకొన్నాడు.

దానికి సాయం అరుంధతి ఆ పాత్రకు అతికినట్లు సరిపోయింది.

దాంతో వాళ్ళ దశ ఒక్కసారిగా మారిపోయింది.

అప్పటివరకు పూటకూడా గడపటం కష్టమయిన నిరంజనరావు తెనాలిలో ఒకటి రాజమండ్రీలో మరోటి డాబాయిళ్ళను కొన్నాడు. అందుకే అతనికి అన్నగారంటే తగని అభిమానం.

ఆదినారాయణకు యిదివరకు పేరయితే వుందిగాని,

తమ్ముడితో కలసి ట్రూప్ పెట్టినాక అతని కీర్తి ఆకాశ శిఖరాలకు ఎదిగిపోయింది. అందుకే అతడికి నిరంజనరావంటే మరీ అభిమానం.

అన్నదమ్ముల అభిమానాన్ని చూసి మరీ మరీ మురిసిపోతో వుంటుంది అరుంధతి.

ఆదినారాయణ నటనకు మెచ్చి, పేరూరు జమీందారో, పెద్దాపురం జమీందారో ఒక బ్రహ్మాండ మయిన ఎలక్ట్రిక్ దున్నపోతును తయారు చేయించి యిచ్చాడు. చూపర్లందరికీ అది మామూలు దున్నపోతును మించి భయంకరంగా వుంటుంది. స్వయంగా యమధర్మరాజే దిగివచ్చినా, తన వేషంలోవున్న ఆదినారాయణని. అతడెక్కిన ప్రాణంలేక పోయినా అసలు దున్నకంటె భీకరాకారం కలిగిన వాహనాన్నీ చూసి జడుసుకు తీరాల్సిందే.

నాటకానికంతటికీ ఎలక్ట్రిక్ దున్న స్పెషల్ ఎట్రాక్షన్.

దానికి సాయం, నిరంజనరావు బ్రహ్మాండమయిన ఎలక్ట్రిక్ సెట్టింగులు ఏర్పాటు చెయ్యటంతో, అసలు సినీమా కూడా ఎందుకూ పనికి రాదు.

"కాకులు దూరని కారడవులలో...."

"స్వామీ... "

"....అదియును నీ పతి ప్రాణంబు దక్క...."

నాటకం మంచి రసవత్తరంగా సాగిపోతోంది.

ఈలలు, ఒన్స్‌మోర్‌లతో హాలంతా దద్దరిల్లిపోతోంది.

వెనుక నున్న సెట్టింగుల కదలిక వలన యమమహిషి మందంగా ముందుకు అడుగులు వేస్తోన్నట్లు కనపడుతోంది. ఎలక్ట్రిక్ పవర్ వలన అది హుందాగా తల ఆడిస్తోంది.

"సావిత్రీ...."

"స్వామీ...."

యమధర్మరాజు ఏదో చెప్పబోయాడు....అంతే! ఎవరో ఈడ్చిపెట్టి నడ్డిమీధ తన్నినట్లు, వాహనంమీద నుండి క్రిందపడ్డాడు. యమమహిషి వెన్నుమీద చిన్న మెరుపు మెరిసింది. క్రిందపడ్డ ఆదినారాయణ కట్టెలా బిగుసుకుపోయాడు.

జరిగింది తెలియని ప్రేక్షకుల మధ్య కలకలం బయలుదేరింది.

తెర వాలిపోయింది.

"అంతరాయానికి క్షమించమని....గొడవ చెయ్యకుండా కూర్చోమని" అనౌన్స్ చేశారు.

నిరంజనరావు అన్నగారి దగ్గరకు పరుగెట్టుకు వచ్చాడు.

ముక్కు దగ్గిర వ్రేలుంచాడు. గుడ్లు తేలేశాడు.

"ఏం జరిదింది?" అరుంధతి ఆత్రుతగా అడిగింది.

"అన్నయ్య చచ్చిపోయాడు" నిరంజనరావు గొంతు పట్టేసింది.

అరుంధతి గొల్లుమంది. ఒక కళాకారిణిగా అతడితో అనేక ప్రదర్శన లిచ్చింది. తనతోటి కళాకారుడు పోయేడన్న బాధ ఆమెను కదిలించి వేసింది. పైగా అతడు తన బావగారు.

మరు నిముషం "యమధర్మరాజు చచ్చిపోయాడు" అని అనౌన్సు చేశారు.

ఆదినారాయణరావు శవాన్ని స్టేజిమీదే వుంచారు.

అప్పటిదాకా ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఒక మహానటుడు విగతజీవుడయ్యాడన్న విషయం

ఎవరికీ జీర్ణం కావటం లేదు. అంతా విచిత్రంగా వుంది.

పోలీసులకు కబురెళ్ళింది.

ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు రంగంలో దిగాడు.

ప్రయిమరీ ఇన్వెస్టిగేషన్ ఆరంభమయింది.

సహజ మరణం కాకపోవటంతో శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని అటోప్సీకి పంపారు.

సత్తిరాజు, ఎలక్ట్రిక్ దున్నను స్వాధీనం చేసుకొన్నాడు.

2

మండపేట—

సాయింత్రం నాలుగు గంటలు దాటింది.

చెరువు గట్టుకు అవతల వున్న నాలుగో పెంకుటింటి ముందు ఆగాడు ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు. నెమ్మదిగా తలుపు గొళ్ళాన్ని చప్పుడు చేశాడు.

తలుపు తీసింది ఒక వృద్ధురాలు.

"ఎవరు కావాలి బాబూ?" అంది.

"బాబాజీ వున్నాడా?" అడిగాడు సత్తిరాజు.

"కూర్చో బాబూ!" అంటూ ఆమె లోపలకు వెళ్ళింది.

సత్తిరాజు అరుగుమీద వున్న చాపమీద కూర్చొన్నాడు.

మారో అయిదు నిముషాల్లో సన్నగా రివటలా వున్న మధ్య వయస్కుడు బయటకు వచ్చాడు. ఇన్‌స్పెక్టర్‌ను చూసి ఆశ్చర్యపోయాడు.

"మీపేరేనా బాబాజీ?"

"అవును."

"మీరేం చేస్తూ వుంటారు?"

"పందిళ్ళలో ఎలక్ట్రిక్ పనులు చేస్తూ వుంటాను!"

"ఆదినారాయణ కోసం ఎలక్ట్రిక్ దున్నను తయారు చేసింది మీరేనా?"

బాబాజీరావు సత్తిరాజును విచిత్రంగా చూశాడు "నే... నే...." అన్నాడు.

సత్తిరాజు అతనిలో వస్తోన్న మార్పును గమనించి "ఏం అలా ఆశ్చర్యంగా చూశారు?" అన్నాడు.

"అబ్బే ఆరు సంవత్సరాం క్రితం తయారు చేసిన వస్తువుమీద జనాలకు యింత ఆసక్తి పెరిగిందేమిటాఅని."

"అంటే?"

"సరిగ్గా పది రోజులక్రితం దాని గురించి అడిగారు."

"ఎవరు?" సత్తిరాజులో ఆసక్తి పెరిగిపోయింది.

"ఇంతకీ మీరు ఇవన్నీ ఎందుకడుగుతున్నారు?" అడిగాడు బాబాజీ అనుమానంగా.

"నేను విశాఖపట్టణం నుండి వస్తోన్నాను. మీ దున్న మీద కూర్చొని నటిస్తూవుంటే ఆదినారాయణ షాక్ తగిలి మరణించాడు" తాపీగా చెప్పాడు సత్తిరాజు.

"ఇంపాసిబుల్!" ఆశ్చర్యపోయాడు బాబాజీ.

"ఏం?"

"దాని చర్మం పూర్తి షాక్‌ప్రూఫ్, ఒక్క మూపురం దగ్గర మాత్రమే ఓపెన్ అయి వుంటుంది. అక్కడ స్విచ్‌ని ఆపరేట్ చెయ్యాలి. అందుకని."

"ఆ స్విచ్ దగ్గర...."

"లేదు....అక్కడ సన్నటి తీగతో ఫ్యూజ్ అరేంజ్ చేశాను. ఏమాత్రం షార్ట్‌సర్క్యూట్ వున్నా ఫ్యూజు వెంటనే కొట్టేస్తుంది. మనిషికి ఏ విధమయిన ప్రమాదమూ వుండదు."

"కానీ ఫ్యూజు దగ్గిర చాలా బలమయిన, లావుపాటి తీగ వుంది."

ఈసారి బాబాజీ నోరెళ్ళబెట్టాడు. "తీగను ఎవరో మార్చారు" అన్నాడు.

సత్తిరాజు మవునంగా తలూపి "అయితే ఎవరో యమ ధర్మరాజును కావాలనే చంపేశారన్న మాట" అన్నాడు.

బాబాజీ మాట్లాడ లేదు.

"పది రోజుల క్రితం మిమ్మల్ని ఎవరో కలిశారన్నారు కదా! ఎవరది?"

బాబాజీ ఒక్కసారి గొంతు సవరించుకున్నాడు "గండ భేరుండు!" అన్నాడు.

"అదేమిటి పేరు విచిత్రంగా వుంది" అడిగాడు సత్తిరాజు.

"అతడి అసలు పేరు తెలియదు. మేమందరం అతడిని అలానే పిలుస్తాం. అతడు నా స్నేహితుడు. ప్రస్తుతం సతీసావిత్రి నాటకంలో సత్యవంతుడి రోల్‌ను వేస్తో న్నాడు."

"మీ దగ్గిరకు వచ్చి ఏమడిగాడు?"

"ఆ దున్న బ్లూ ప్రింట్లు యిమ్మన్నాడు. కాపీచేసి యిచ్చాను."

"ఎందుకో చెప్పాడా?"

"ఎందుకో తెలియదు గాని ఎవరు తెమ్మన్నారో చెప్పాడు."

"ఎవరు?"

బాబాజీరావు చెప్పాడు. "అరుంధతి!" అని. కానీ ఆ తర్వాత చెప్పిన విషయాలు ఆసక్తికరమైనవి. అదంతా కాగితం మీద వ్రాసి సంతకం తీసుకున్నాడు సత్తిరాజు.

3

"నిన్నటిదాకా పిడుగులా వున్నారు. యిలా ఎందుకు జరిగిందో!" ట్రూపులో ఎవరి నోటంట విన్నా అదేమాట.

ఇన్స్పెక్టర్ సత్తిరాజు హుటాహుటిన అక్కడకు వచ్చాడు.

మంచం మీద గండభేరుండం నిర్జీవంగా పడుకుని వున్నాడు. అతడి మొహం నల్ల రంగుకు తిరిగి వుంది. అతడి గుప్పిట్లో ఒక కాగితం ముక్క బిగుసుకు వుంది.

"విషప్రయోగం!" అనుకొంటూ సత్తిరాజు అతడి గుప్పెట్లో వున్న కాగితాన్ని బయటకు తీశాడు.

"గురుద్రోహం చేసినందుకు నాకు నేనే శిక్ష వేసుకొన్నా. —గండభేరుండం."

సత్తిరాజు పిడికిళ్ళు బిగుసుకొన్నాయి. "ఆఖరిసారిగా యితన్ని ఎవరు చూశారు?" అడిగాడు.

అరుంధతి నెమ్మదిగా తల పైకెత్తింది. "ఉదయాన్నే కాఫీ తీసుకోమని పిలిచాను. పలుకలేదు. చూద్దును కదా యిలా అయింది" అంది.

సత్తిరాజు ఆమెను తీక్షణంగా చూశాడు.

ఆ చూపులను తట్టుకోలేనట్లు ఆమె తల క్రిందకు దింపింది.

"ఆత్మహత్య చేసుకొన్నట్లు వుత్తరం రాసి చనిపోయాడు. నిజంగా ఆత్మహత్యేనా?" అన్నాడు.

ఆమె మాట్లాడకుండా స్థిరంగా వుండిపోయింది.

తర్వాత నిరంజనరావు లోపలకు వచ్చాడు. మనిషి బాగా నీరసించి వున్నాడు. ఈ రెండురోజులలోనే బాగా తీసేశాడు. ఒకవయిపు అన్నగారి చావు అతడిని కృంగదీస్తోంటే మరోవయిపు గండభేరుండం ఆత్మహత్య.

"గండభేరుండం గురించి మీకు తెలిసిన విషయాలు చెప్పండి."

"మంచివాడు. కాని జరుగుతున్నవి చూస్తోంటే ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియటం లేదు" అతడి గొంతులో బాధ అణుచుకుందామన్నా ఆగకుండా బయటకు వచ్చేస్తోంది.

పది నిముషాలు అతనితో మాట్లాడి, "మీ అన్నగారికి సన్నిహితులెవరు?" అన్నాడు చివరగా.

"అందరం సన్నిహితులమే, కానీ హార్మోనిస్టు షణ్ముగం ఆయన దగ్గర చాలా కాలంగా పనిచేస్తోన్నాడు" అన్నాడు.

"మీరు అతన్ని పిలవండి" అన్నాడు సత్తిరాజు.

అయిదు నిముషాలలో సన్నగా రివటలా వున్న ఆకారం అతడిముందు ప్రత్యక్షమయింది. కారాకిళ్ళీ వలన గార పట్టిన పళ్ళను యికిలిస్తూ "వణక్కాం" అన్నాడు.

"నీకు ఆదినారాయణ ఎంతకాలంగా తెలుసు?" అడిగాడు సత్తిరాజు.

"పాతికేళ్ళుగా!"

"ఎలాంటివాడు?"

"అబ్బో! బంగారం!"

"అతడిని ఎవరయినా చంపేసి వుండొచ్చా?"

షణ్ముగం వుమ్మివెయ్యటాని కన్నట్లు గుమ్మం వరకు వెళ్ళివచ్చాడు. చుట్టూ ఒకసారి చూసి "ఆ అరుంధతయ్యుండొచ్చు" అన్నాడు.

"నీకెందుకొచ్చిందా అనుమానం?"

"ఆమె, బావను మోజుపడింది, ఆయన కోప్పడ్డాడు. అంతే, అరుంధతి పగబట్టి నాగినిలా మారిపోయింది."

సత్తిరాజు అతడిని జీపెక్కమన్నాడు.

"ఎందుకు సామీ?" బెంబేలు పడిపోయాడు షణ్ముగం.

"నడు! స్టేషను కెళ్లాక విషయం తెలుస్తుంది."

షణ్ముగం దాదాపు ఏడుపు లంకించుకొన్నాడు. "ఏందుకు సామీ, నిజం చెప్పడం పాపమా?" అన్నాడు.

సత్తిరాజతడిని వురిమి చూశాడు.

జీప్ ముందుకు వురికింది.

4

ఉదయం తొమ్మిది గంటలయింది.

అతడు ఆదినారాయణ సమాధి ముందు కూలబడి కుళ్ళి కుళ్ళి ఏడుస్తూన్నాడు.

తొమ్మిదింబావవుతోండగా స్మశానం ముందు ఆటో ఆగింది

ఆటోలోంచి అరుంధతి దిగింది.

గబగబా అక్కడకు వచ్చింది.

"ఏమిటండీ యిది మరీ చిన్నపిల్లాడిలా?" అంది అతడిని అక్కున జేర్చుకొని.

నిరంజనరావు భార్యను పట్టుకొని బోరుమన్నాడు. అదొక బహిరంగ ప్రదేశమనీ. తమను చుట్టుప్రక్కల వారు చూస్తూన్నారనీ ఆలోచించటం లేదతను. గుండెల్లోని లావాను బయటకు తెచ్చే ప్రయత్నం చేస్తూన్నాడు. లేకపోతే గుండె పగిలిపోయే ప్రమాదం వుంది.

పదినిముషాలు కష్టపడి అతడిని ఓదార్చగలిగింది అరుంధతి.

నెమ్మదిగా నడిపించుకొంటూ ఆటో దగ్గిరకు తీసుకు వచ్చింది.

పావుగంటలో ఆటో వారుంటున్న యింటిముందు

ఆగింది.

లోపలకు అడుగుపెట్టిన నిరంజనరావు అవాక్కయి పోయాడు.

ఎదురుగా సోఫాలో సత్తిరాజు కూర్చుని వున్నాడు. మరో సోఫాలో బాబాజీరావు, క్షేత్రయ్య కళాక్షేత్రం వైర్ మెన్ నరసయ్య కూర్చొని వున్నారు.

"రావయ్యా నిరంజనరావూ, నీగురించే చూస్తూన్నాం" అన్నాడు సత్తిరాజు వ్యంగ్యంగా.

"నాగురించా?" ఆశ్చర్యాన్ని నటించాడు నిరంజన రావు.

"ఇంక నటించకు. జరిగింది నేను చెప్తాను విను" అంటూ చెప్పటం ప్రారంభించాడు సత్తిరాజు.

"మీ అన్నకు పేరొస్తూంటే నువ్వు సహించలేక పోయావు. దానికి సాయం అరుంధతికి అతడితో అక్రమ సంబంధం ఉందని అనుమానపడ్డావు. ముందు మీ అన్న య్యను చంపాలనుకొన్నావు. చాలా తెలివిగా ప్లాన్ వేశావు. ఎలక్ట్రిక్ షాక్ వలన చనిపోతే గొడవలేదను కొన్నావు. ఒకవేళ అనుమానం వచ్చినా అది నీ భార్య మీదకు పోయేలా చెయ్యాలనుకొన్నావు.

గండభేరుండాన్ని బాబాజీరావు దగ్గరకు పంపి ఎలక్ట్రిక్ దున్న బ్లూప్రింటు గురించి తెలుసుకున్నావు. అరుంధతి పంపిందని చెప్పమని గండభేరుండంతో చెప్పావు. కానీ గండభేరుండం, బాబాజీ స్నేహితుడని నీకు తెలియదు. అతడికి నీమీద ఒకరకమయిన అనుమానం వుంది. నువ్వు నీ భార్యను అనుమానిస్తూన్నావనీ. బ్లూప్రింటు గురించి నువ్వే పంపావనీ అతడు బాబాజీకి చెప్పాడు.

ఇక నువ్వు ఎలక్ట్రిక్ సప్లయి వైర్లను, దున్న

మూపురం దగ్గిర ఓపెన్ చేసి వదలావు. లోపల వున్న సన్నటి ఫ్యూజ్ వైరు బదులు నరసింహాన్నడిగి తీసుకొన్న లావుపాటి వైరును వేశావు. ఎలక్ట్రిక్ దున్నలోకి కావలసిన దానికన్నా ఎక్కువ వోల్టేజీతో పవర్ వెళ్ళేలా మీటరును మార్చావు.

గండభేరుండం పెదవి విప్పకుండా అతడి నోరు శాశంతంగా మూసేశావు. నాలుగు తగిలేటప్పటికి షణ్ముగ్వ నిజం చెప్పేశాడు. లేకపోతే అవసరం తీరేక అతడూ గండభేరుండాన్ని చేరుకొనేవాడే.”

నిరంజనరావు మౌనంగా తలవంచుకొన్నాడు.

“రెండు హత్యలు చేసినందుకు నిన్ను అరెస్టు చేస్తూన్నాం” అంటూ అతడి చేతులకు బేడీలు వేశాడు సత్తిరాజు. □

హెచ్చరిక?

ప్రకాశరావు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. ఆఫీసులో వాళ్ళంతా కలిసి తనని పీక నొక్కేస్తున్నట్టు భయంకరంగా కల రావడమే అతని ఉలికిపాటుకి కారణం.

లేచి లైటేసి తలగడకింద వాచీలో టైము చూసుకుని 'బాప్రే' అనుకుంటూ హడావిడిగా మంచం దిగేడు. టైము నాలుగు చూపిస్తోంది. ఆదరాబాదరాగా మొహం కడుక్కుని వేళ్ళతోనే పళ్ళు తోమేసుకుని బట్టలు మార్చి రూము తాళం వేసుకుని స్కూటరు తీసుకుని రోడ్డుమీద పడ్డాడు.

చీకటి చిక్కగా వున్నందువల్ల వేగంగా పోతున్న స్కూటరుకు లైటింగు పెరిగి రోడ్డు బాగా కనిపిస్తోంది.

ప్రకాశరావు ఓ బ్యాంకులో పనిచేస్తున్నాడు. అతడి స్నేహితుడు దక్షిణామూర్తి నగరం పొలిమేరల్లో ఓ ప్లాటు కొనుక్కుని, ఆ రోజు తెల్లవారుఝామున నాలుగుంపావుకి శంకుస్థాపన చేసుకుంటూ ఆ ఫంక్షనుకి ప్రకాశరావుని ఆహ్వానించాడు. నిజానికి శంకుస్థాపన ఓ పెద్ద కార్యక్రమం కాకపోయినప్పటికీ దక్షిణామూర్తికి అత్యంత సన్నిహితుడు కావడంచేత ప్రకాశరావుకి వెళ్ళక తప్ప లేదు.

ముహూర్తం టైముకి చేరుకోలేకపోయినా ఓ పది హేను ఇరవై నిమిషాలు లేటుగానయినా చేరుకోవచ్చునని సమాధానపడ్డాడు.

ఇంచుమించు ఊరు దాటి వచ్చేశాడు ప్రకాశరావు.

కంకరరోడ్డు ప్రారంభమైంది. అందాకా అక్కడక్కడా ఒకటో రెండో కనిపించిన ఇళ్లు కూడా ఇప్పుడు కనిపించడం మానేశాయి. దీపాలు బాగా వెనక్కిపోయాయి. స్కూటరు లైటు తప్పితే మరి చుట్టుపక్కల ఎక్కడా కాంతిచిహ్నాలు కనబడటంలేదు.

ఎవరినయినా అడ్రసు అడుగుదామంటే మనిషి జాడ లేదు పెద్దపెద్ద బండరాళ్ళు గండభేరుండ పక్షుల్లాగా గుంపులుగా లైటుకాంతిలో కనిపిస్తున్నాయి.

ఏ రూటులో రావాలో ఎక్కడ మలుపులు తిరగాలో దక్షిణామూర్తి చెబుతున్నప్పుడు తను సరిగ్గా వినిపించుకోకుండా "నాకు తెల్సురా....పదేళ్ళబటి సిటీలో వుంటున్నాను. నా కంతా కొట్టిన పిండి" అని కాలరెగరేశాడు. ఆ నిర్లక్ష్యం యిప్పుడు దెబ్బ కొట్టింది. బాధపడ్డాడు

ప్రకాశరావు.

రూటు ఇదేనా అన్న అనుమానం కలుగుతోంది. అలా కొంతదూరం గుడ్డిగా వెళ్ళాడు. అదృష్టం బావుంది. తనొచ్చింది సరయిన రూటే. దూరంగా లైట్లు కనిపిస్తున్నాయి. ఫంక్షను జరుగుతున్న హడావిడి.

స్కూటరు సరాసరి అక్కడికి వెళ్ళి ఆగింది.

ఓ పెద్దమనిషి ఎదురొచ్చి పలకరించి తీసికెళ్ళాడు. ఏడెనిమిది పెట్రోమాక్స్‌లైట్లు వెలుగుతున్నాయి. ఇరవై ముప్ఫైమంది చక్కగా ముస్తాబై సందడిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆడవాళ్ళు పట్టుచీరలు నలిగిపోకుండా వయ్యారాలు ఒలకబోస్తూ తిరుగుతూ కాళ్ళకు అడ్డం పడుతూ అల్లరిచేస్తున్న చిన్నపిల్లల్ని కోప్పడుతున్నారు. నలుగురైదుగురు వయసుమళ్ళుతున్న పెద్దమనుషులు కుర్చీలు గుండ్రంగా వేసుకుని పెద్దగా రాజకీయాలు మాట్లాడుతుకుంటున్నారు.

"దక్షిణామూర్తి ఏడీ?" తనని తోడ్కొని వచ్చినాయన్ని అడిగేడు ప్రకాశరావు.

"తెలివితక్కువతనం కాకపోతే ఏవిటండీ! పురోహితుడు రాత్రే వచ్చి పడుకుని మీతోబాటే కలిసివస్తానంటే —....ఎందుకూ! తెల్లారగట్ట మా వాడొచ్చి స్కూటరుమీద తీసుకొస్తాడని అన్నార్ట. అతణ్ణి తీసుకురావడానికి వెళ్ళిన దక్షిణామూర్తి ఇంతవరకూ రాలేదు" అన్నాడు.

"అరెరే!" అన్నాడు ప్రకాశరావు.

అంతలో ఓ యువతి మేం కూర్చున్నచోటుకి వచ్చి "బాబాయ్! ఆ లైటు ఆరిపోయేలా వుంది. కొంచెం గాలి కొట్టరాదూ?" అంది.

"ఆఁ....ఆఁ...." అంటూ నా ప్రక్కనున్న మనిషి లేచివెళ్ళేడు.

ఆ అమ్మాయిని యధాలాపంగా చూసి ఆశ్చర్య పోయాను.

సుజాత! "సుజీ!" అన్నాను అప్రయత్నంగా.

"ఎవరూ?" కళ్ళు చిట్లించి చూసి "ఏయ్........ ప్రకాష్;...." గట్టిగా అరిచి నమ్మలేనట్టు అతడి భుజాలు పట్టుకుని కుదిపేసింది.

ప్రకాశరావు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలో చదువుకునేటప్పుడు సుజాతా వాళ్ళింట్లో అద్దెకుండేవాడు. ప్రకాశరావు ఎం.కాం. చదువుతున్నపుడు సుజాత ఎమ్మెస్సీ చేసేది. అతడికంటె ఆమె రెండేళ్ళు పెద్ద కావడంచేత కాలేదుగానీ లేకపోతే వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిగుండేది. అంత చనువుగా వుండేవారు వాళ్ళిద్దరూ.

తర్వాత ప్రకాశరావుకి హైదరాబాదులో బ్యాంకు ఉద్యోగం రావడం జరిగింది. ఆ విధంగా సుజాత అతడికి దూరమైపోయింది. ఆమె విశాఖపట్నం లోనే వున్నట్టు చూచాయగా తెలిసిందిగానీ ఉత్తర ప్రత్యుత్తరాలు లేనందు వల్ల క్రమంగా వారిద్దరి మధ్యా తెర పడినట్లయింది. ఇది జరిగి మూడేళ్ళయింది. తర్వాత హఠాత్తుగా ఈ రోజు ఇలా కనిపించేసరికి ఇద్దరికీ అమితానందం కలిగింది.

ఆమె అడిగిన మీదట ప్రకాశరావు అప్పట్నించీ తను ఏం చేసిందీ చెప్పుకొచ్చేడు. ఆమెగురించి తను అడిగే లోగా ఎవరో ఆమెను పిలుచుకువెళ్ళేరు.

"ఇప్పుడే వస్తా!" అని వెళ్ళింది సుజాత.

జరుగుతున్న హడావుడినీ, ఆర్భాటాన్నీ కళ్ళప్పగించి చూస్తూ కూర్చున్నాడు ప్రకాశరావు.

ఇంతలో మొదట తనని తీసుకొచ్చిన మనిషి వచ్చి ప్రక్కనే కుర్చీలో కూర్చుని ప్రకాశరావుతో బాతాఖానీ ప్రారంభించాడు.

తనుకూడా దక్షిణామూర్తి ప్రక్కనే ప్లాటు తీసుకున్నానని చెప్పి చీకట్లో వేలుపెట్టి చూపించాడు. ఈమధ్య ప్లాటు రేట్లు విపరీతంగా పెరిగిపోయాయనీ, ప్రతి ఉద్యోగీ ఇల్లు కట్టుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నాడనీ, అద్దె కొంపల రేట్లు పెరిగిపోవడమే ఇందుక్కారణమనీ, అర్బన్‌ల్యాండ్ సీలింగు యాక్టనీ, హుడా క్లియరెన్సనీ, గవర్నమెంటు పర్మిషననీ ఏవిటేవిటో చెప్పుకుపోతున్నాడు.

ప్రకాశరావు కివేం పట్టడంలేదు. అతడి ఆలోచనలన్నీ సుజాత చుట్టూనే తిరుగుతున్నాయి. ఇద్దరూ కలిసుండే రోజుల్లో ఎంత అందంగా వుందో ఇప్పుడుకూడా అంత అందంగా వుంది సుజాత. బహుశా ఇంకా పెళ్ళికాలేదేమో! అదే నిజమైతే....అయితే....ఏవో ఆహ్లాదం, హాయీ కలిగించే ఆలోచనలు లీలగా అతనిలో చోటు చేసుకుంటున్నాయి.

"పురోహితుణ్ణి తీసుకురావడానికెళ్ళిన దక్షిణామూర్తి ఇంకా రాలేదు. ముహూర్తం టైము దాటిపోతోంది" అన్నారెవరో.

ఆ విషయమే మరిచిపోయాడు ప్రకాశరావు.

ఇంతలో ప్రకాశరావు గుండెల్లో పువ్వులు జల్లుతూ మళ్ళీ వచ్చింది సుజాత! చేతిలోవున్న డ్రింకు ప్రకాశరావు కందిస్తూ "సారీ ప్రకాష్! తీరిగ్గా మాట్లాడే అవకాశం లేదిప్పుడు. పని ఎగవేసి కబుర్లు చెబుతున్నానని అనుకుంటారు" అంది.

వేరే ఎవరింటికైనా వెళ్ళినపుడు కాఫీగాని, మరేదైనా గాని ఆఫర్ చేస్తే మొహమాటపడే ప్రకాశరావు సుజాత అందించిన పానీయాన్ని కాదనకుండా అందుకున్నాడు. అందుకొని 'సిప్' చేశాడు.

'అమృతం తాగేనా?'—అనిపించిందతనికి! అంత మధురంగా వుండే పానీయం జన్మలో తాగలేదు.

"సుజీ! అమృతంలా వుంది ఈ పానీయం!" అన్నాడు ఆమె నుద్దేశించి.

"ఈజిట్?" కళ్ళు చక్రాల్లా చేసి అంది సుజాత!

"అఫ్‌కోర్స్! నీ చేత్తో యిస్తే విషం కూడా అమృతం లాగే అనిపిస్తుంది డియర్" అన్నాడు మళ్ళీ.

"కవిత్వం చెబుతున్నావే. కావ్యాలుగానీ చదువు తున్నావా ఏం?" కొంటెగా చూస్తూ అంది.

ఇద్దరూ నవ్వుకున్నారు.

గ్లాసు ఖాళీచేసి యిస్తూ "సుజీ! నీతో చాలా మాట్లాడాలి. ఇలా మెరుపులా మెరిసి మాయమైపోతోంటే ఎలా?" అన్నాడు ప్రకాశరావు చనువుగా.

"ప్లీజ్ ప్రకాష్; చూస్తున్నావుగా హడావుడి?" అతడి గెడ్డం సున్నితంగా మునివేళ్ళతో రాస్తూ అంది "తీరిక చేసుకుని మళ్ళీ వస్తా! ఏమనుకోకు!" తూనీగలా వెళ్ళిపోయింది.

ఆ మాటలూ, ఆ స్పర్శా, ఆ అనుభూతి ప్రకాశరావు ఓ యుగంపాటు మరిచిపోలేని గిలిగింతలు పెట్టాయి అతడి గుండెల్లో.

అతడు ఇతర ప్రపంచాన్ని మరచిపోయి సుజాత కోసం నిరీక్షిస్తున్నాడు. అడ్డం వస్తున్న ఆడవాళ్ళను తప్పించుకుని సుజాత కోసం వెదుకుతున్నాయి అతడి

కళ్ళు.

అలా ఎంతసేపు చూశాడోగాని అలసిపోయాయి అతడి నేత్రాలు! ఎప్పుడు మూతబడ్డాయో అతడికే తెలియదు. ఒళ్ళు తెలియని స్థితిలో మత్తుగా స్తబ్దుగా వుండి పోయాడు.

2

కనురెప్పలు వేడెక్కేసరికి మెళకువొచ్చింది.

కళ్ళు పొడుస్తూ ఎదురుగా సూర్యుడు! వెలుగు చూడ లేక కళ్ళు మూసుకుని మళ్ళీ తెలివి తెచ్చుకుని ప్రపంచంలో కొచ్చాడు ప్రకాశరావు.

వస్తూనే ఆశ్చర్యపోయాడు. గుండె జల్లుమంది. మరు క్షణం భయం!

కారణం - తను కూర్చుని వున్నది ఓ బండరాయి మీద. చుట్టూ పెద్ద పెద్ద కొండరాళ్ళు, పిచ్చి మొక్కలు, గడ్డి దుబ్బులూ.

కనుచూపు మేరలో ఎక్కడా శంకుస్థాపన చేసిన జాడలు లేవు. మనుషులు సంచరించిన గుర్తులు లేవు. అసలు ఇల్లు కట్టడానికి వీలైన స్థలం కూడా ఆ చుట్టు ప్రక్క లెక్కడా లేదు.

వెంటనే గుర్తుకొచ్చి వాచీ చూసుకున్నాడు. నాలు గింటికి ఆగిపోయి వుంది!!

అంటే తను ఇంటి దగ్గర నిద్ర లేచి చూసుకున్న ప్పుడు కూడా వాచీ నాలుగింటికే ఆగిపోయి వుందా?

కావచ్చు! శనివారం మధ్యాహ్నం బ్యాంకుకి 'హాఫ్‌డే' కాబట్టి మూడింటికే ఇంటికి చేరిన తను చేతినించి తీసేసిన వాచీని మళ్ళీ చూసుకోలేదు. సాయంత్రం నాలుగింటికి ఆగిపోయి వుంటుంది. నిద్ర లేవగానే తెల్లవారుఝాము

నౌలుగయిందనుకుని భ్రమపడి ఏ అర్ధరాత్రో బయలుదేరి తను ఇలా వచ్చేసి వుంటాడు.

చుట్టూ మరోసారి కలియజూశాడు భయంగా. స్కూటర్ క్షేమంగా ఉంది.

గుండె దడదడలాడుతూ వుండాగా స్కూటరు దగ్గరకు పరుగెట్టి స్టార్టు చేసి బయలుదేరాడు ప్రకాశరావు.

తనకి ఆ రాత్రి ఆతిథ్యమిచ్చింది మనుషులు కారు.... దయ్యాలు! అవును దయ్యాలే!!

ఆ ఊహే అతడికి వణుకుపుట్టిస్తోంది!

సుజాత కూడా దయ్యమేనా? అంటే సుజాత చచ్చిపోయుంటుందా? లేక తను కలగన్నాడా?—నో! తను కలగనలేదు! అది నిజంగా జరిగిందే!

స్కూటరు వేగంగా పోతోంది మట్టిరోడ్డులో.

కొద్దిసేపు అలా ప్రయాణించిన ప్రకాశరావు ఎవరో పిలిచినట్లయితే తలతిప్పి చూసేడు. కొద్దిదూరంలో దక్షిణామూర్తి!!

సమీపంలో ఇరవైముప్పై మంది మనుషులూ, హడావుడి!

అంటే—అసలు శంకుస్థాపన జరిగింది ఇక్కడన్న మాట! స్కూటరు మళ్ళించి స్టాండువేసి చెమట తుడుచుకున్నాడు ప్రకాశరావు.

"తెల్లారగట్టరాలేదేంరా? అయినా ఇటు వైపునించి వస్తున్నావెక్కణ్ణించి?" దక్షిణామూర్తి మాటలకు ప్రకాశరావు మెల్లగా, భయంగా జరిగిందంతా చెప్పేడు.

ఎవరూ వినకుండా పక్కకు తీసికెళ్ళి జరిగిందంతా విన్నాక నమ్మక తప్పలేదు దక్షిణామూర్తికి. ఈసారి భయం, చెమటలూ అతణ్ణి వరించాయి.

3

దక్షిణామూర్తి సలహామీద జరిగిన సంగతి అటు బంధువులకిగాని, ఇటు స్నేహితులకిగాని మూడో కంటికి చెప్పకుండా అలా రహస్యంగానే వుంచాడు ప్రకాశరావు. అంతగా రాత్రుళ్లు భయంవేస్తే తనింటికి వచ్చి పడుకో మన్నాడుగాని ప్రకాశరావు వెళ్ళలేదు.

ఆంజనేయస్వామి గుళ్ళో తమలపాకు పూజచేయించి, నూటపదకొండుసార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశాక ప్రకాశరావుకి ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. ఏ దెయ్యమూ తనని ఏమీ చెయ్యలేని స్థితికి ఎదిగిపోయానని నమ్మేడు.

తర్వాత సుజాత గురించి ఎంక్వయిరీ చేశారు స్నేహితులిద్దరూ. నాలుగు రోజుల తర్వాత విషయం తెలిసింది! వీళ్ళు భయపడినంతా అయింది.

సుజాత చనిపోయి ఆర్నెల్లుపైగా అయ్యింది. ఎమ్మెస్సీ పూర్తిచేశాక హఠాత్తుగా చనిపోయింది. ఆమె చావు అప్పట్లో అనేక అనుమానాలకు దారి తీసింది. నగరంలో ఒక డాక్టరుతో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయని అందరూ చెప్పుకున్నారు. ఈ విషయాలు విశాఖపట్నంలో వున్న దక్షిణామూర్తి చుట్టం ఒకడు వ్రాశాడు ఉత్తరంలో!

ఈ సమాచారం సేకరించే లోపున మరో విచిత్రం జరిగింది. ప్రకాశరావుకి ఆకలి పూర్తిగా చచ్చిపోయింది! అయిదు రోజుల్నించి అతడికి ఏమీ తినాలనిపించడం లేదు. కడుపు నిండిన మనిషిలాగానే వుంటున్నాడు. ఆకలి లేకపోవటమేకాదు తిండి హితవు పూర్తిగాపోయింది తిండేకాదు చివరికి కాఫీ, టీ లు కూడా తాగాలనిపించడం

లేదు. మంచినీళ్ళే అతడు లోపలికి తీసుకునేది. అది కూడా రోజు కొకసారో రెండుసార్లో!

ఈ విచిత్రానికి కారణం ప్రకాశరావు వూహించాడు. అది....సుజాత తనకి తాగమని యిచ్చిన పానీయం! తను అనుకున్న అమృతం!!

అవును...అది నిజంగా అమృతమే అయివుండొచ్చు. ఎందుకంటే....ఈ కలికాలంలో....ఆకలి విశృంఖలంగా రాజ్యమేలుతున్న దౌర్భాగ్య పరిస్థితుల్లో....పొట్టకోసం తిప్పలు పడుతున్న ఈ నికృష్ట స్థితిలో ఆకలిని చంపే పానీయంగాని ఔషధంగాని వుందంటే అది అమృతం కాక మరేమిటి? అది తప్పకుండా అమృతమే!!!

ప్రకాశరావు ఆకలి లేమి గురించి చెప్పగానే దక్షిణా మూర్తి నోరు వెళ్ళబెట్టాడు.

"నేనింక ఈ ఉద్యోగం చెయ్యడం, ఆస్తులు సంపాదించడం ఎందుకూ? హాయిగా కాలుమీద కాలేసుకుని కూర్చుంటా! ఆకలిలేని వాడికి ఇవన్నీ అనవసరం! కోటి విద్యలు కూటికొరకే, అనికదా!!కూడే అవసరం లేనివాడికి ఇవన్నీ ఎందుకు?నాన్సెన్స్!" అన్నాడు ప్రకాశరావు.

"ఉద్యోగం చెయ్యడమో, మానడమో, తర్వాత ఆలోచిద్దాం గాని, ముందు మనం డాక్టరు దగ్గిరికి వెడదాంపద. నీకేవన్నా జబ్బేమో కనుక్కుందాం!" అన్నాడు దక్షిణా మూర్తి.

ప్రకాశరావు అయిష్టంగానే కదిలాడు. డాక్టరు పరీక్షలన్నీ చేశాడు. అతడి జబ్బేమిటో బోధపడలేదు. వేరే స్పెషలిస్టు కెవరికైనా చూపించుకోమని సలహా ఇచ్చాడు.

ప్రకాశరావుని మరో డాక్టరుకి చూపించాడు దక్షిణా

మూర్తి. సిటీలో పేరుపొందిన డాక్టరతడు. అతడికీ అర్థం కాలేదు అతడి ఆకలిలేమికి కారణం ఏమిటో.

ఎక్స్‌రే తీసి చూశాడు.

జీర్ణకోశంలో ఘనమూ, ద్రవమూ కాని పదార్థం ఏదో వుందని. అది మామూలు ఆహార పదార్థాల్లా కాకుండా జీర్ణం కాకుండా వుందనీ దానివల్లే ఇలా ఆకలి లేకుండా ఉందనీ తేల్చాడు డాక్టరు.

ప్రకాశరావు, దక్షిణామూర్తి ఒకళ్ళమొహా లొకళ్ళు చూసుకున్నారు.

"మీరు నాలుగురోజుల్నించీ ఏంతిన్నారు? మామూలుగా మీరు తీసుకునే ఆహారం కాకుండా వేరే ఏమైనా తిన్నారా!" డాక్టరడిగిన ప్రశ్నలన్నింటికీ అడ్డంగా తలూపేడు ప్రకాశ రావు.

దక్షిణామూర్తి అతడికి వంతపాడేడు.

అందుకు కారణాలు రెండు.

ఒకటి దెయ్యాలు ఏవో తాగమని యిచ్చాయనీ, తను తాగేనని చెబితే ఆధునిక ప్రపంచం నమ్మదు సరికదా ఎగతాళి చేస్తుంది.

రెండోది ఒకవేళ దెయ్యాలున్నాయన్న వార్త పాకి పోయి దక్షిణామూర్తి కుటుంబ సభ్యులకు తెలిస్తే ఇక ఆ ప్రాంతంలో యిల్లూపద్దు పాడూ వద్దని గోల చెయ్యొచ్చు. ప్లాటు అమ్ముకోవలసి రావచ్చు. ఒకవేళ అమ్ముదామన్నా ఎవరూ కొనకపోవచ్చు.

ఈ రెండు కారణాలవల్ల ప్రకాశరావుచేత నిజం చెప్ప నివ్వలేదు దక్షిణామూర్తి.

అన్ని పరీక్షలూ చేసి డాక్టరు ఇలా అన్నాడు.

"ఇలాంటి కేసు చూడడం నా కెరీర్‌లో ఇదే ప్రథమం.

మీ కడుపులో ఆ పదార్థం ఉన్నంతకాలం మీకు ఆకలి వెయ్యదు ఆపరేషన్ చేస్తేగాని ఆ పదార్థాన్ని తొలగించడం సాధ్యంకాదు. ఆపరేషన్ చెయ్యాల్సివస్తే మాత్రం ప్రాణానికి నష్టం రావొచ్చు. ముఖ్యంగా ఈ కేసులో ఆపరేషను అంత మంచిది కాదు. కాబట్టి మెల్లగా ఆ పదార్థం కరగడానికి మందులేవైనా వున్నాయేమో చూడాలి. అది కూడా అంత సులభసాధ్యం కాదు. అయినా ప్రైత్రిచేద్దాం. ఇది రోజులు కాదు నెలలు పట్టవచ్చు.''

ప్రకాశరావు ఆఫీసుకి శెలవుపెట్టేశాడు. డాక్టరు యిచ్చే మందులు వాడుతూ కూర్చున్నాడు.

హాయిగా న్యూస్‌పేపర్లు చదువుతూ, సినిమాలు చూస్తూ కాలం వెళ్ళబుచ్చుదామని అతని ఆలోచన.

తిండి ఖర్చు పూర్తిగా మిగిలిపోయింది। కొద్దికాలం మాత్రం మందుల ఖర్చు భరిస్తే సరిపోతుంది.

ప్రకాశరావుకి ఆకలి లేకుండా పోయిందనే విషయం ఆనోటా ఆనోటా స్నేహితుల వరకు పాకిపోయింది. ఇంచుమించుగా ఇద్దరు ముగ్గురు రోజూ వచ్చి చూసి పోతున్నారు. కొందరు ధైర్యం చెబితే, మరి కొందరు భయపెట్టి అమెరికా వెళ్ళి అక్కడి డాక్టర్లకి చూపించుకోమని సలహాలిస్తున్నారు. ఇంకా కొందరైతే హాయిగా నవ్వుకుంటున్నారు.

ఇదిలా ఉండగా....ప్రకాశరావుకి మేనమామ కూతురుతో పెళ్ళి ఎప్పుడో ఖాయం చేశారు. తాంబూలాలుకూడా పుచ్చుకున్నారు. ఆ అమ్మాయి డిగ్రీ పరీక్షలు రాస్తున్నందువల్ల పెళ్ళిని రెండునెలలు వాయిదా వేశారు. ఆ ప్రకారం మరో నెల్లాళ్ళలో అతడి పెళ్ళి జరగాలి.

ఓరోజున ప్రకాశరావుకి కాబోయే మామగార్నించి

ఉత్తరం వచ్చింది.

"ప్రకాశం! అన్యథా భావించకు. కొన్ని అనివార్య కారణాల వల్ల మా అమ్మాయి వివాహం ఇప్పట్లో చెయ్య దలుచుకోలేదు. నువ్వు వేరే సంబంధం చూసుకో. పరిస్థితుల ప్రభావానికి తలొంచక తప్పడంలేదు. ఇలా వ్రాయ వలసివస్తున్నందుకు చింతిస్తున్నాను" అని రాశాడు.

ప్రకాశానికి అర్థమైంది తన జబ్బు ఎంతవరకు ప్రచార మైపోయిందో! ఇది తన పెళ్ళి. తన వ్యక్తిగత జీవితాన్ని దెబ్బతీస్తుందని ఊహించలేకపోయాడు. ఇక తన మేన మామే కాదు కూతురి జీవితం కలకాలం పచ్చగా వుండా లనుకునే ఏ తండ్రీ తన కూతుర్ని తనకి కట్టబెట్టడు.

తన పరిస్థితికి మొదటిసారిగా బాధపడ్డాడు ప్రకాశరావు.

రానురాను ప్రకాశరావు జబ్బు రకరకాలుగా ప్రచారం కాజొచ్చింది. అంతా విచిత్రంగా చెప్పుకుంటూ, కనిపించి నప్పుడల్లా దూరంగా తిరగడమో, వింత వింత ప్రశ్నలతో వేధించడమో చేస్తున్నారు.

నగరంలోని ఓ సంక్షేమ సంస్థ అయితే ప్రకాశరావుని సంస్థ ఖర్చులమీద అమెరికా పంపడానికికూడా సిద్ధపడింది. ప్రకాశరావు ఒప్పుకోలేదు. దక్షిణామూర్తి ఒత్తిడిమీద ఆఖరుకి ప్రకాశరావు ఒప్పుకున్నాడు.

4

ఆ రాత్రి దక్షిణామూర్తి, ప్రకాశరావు ఫస్టుషో సినిమా చూశారు. ప్రకాశరావుని రూమువద్ద దిగబెట్టి స్కూటరు మీద ఇంటికి వెళ్ళిపోయాడు దక్షిణామూర్తి.

అదే ఆఖరుసారిగా ప్రకాశరావు కనిపించడం!!

మర్నాడు తెల్లవారేసరికి ప్రకాశరావు మాయమైపోయాడు. వార్త తెలిసిన దక్షిణామూర్తి హడావిడిగా వచ్చివాలేడు.

ఇంటి తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. సామాన్లు చిందరవందరగా పడివున్నాయి.

పోలీసు కంప్లెయింట్ ఇచ్చాడు దక్షిణామూర్తి. అక్కడి పరిస్థితి చూస్తే ప్రకాశరావు తనంతట తానుగా వెళ్ళినట్టు లేదు. ఏదో బలప్రయోగం జరిగినట్టు స్పష్టంగా తెలుస్తూంది. ఇన్‌స్పెక్టర్ శతభిషం కేసు బుక్‌చేసి ఇన్ వెస్టిగేషన్ ప్రారంభించాడు.

అంతవరకూ జరిగిన సంఘటనలన్నీ ఏవీ దాచకుండా చెప్పేడు దక్షిణామూర్తి. మొదట నమ్మకపోయినా దెయ్యాల సంగతి చివరికి నమ్మక తప్పలేదు ...ఇన్‌స్పెక్టర్‌కి. ఆ వెంటనే ఇతణ్ణి ఆ దెయ్యాలే ఎత్తుకుపోయాయేమో అన్న అనుమానం మనసులో కలిగింది.

దెయ్యాలైతే పట్టుకోడం ఎలా?

మర్నాడు ప్రకాశరావు తల్లిదండ్రులూ బంధువులూ వచ్చి లబోదిబో మన్నారు.

కొందరు పోలీసువారి పరిశోధన తీవ్రతరం చెయ్యాలన్నారు. మరికొందరు భూతవైద్యుల్ని పిలిపించి పూజలు చేయించాలన్నారు.

దక్షిణామూర్తికి ఏం పాలుపోవడంలేదు.

5

ప్రకాశరావు స్ట్రెచర్‌మీద పడుకుని పైన తిరుగుతున్న ఫ్యానుపంక చూస్తున్నాడు.

అతడి చేతులూ కాళ్ళూ అతని స్వాధీనంలో లేవు! అవి బలంగా స్ట్రెచర్‌కి కట్టివేయబడి ఉన్నాయి.

జరగబోయేది వూహించుకుంటున్నాడు ప్రకాశరావు. కొద్దిసేపట్లో తనకి ఆపరేషన్ చెయ్యబోతున్నారు.

తన సమ్మతితో వాళ్ళకి పనిలేదు.

ఆపరేషన్ చేస్తే తను బ్రతికే గ్యారంటీ లేదని తనకే కాదు వాళ్ళకి కూడా తెలుసు. అదేమీ వాళ్ళ ప్రయత్నానికి ఆటంకం కాదు.

తను పోయినా ఫరవాలేదు! తన కడుపులోని పదార్థం తోనే వాళ్ళ పనంతా! దాంతోనే వాళ్ళ పరిశోధనంతా!

అంటే కొద్ది నిమిషాలే తన జీవితం!! ఈ స్వల్ప కాలంలో తనేం చెయ్యగలడు? తను ఏడ్చి గీపెట్టినా ప్రయోజనం ఉండదు!!

ఇప్పుడతడు చావుకి భయపడడంలేదు! తన జీవితం ఒక మిస్టరీగా హిస్టరీలో మిగిలిపోతుంది. అదైనా ఈ దుర్మార్గులు బైటపెడితేనే?!!

ప్రకాశరావు ఇలా ఆలోచిస్తున్న సమయంలో ఆపరేషన్ థియేటర్లోకి ఇద్దరు డాక్టర్లు తెల్లటి బట్టల్లో వచ్చారు.

ఆపరేషన్‌కి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.

"డాక్టర్స్! ఒక రోగిని బ్రతికించడం కోసం డాక్టర్లు ఆపరేషన్ చేస్తారు. కాని దురదృష్టవశాత్తూ ఈ ఆపరేషన్ నాకు చావుని ప్రసాదిస్తోంది. ప్రాణం పొయ్యాల్సిన డాక్టర్లు ఇప్పుడు ప్రాణం తీస్తున్నారు.

నేనిప్పుడు మిమ్మల్ని ప్రాధేయపడినంత మాత్రాన మీరు నన్ను విడిచిపెడతారని నేననుకోను. కాని ఈ ఆపరేషన్ చేసి మీరు ఏ విధంగా లబ్ధిపొందుతారో మాత్రం తెలుసుకోవాలనివుంది.

నా కడుపులోవున్న పదార్థం ఏమైవుంటుందో మీకీపాటికి కొంత అవగాహన అయ్యుంటుంది. అది ఏ విధంగా మీకు సహాయపడుతుంది? మీ ఆలోచన ఏమిటి? చంపబోయేముందు ఉరికంబంమీద వున్నవాడి కోరిక

తీర్చడం మన సాంప్రదాయంకదా! కనీసం అలా అనుకు
నైనా మీ పథకం నాకు చెబుతారని నా ఆశ!!" అన్నాడు
ప్రకాశరావు ఆవేదన నిండిన స్వరంతో.

డాక్టర్లు మొహాలు చూసుకున్నారు!

ఇద్దరూ మొహానికి కట్టుకున్న గుడ్డల్ని తొలగించారు.
ఆ యిద్దర్లో ఒకరు విదేశీయుడు!!

రెండవ వ్యక్తి భారతీయుడు! ఆంధ్రుడు!?

"ఆల్ రైట్! సంప్రదాయాలమీద నాకు నమ్మకం
లేకపోయినా ఎలాగూ పోతావు కాబట్టి చెబుతున్నాను.
నేను చెప్పబోయే విషయాలు అతి రహస్యం అయినా నీ
నుంచి అవి వేరే ఎవరికీ చేరే అవకాశం లేదు కాబట్టి
చెబుతా విను.

"నేను డా. మహేంద్ర! కొంతకాలం క్రితం నేను
విశాఖపట్నంలో వుండేటప్పుడు ఒక గర్ల్ స్టూడెంట్‌ని
రీసెర్చికి ప్రోత్సహించాను. ఆమె పేరు సుజాత! బ్రిలి
యంట్ గర్ల్!!

దేశంలో ఆకలి, పేదరికం పెరిగిపోతున్నాయని వాటిని
ప్రభుత్వాలు పోగొట్టలేక పోతున్నాయని పదే పదే వాపో
యేదాపిల్ల!! ఎప్పటికైనా ఆకలి పోగొట్టడానికి మందు
కనిపెడతానని అంటూండేది నాతో.

నిజంగా అటువంటి మందే కనక కనిపెడితే కోట్లు
సంపాదించవచ్చు గదా అని అనిపించేది నాకు. తర్వాత
ఆమెను ప్రోత్సహించి ఆమెచేత రీసెర్చి మొదలు పెట్టిం
చాను. యూనివర్శిటీ ద్వారా అయితే ఆ విషయం మీద
రీసెర్చికి ఒప్పుకోరు.

అంచేత ఆమెకు కావలసిన పుస్తకాలు, రసాయనాలు,

అన్నీ నేను తెప్పించి రహస్యంగా ప్రైవేటుగా పరిశోధన చేయించాను. ఒక సంవత్సరంపాటు ఎంతో శ్రమకోర్చి అహర్నిశలూ పాటుపడి తన పరిశోధన ఒక కొలిక్కి తీసుకొచ్చింది సుజాత. మరో నెలో రెండు నెలలో శ్రద్ధతో కృషిచేస్తే ఆకలిని చంపేమందు చేతికొస్తుందని నేను ఆశపడుతున్న సమయంలో సుజాత హఠాత్తుగా మనసు మార్చుకుంది.

తను కనిపెట్టబోయే మందువల్ల ప్రయోజనంకన్న అనర్థాలే ఎక్కువవుతాయని గ్రహించింది. ఆ మందు వాడటంవల్ల ఆకలి నశించిపోయినప్పటికీ శారీరక శ్రమ వల్ల ఖర్చుఅయ్యే కాలరీలను తిరిగి భర్తీచేసే గుణం ఆ మందుకి లేనందువల్ల మనిషి త్వరగా చనిపోయే అవకాశం ఉందనీ పైగా ఆ మందు వాడడంవల్ల ప్రజలు కష్టించి పనిచేయడం మానివేయడం, తద్వారా ఉత్పత్తులు తక్కువై సంక్షోభానికి దారితీస్తాయనీ వాదించింది.

ఆ మందు మార్కెట్‌లోపెట్టి కోటీశ్వరుణ్ణి కావాలను కున్న నా ఆశలన్నీ అలా నీరుగారిపోయాయి. ఆమె రీసెర్చికి నేను చేసిన ఖర్చంతా వృథా అయిపోయింది. రీసెర్చి కొనసాగించమని ఆమెకి అనేక విధాల నచ్చ జెప్పాను. కాని ఆమె వినలేదు.

నాకు ఆవేశం వచ్చింది. నాకు అన్ని విధాలా మన స్తాపం కలిగించినదాన్ని గొంతు నులిమి చంపేశాను. తర్వాత ఉరేసుకు చచ్చిపోయినట్టు వేలాడదీశాను.

ఆ తర్వాత ఆమెకూ నాకూ మాత్రమే తెలిసిన రీసెర్చి తాలూకు కాగితాలను స్టడీ చెయ్యడానికి ప్రయత్నించాను గాని, పూర్తిగా ఆ రీసెర్చి నాకు ఏ మాత్రం ఉపయో గించలేదు.

అప్పట్నించి పిచ్చెత్తినట్టు ఆ మందుగురించే ఆలోచిస్తున్నాను. లక్కీగా నీ గురించి నా చెవిన పడింది. ఈయన...అన్నట్టు నీకు పరిచయం చెయ్యలేదుకదూ! విలియమ్స్! ఇతను మంచి డాక్టరేకాదు ఏదైనా సాధించాలనే పట్టుదలవున్న మనిషి. ఈయన ద్వారానే నీ సంగతి తెలిసింది.

ఇప్పుడు నీ కడుపులోవున్న పదార్థాన్ని బైటకు తీసి పరీక్షిస్తాను. ఆ పదార్థానికి సుజాత చేసిన రీసెర్చి ఫలితాలకి పోలికలున్నాయేమోనని తేల్చుకుని ఒకవేళ రెండింటికీ పోలికలుంటే నేను విజయం సాధించినట్టే. ఈ ఫార్ములా నా ఒక్కడికే పరిమితం ఆ ప్రకారం! ఆ మందు తయారు చేసి కోట్లు సంపాదిస్తా! ఎవడికీ అందని అంతస్తుకి ఎదిగిపోతా!!'' వికటాట్టహాసం చేశాడు డా॥ మహేంద్ర.

అతడు చెప్పేదంతా వింటూంటే ప్రకాశరావుకి పట్టలేని ఆశ్చర్యం కలిగింది! సుజాత ఇతడి సహాయంతో రీసెర్చి చేసిందా? రీసెర్చి పూర్తి కాకుండానే వీడు ఆమెను హత్య చేశాడంటే ఆమె ఇతడితో తీవ్రంగా విభేదించి ఉండాలి!! అందువల్ల చనిపోయిన తర్వాత కూడా ఇతడ్ని సాధించే ఉద్దేశ్యంతోటే ఆ పానీయం తనకిచ్చిందా?

ఎక్కడో విశాఖపట్నంలో చంపబడిన సుజాత దెయ్యంగామారి హైదరాబాదు వచ్చి మరీ ఇలా తనకు కనిపించిందంటే ఏదో ప్రయోజనాన్ని ఆశించే ఇలాచేసిందా?

తను ఏ విధంగానూ ఈ వ్యక్తిని పట్టుకుని చట్టానికి అప్పగించలేని స్థితిలో ఉన్నాడే!—ఇలా ఆలోచిస్తున్న ప్రకాశరావుకి ఒక ఇంజక్షన్ ఇవ్వబడింది. కొద్ది క్షణాల్లో తను చావబోతున్నానని ప్రకాశరావు నిర్ధారణకొచ్చి రామనామ స్మరణచేసుకున్నాడు.

కొద్ది నిమిషాల్లో అతని పొట్టమీద కత్తితో గీతపెట్టి ఆపరేషన్ ప్రారంభించారు.

ప్రకాశరావు కడుపుకోసి జీర్ణాశయంలో వున్న వింత పదార్థాన్ని బైటకు తీశారు డా॥ మహేంద్ర, విలియమ్స్.

"నేనింతకాలం ఆశగా చూస్తున్నది దీని కోసమే! దొరికింది!! నే నింక కోటీశ్వరుణ్ణి అయిపోతా!!!" పిచ్చి పట్టినట్టు అరిచేడు మహేంద్ర.

వెంటనే దాన్ని ఓ గాజు సీసాలో పెట్టి జేబులో వేసుకున్నాడు. గ్లవ్స్ విప్పేసి, ఆపరేషను టేబిల్‌ని వదిలి వేగంగా వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుంటూన్న మహేంద్రతో అన్నాడు విలియమ్స్ ఆతృతగా.

"డాక్టర్! మనం కొద్ది నిమిషాలు ఓపికపట్టి కుట్లు వేస్తే పేషెంట్ బతుకుతాడు. రండి! ఆపరేషన్ చేసే ముందు మనం భయపడ్డట్టు ఇతడి ప్రాణానికి ఇప్పుడు ముప్పేం లేదు! రండి! ప్లీజ్!!"

"వ్వాట్! వీడు బ్రతుకుతాడా! నో! నా బెటాల్! వీడెంతమాత్రం బ్రతకడానికి వీల్లేదు! వీడు బ్రతికితే నా గుట్టంతా బైటపెడతాడు! వీడు చావాల్సిందే!"

"నో నో బ్రతకడనుకున్న పేషెంటు బ్రతికే అవకాశం వున్నప్పుడు చూస్తూ చూస్తూ చంపడం మన వృత్తి ధర్మంకాదు. కాదనకండి. ప్లీజ్! మీరు రాకపోతే నేనే బ్రతికిస్తానుగానీ చూస్తూ చూస్తూ అతణ్ణి చంపలేను." ఆవేశంగా అన్నాడు డా॥ విలియమ్స్!

"డాక్టర్! నాతో చేతులు కలిపి చివరికి నాకు ఎదురు తిరుగుతావా? నీ వల్లకూడా నాకు ముప్పుతప్పదు." అంటూనే మెరుపువేగంగా తన పక్క టేబిల్‌మీద ఉన్న

కత్తెర తీసి విలియమ్స్ పొట్టలో పొడిచాడు.

క్షణంలో ఏం జరుగుతుందో ఊహించేలోగా మరో సారి బలంగా కత్తెరతో పొడిచి వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కున్నాడు డా॥ మహేంద్ర.

విలియమ్స్ చిన్నగా మూలుగుతూ నేల కొరిగిపోయాడు. ఇంక అక్కడ ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రమాదం అనుకుని వెంటనే ఆపరేషన్ థియేటర్‌నించి బైట పడ్డాడు డా॥ మహేంద్ర.

బైట నిలబడ్డ అటెండరుతో "లోపల ఆపరేషన్ పూర్తికాలేదు. ఎవర్నీ ఓ గంటదాకా లోపలికి పంపకు" అని చెప్పేసి వేగంగా బైటకు వెళ్ళిపోయాడు.

అటెండరుకి ఆశ్చర్యం కలిగింది.

డాక్టరు కోటునిండా రక్తం చిమ్మివుంది. ఆపరేషన్ చేస్తే మరీ అంతగా రక్తం ఒంటిమీద పడదు. ఒకవేళ పడినా వెంటనే మార్చుకునిగాని ఆసుపత్రి వదిలి వెళ్ళరు. అలా రక్తం మరకలతోటే బైట కెళ్ళాల్సిన ఖర్మ ఏం వచ్చింది? పైగా ఆపరేషను చెయ్యడానికి డాక్టర్లతోబాటు అసిస్టెంట్సు ఎవరూ లోపలికి వెళ్ళలేదు. ఏ చిన్న ఆపరేషనూ కూడా అసిస్టెంట్సు లేకుండా చెయ్యరు.

అనుమానం పెనుభూతం అయ్యేసరికి లోపల ఏం జరుగుతోందో చూడాలనిపించి మెల్లగా తలుపుతీసి చూశాడు అటెండరు.

అంతే. కెవ్వున కేకపెట్టి బయటకొచ్చి నర్సులతో చెప్పి హడావిడి చేశాడు.

6

పోలీస్‌స్టేషన్‌కి ఫోను వెళ్ళింది క్షణాల్లో.

ఈలోగా ఆసుపత్రిలోవున్న జూనియర్ డాకరు వేరే

ఆసుపత్రులకు ఫోన్లు చేశారు.

పోలీసు లొచ్చిన వెనుకనే ఇద్దరు డాక్టర్లు కూడా కార్లో వచ్చారు.

జరిగింది క్లుప్తంగా, అతికష్టంమీద చెప్పి ప్రాణాలు వదిలాడు డా. విలియమ్స్.

పోలీసుల అనుమతితో వెంటనే ప్రకాశరావు కేసుకి అటెండయ్యారు డాక్టర్లు.

ఆసుపత్రిలో వేరే ఆపరేషన్ కోసం తెప్పించిన ప్రకాశరావు గ్రూపు రక్తం ఎక్కించి అతణ్ణి కాపాడ గలిగేరు డాక్టర్లు.

ఇన్‌స్పెక్టర్ శతభిషం హుటాహుటిగా అన్ని చోట్లకీ ఫోన్సచేసి డా. మహేంద్ర కోసం గాలింపు ప్రారంభించాడు.

ఎక్కడా అతడి జాడ లభ్యంకాలేదు. ఇంటికి చేర లేదు. ఎక్కడికి వెళ్ళివుంటాడో ఎవరూ చెప్పలేక పోయారు.

ఆ మర్నాడు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కి ఓ ఫోన్ వచ్చింది.

పోలీసు జీపులో శతభిషం. మరో పదిమంది పోలీసులు హుటాహుటిన బయలుదేరారు.

వందలాది జనం ఒకచోట గుమిగూడివున్నారు.

అది ఒక కోళ్ళఫారం!

అందులో ఒక వికృతాకారం! ఒంటినిండా రోమాలతో, మొహం కోతిలావున్న ఒక భారీకాయుడు కోళ్ళ ఫారంలోకి జొరబడి కోళ్ళని చేతికందినవి అందినట్టు మెడలు కొరికి రక్తం తాగుతున్నాడు. కోళ్ళు హాహాకారాలు చేస్తూ ఎగురుతూ పారిపోవడానికి వ్యర్థప్రయత్నం

చేస్తున్నాయి.

ఆ వికృతాకారాన్ని పట్టుకునే సాహసం ఎవరూ చెయ్యలేకపోతున్నారు.

కారణం - అంతకుముందే అతడు అడ్డువచ్చిన ఇద్దర్ని గాయపరిచి రక్తం తాగడానికి ప్రయత్నించాడు!

"ఆకలి! ఆకలి!" అంటూ చెవులు చిల్లులుపడేలాగా అరుస్తూ కనిపించిన ప్రతి ప్రాణిమీదా దాడిచెయ్యడం ప్రారంభించాడు.

ఎవరో ఫోనుచేసి జరిగిందంతా పోలీసులకు తెలియ బరిచారు.

ఇన్‌స్పెక్టర్ శతభిషం వచ్చి బీభత్సం సృష్టిస్తున్న ఆ వ్యక్తిని అతికష్టంమీద బంధించగలిగాడు. అప్పటికే పోలీసు లిద్దరు గాయపడ్డారు.

ఆ వికృతాకారం డా. మహేంద్రగా గుర్తించారు డాక్టర్లు!

అతడిలో మానవలక్షణాలు పోయి జంతులక్షణాలు చోటుచేసుకున్నాయని కూడా పరీక్షలుచేసి నిర్ధారించారు.

పరిశోధనల కోసం అతణ్ణి జంతువుల ఆసుపత్రికి కట్టుదిట్టమైన బందోబస్తుతో పంపించారు.

క్షణం తిండిలేకపోతే చాలు "ఆకలి! ఆకలి!" ఇదే అతడి ఆర్తనాదం!

"సుజాతకి డా. మహేంద్ర చేసిన అన్యాయం ఇలా ప్రతిఫలించింది! కాదు కావాలనే సుజాత ఇలా కక్ష తీర్చు కుంది!" అనుకున్నారు ప్రజలంతా!

తర్వాత ప్రకాశరావు మామూలు మనిషయ్యాడు. ఆ తర్వాత పెళ్ళి కూడా అయింది. □

సీరియల్

నగరంలో నేరగాళ్ళు

ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

తండ్రి ఒక్కడే లోపలకువస్తే ఏం జరుగుతోందోనని భయపడుతోంది ఆ యువతి....

గేటు తెరుచుకున్న చప్పుడు కాలేదు కానీ మోటారు వాహనం తిరిగి వెళ్ళిపోతున్న చప్పుడు వినపడింది.

బూట్ల చప్పుడు వినబడింది.

జైన్ నిలబడి జేబులోనించి పిస్తోలుతీసి ఆడవాళ్ళిద్దరికి చూపించాడు. అరవొద్దని హెచ్చరించాడు. చిన్నగా వెళ్లి తలుపుపక్కనే నిలబడ్డాడు. రెండోపక్క జోగిందర్ నిలుచున్నాడు.

అనుచరులు గోడపక్కనే నిలబడ్డారు.

గోవర్ధన్ లోపలకు రాకుండా తిరిగివెళ్ళిపోతే బావుండు ననుకుంది ఆయన భార్య - కూతురుకూడా....

అడుగుల చప్పుడు ఆగిపోయింది.

ఒక సెకండ్‌కు కాలింగ్‌బెల్లు మోగింది.

తలుపుపక్కనే పొంచివుండి బోల్టు తీశాడు జైన్....

తలుపు కొంచెంగా తెరుచుకుంది. బయట వున్న మనిషి లోపలకు రాలేదు.

వూపిరి బిగపట్టాడు జోగీంధర్....

'గోవర్ధన్ లోపలకు రాడేం?' అనుకున్నాడు జైన్.

అనుచరులు జైన్‌ని చూస్తున్నారు.

ఎందుకు గోవర్ధన్ లోపలకు రాకుండా అక్కడే ఆగి పోయాడో వాళ్లకు అర్థంకాలేదు.

పిస్తోలును గట్టిగా పట్టుకున్నాడు జైన్....

తల బయటపెట్టి చూడాలనుకున్నాడు జోగీందర్. కాని అలాచేస్తే జైన్ పిస్తోలుతో తన తలను కాలుస్తాడని అత డికి తెలుసు.

"డాక్టర్ గోవర్ధన్" బయట వున్న మనిషి పిల్చాడు.

అప్పు డర్థమయింది వాళ్లందరికీ వచ్చిన మనిషి గోవ ర్ధన్ కాదని - ఇంకెవరో అని.

ఇప్పుడేమిటి చెయ్యటం.

అతనెవరో ఎందుకు వచ్చాడో తెలీదు. అతడికిజవాబు చెప్పి పంపించే స్థితిలో ఆడవాళ్లిద్దరూ లేరు.

ఇక ఆలోచించలేదు జైన్....

"ప్లీజ్ కమిన్" అన్నాడు కొంచెం వెనక్కు జరిగి.

అప్పుడు లోపలకు వచ్చాడు ఓమనిషి.

తళతళ మెరుస్తున్న బట్టతల, తెల్లని ప్యాంటు వేసు కున్నాడు. తెల్లటి షర్టుమీద నీలంరంగు కోటు వేసు కున్నాడు. కాళ్ళకి నల్లటిబూట్లు, అరవైయేళ్ళకు ఒకటో, రెండో తక్కువగా వుంటుంది వయసు. కళ్ళు లోపలకు పీక్కుపోయి పేషంట్‌లాగా వున్నాడు.

ఆయన లోపలకు రావటంతోనే బలంగా అతడి కాలర్ పట్టుకుని ఈడ్చాడు జోగిందర్.

ఆయన్ని మాట్లాడనివ్వకుండా పిస్తోలును అతడి గుండెలకు ఆనించాడు జైన్.

భయంతో వాళ్ళందరినీ చూశాడు ఆయన.

ఆయనకేమీ అర్ధంకాలేదు.

"ఎవర్నువ్వు?" తలుపుమూసి బోల్టువేసి అడిగాడు జైన్.

"డాక్టర్ ఈశ్వర్"

"ఈ టైమ్‌లో గోవర్ధన్‌తో నీకు పనేమిటి?"

"ఒక ఆపరేషన్ గురించి మాట్లాడటానికి వచ్చాను."

"నువ్విక్కడికి వస్తావని గోవర్ధన్‌కి తెలుసా?"

"తెలుసు. సాయంత్రం ఆరు గంటలకు ఫోన్లో చెప్పాను."

"ఆల్‌రైట్. ఈయన్ని కూడా కట్టెయ్యండి." అన్నాడు జైన్.

"నన్నా? ఎందుకు?" అన్నా డాయన భయంతోనే.

అప్పుడు చూశాడాయన ఆడవా ళ్ళిద్దరినీ. అప్పటిదాకా వాళ్ళను చూసే అవకాశం అతడికి కలగలేదు.

ఏదో మాట్లాడబోయాడు డా. ఈశ్వర్.

కాని జైన్ పిస్తోలు మొనతో అతడి గుండెలమీద బలంగా నొక్కాడు అరవొద్దన్నట్టు.

ప్లాస్టిక్ తాడుతో ఆయన రెండు చేతులూ వెనక్కు విరిచి కట్టేశారు. నోటికి టేప్ అంటించారు.

ఒక్క నిమిషం ఆలోచించి అన్నాడు జైన్.

"ఇంజక్షన్ ఇవ్వండి. కొన్ని గంటలవరకూ స్పృహ లోకి రాకూడదు."

నల్లడ్రెస్సు వేసుకున్న అనుచరుడు జేబులోనించి సిరంజి బయటకు తీసి బాటిల్లో వున్న ద్రవాన్ని లోపలకు లాగి డా. ఈశ్వర్ జబ్బలోకి గుచ్చాడు. కళ్ళు పెద్దవి చేసుకుని మూలిగాడు ఆయన. రెండు నిముషాలకు ఆయన గోడమీదకు జారాడు మూటలాగా.

వాళ్ళను చూస్తుంటే గోవర్ధన్ భార్యకీ, ఆ యువతికీ తమని ప్రాణాలతో వదులుతారనే ఆశ పోయింది.

అవసరం లేకపోయినా ప్రాణం తియ్యటానికి వెన కాడని మనుషులని వాళ్ళకు తెలిసిపోయింది.

"బేబీ...." పిల్చాడు జైన్.

ఆ యువతి అతడ్ని చూసింది.

"బాగా విను. డా. గోవర్ధన్ ఎవరో ఈ క్షణం వరకూ నాకు తెలీదు. ఆయినతో మాకు శత్రుత్వం లేదు. కొన్ని వివరాల కోసం ఆయన అవసరం మాకు కలిగింది. ఆ వివరాలు చెప్పటానికి ఆయన నిరాకరిస్తే ఆయన్ని చంప టానికి నిర్ణయించుకున్నాం. అందుకే ఆయన్ని మొండిగా ప్రవర్తించవద్దనీ, అట్లా ప్రవర్తించి ప్రాణాలు పోగొట్టుకో వద్దనీ మీరు కూడా చెప్పండి. అర్ధమయ్యిందా?" పిస్తోలు వూపుతూ అన్నాడు.

తల వూపింది ఆ యువతి.

"బాస్....ఏదో కారు వస్తోన్న చప్పుడవుతోంది" అన్నాడు జోగిందర్ చిన్నగా.

చెవులు రిక్కించాడు.

తల వూపాడు.

ఏదో కారు వచ్చి ఆ యింటిముందు ఆగింది.

డోర్ తెరుచుకున్న చప్పుడు—ఆ తర్వాత మళ్ళీ

డోర్ మూసుకున్న చప్పుడు.

"థాంక్ యూ....గుడ్ నైట్"

ఉలిక్కిపడింది ఆ యువతి.

సందేహంలేదు.

ఆ గొంతు తన తండ్రిదే. ఆయన లోపలకు రాకుండా ఆ కార్లోనే తిరిగి వెళ్ళిపోతే బావుండు ననుకుంది.

ఆ యువతి మొహంలోని ఉలికిపాటును గుర్తించాడు జైన్.

ఆ వస్తున్న మనిషే డా. గోవర్ధన్ అని అతడికి తెలిసిపోయింది.

15

బూట్ల చప్పుడు తలుపుల దగ్గిరకు వచ్చి ఆగిపోయింది. వెంటనే కాలింగ్ బెల్ మోగింది.

ఒక్క నిమిషం ఆగి జైన్ బోల్టుతీసి తలుపు తెరిచి బయటవున్న గోవర్ధన్‌ని లోపలకు లాగాడు.

విసురుగా లోపలపడ్డాడు ఆయన.

జోగిందర్ ఆయన్ని పట్టుకుని కత్తిని ఆయన ఎదురుగా వుంచి "అరవక....ప్రాణం పోతుంది" అన్నాడు చిన్నగా.

గోవర్ధన్ వణికిపోయాడు.

ఆయనకేమీ అర్థంకాలేదు. తలుపు తెరిచిం దెవరో చూడకుండానే లోపలకు లాగేశారు.

ఎవరు వీళ్ళంతా?

తన ఇంటికి ఎందుకు వచ్చారు?

బయట రోడ్డువారగా ఆగివున్న వాహనాలను చూసినా పక్క ఇంటివాళ్ళకోసం ఎవరో వచ్చారని అనుకున్నాడు.

అప్పటిదాకా ఆయన భార్యనీ, కూతుర్నీ చూడలేదు.

"గ్లాడ్ టు సీ యూ డాక్టర్ .... ఒక్కసారి అటు చూడండి" అన్నాడు జైన్.

అప్పుడు చూశాడు గోవర్ధన్ వాళ్ళిద్దర్నీ.

"బేబీ" అంటూ వాళ్ళ దగ్గరకు పరుగెత్తబోయాడు.

"ఆగండి డాక్టర్. వాళ్ళకేమీ ప్రమాదంలేదు. ఇటు చూడండి. మీ ఫ్రెండ్ డా. ఈశ్వర్ మత్తులో తేలుతున్నాడు" అన్నాడు జైన్ చిరునవ్వుతో.

"డా. ఈశ్వర్ వచ్చాడా!" ఆశ్చర్యంగా అన్నాడాయన.

"అవును మీకోసం వచ్చాడు. తప్పక ఆయన్ని మత్తు మందులో ముంచేశాము.

"ఎవరు మీరు? దోపిడీ దొంగలా?" అడిగాడు డాక్టర్ గోవర్ధన్.

నవ్వాడు జైన్.

"చట్టం దృష్టిలో నేరస్థులం డాక్టర్. చీకటి ప్రపంచానికి అధినేతలం. దోపిడీ చెయ్యటానికి ఈ యింటికి రాలేదు. ఒక చిన్న ఇన్ఫర్మేషన్‌కోసం మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాం. మీరు సహకరిస్తే ఎటువంటి ప్రాణ నష్టం చెయ్యకుండా వెళ్ళిపోతాం. కాదని మీరు మొండికేస్తే ముందు వాళ్ళిద్దరినీ చంపి తర్వాత మిమ్మల్ని కూడా చంపుతాం. హత్యలు చెయ్యడం మాకు సిగరెట్టు తాగినంత తేలికైన పని. ఏమంటారు?" అన్నాడు జైన్.

"అంత శ్రమ నేను మీకివ్వను. అడగండి మీకు అవసరమైన ఇన్ఫర్మేషన్ ఏమిటి?" అన్నాడు గోవర్ధన్.

అప్పటికే ఆయన శరీరం వణుకుతోంది. జీవితంలో అప్పటివరకూ ఆయనకు అటువంటి తెగించిన నేరస్థులెవరూ ఎదురుపడలేదు.

గోవర్ధన్‌కు యాభై ఆరేళ్ళు. బాగా అనుభవం వున్న సర్జన్ ఆయన. ఆయన జుట్టు చాలావరకు తెల్లబడి పోయింది. లోపలకు పీక్కుపోయిన దవడలు దట్టమైన కనుబొమలు ఆయన మొహానికి ప్రత్యేకంగా అమర్చినట్టు కనపడుతున్నాయి.

ఆయన షర్టు చెమటతో తడిసిపోయింది.

"థాంక్యూ డాక్టర్. మీరు ఈ విషయంలో సహకరిస్తారనే నమ్మకం నాకు వుంది. కూర్చోండి. మాట్లాడుకుందాం...." అంటూ తనో కుర్చీలో కూర్చున్నాడు జైన్.

ఒక నేరస్థుడు తండ్రితో అంత గౌరవంగా మాట్లాడతాడని ఆ యువతి అనుకోలేదు. అందుకే ఆమె జైన్‌ను ఆశ్చర్యంతో చూసింది.

డా. గోవర్ధన్ కుషన్ ఛెయిర్‌లో కూర్చుని "వాళ్ళిద్దరికీ కట్లు వూడదీస్తారా? ప్లీజ్. చూడలేకుండావున్నాను. దే ఆర్ డెలికేట్" అన్నాడు జైన్‌తో.

"సారీ డాక్టర్. కొంచెంసేపు ఓర్చుకోనివ్వండి. మా వృత్తిలో జాగ్రత్త చాలా ముఖ్యం. ఇవన్నీ వృత్తిపరమైన ప్రికాషన్స్ .... తప్పదు .... సారీ ఫరిట్ ...." అన్నాడు

"ఆల్‌రైట్. అడగండి ...." అన్నాడు గోవర్ధన్ ఇక తప్పదనుకుని.

"వినాయక్ మిమ్మల్ని ఎప్పుడు కలుసుకున్నాడు?"

"వినాయక్! అతడెవరు?" అనడిగాడు గోవర్ధన్ కొత్తగా అతడి పేరు వింటున్నట్టు

"ఆశ్చర్యం నటించకండి గోవర్ధన్. వినాయక్ మీకు

తెలుసు. మీ ఇల్లు. మీ ఫోన్ నెంబర్ కూడా తెలుసు. చెప్పండి అతడు మిమ్మల్ని ఎప్పుడు కలుసుకున్నాడు?"

"నటించటం నాకు చేతకాదు. నటించాల్సిన అవసరం కూడా లేదు. నా ప్రాణంకంటె ఎక్కువ ఏదీ కాదు.... నిజంగా వినాయక్ నాకు తెలీదు."

"అతను మీకు తెలీకపోతే మీ ఫోన్‌నెంబర్ అతడి అర చేతిలో ఎందుకు ఉంటుందంటారు డాక్టర్?"

"ఏమిటీ....వినాయక్ అనే అతని అరచేతిలో మా ఇంటి ఫోన్‌నెంబర్ ఉందా?"

"అవును. కొంచెం వివరంగా చెబుతాను....వినాయక్ అనే అతను ఒక బ్లాక్‌మెయిలర్ అతనిదగ్గర మా గురిం చిన రహస్యం ఒకటి ఉంది. దాన్ని అతను ఎక్కడో దాచాడు. అతను పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లో నిలబడి ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు అతడ్ని కాల్చి చంపేశాము. అప్పు డతని అరచేతిమీద 777262 అనే ఫోన్‌నెంబర్ ఉంది. ఆ నెంబర్ మీదేకదూ?"

"అవును....నాదే ఆ నెంబర్" అన్నాడు గోవర్ధన్.

"ఇప్పుడు చెప్పండి డాక్టర్... అతనెవరో మీకు తెలీ కుండా తన అరచేతిలో మీ టెలిఫోన్ నెంబర్ యెందుకు వేసుకున్నాడు? హత్య చెయ్యబడిన సమయంలో అతను టెలిఫోన్ బూత్‌లో ఉన్నాడు. అంటే అతను తప్పకుండా మీతోనే మాట్లాడుతూ ఉండాలి. కాబట్టి నిజంచెప్పి మీ ప్రాణాలు దక్కించుకోండి. లేకపోతే ఈ ఇల్లు క్షణాల్లో స్మశానంగా మారిపోతుంది"

"మైగాడ్....ఎవరీ వినాయక్??"

"బాగా ఆలోచించండి"

"రోజూ నన్ను ఎంతోమంది కలుస్తూ ఉంటారు....

హాస్పిటల్లో కలిసే వీలు దొరకనప్పుడు కొంతమంది ఇంటి దగ్గిర కలుస్తూ ఉంటారు. బాగా పరిచయం ఉన్నవాళ్ళ పేర్లు గుర్తుంటాయి. ఈ మధ్య పరిచయం ఐనవాళ్ళ పేర్లు గుర్తుండవు. కాని వాళ్ళని చూస్తే గుర్తుపట్టగలను. ప్లీజ్. అతనెలా ఉంటాడో వర్ణించి చెప్పండి గుర్తుచేసుకుంటాను" అన్నాడు గోవర్ధన్ కర్చీఫ్‌తో మొహానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ.

జోగీందర్—వినాయక్ రూపాన్ని వర్ణించి చెప్పాడు.

"అవును. అతను నాకు తెలుసు. అతడి పేరు వినాయక్ అని అతను చెప్పివుంటాడు. కాని నేను గుర్తు పెట్టుకోలేదు."

"గుడ్....చెప్పండి డాక్టర్. అతను మిమ్మల్ని కలిసినప్పుడు మీతో ఏం చెప్పాడు?" ముందుకు వంగుతూ అడిగాడు జైన్.

"ఈ మధ్యనే అతను నన్ను కలిశాడు. తను ఒక యువతిని ప్రేమించాననీ, పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాననీ, కాని ఆ అమ్మాయి ఒక వ్యభిచారిణి అనీ చెప్పాడు. అటువంటి యువతిని పెళ్ళిచేసుకుంటే పిల్లలు పుట్టే అవకాశం ఉందా అనడిగాడు. ఇలాంటివే ఇంకొన్ని ప్రశ్నలు అడిగాడు. అన్నింటికీ జవాబులు చెప్పాను. మళ్ళీ కలుస్తానని వెళ్ళిపోయాడు. కానీ మళ్ళీ కలవలేదు" అన్నాడాయన రిలీఫ్‌గా.

తనకు తెలిసిన నిజాన్ని చెప్పాడు కాబట్టి తమ ప్రాణాలకు ప్రమాదం లేదని అనుకున్నాడు డాక్టర్ గోవర్ధన్.

జైన్ మొహం అసంతృప్తితో వూగిపోయింది.

"ఇంతేనా? అతను ఇంకా ఏమీ చెప్పలేదా?"

"లేదు....మరో విషయం అతడు మాట్లాడలేదు."

"బాగా గుర్తుచేసుకోండి."

"అనవసరం....అతను నన్ను ఒకేసారి కలిశాడు.... కొంచెంసేపు మాట్లాడాడు మళ్ళీ కలుస్తానని వెళ్ళిపోయాడు. ప్లీజ్ నన్ను నమ్మండి....ఒక బ్లాక్‌మెయిలర్‌తో సంబంధం పెట్టుకునే ధైర్యం నాలో లేదు."

"సారీ డాక్టర్....మీరు నిజమే చెప్పి ఉండొచ్చు కాని మాకు అవసరమైన నిజం ఇదికాదు. అసలు నిజాన్ని మీరు రహస్యంగా ఉంచుతున్నారు. చచ్చిపోవటానికి ముందు వినాయక్ ఫోన్లో మాట్లాడుతున్నాడు. అప్పుడు అతని అరచేతిలో వున్న టెలిఫోన్ నెంబర్ మీది. దీన్నిబట్టి మీకేమనిపిస్తోంది? అతను మీతోనే ఫోన్లో మాట్లాడుతున్నాడని. ఈ వయసులో మీరు మా హింసను భరించగలరా?" చాలా నెమ్మదిగా అడిగాడు జైన్.

ఉలిక్కిపడ్డాడు గోవర్ధన్. ఆయన కళ్ళలో భయం నీడలాగా కదిలింది.

"ప్లీజ్....నన్ను నమ్మండి" అన్నాడు పూడుకుపోయిన గొంతుతో.

"నమ్మకంతో పనులు నెరవేరవు డాక్టర్....హింసతోనే అన్ని పనులూ జరుగుతాయి. ఊ....కానివ్వండి" అన్నాడు జైన్ తనలోని ఓర్పు పూర్తిగా కాలిపోయినట్టు.

జోగిందర్ వేగంగా కదిలాడు.

జేబులోనించి ఉేపు తీసి డాక్టర్ గోవర్ధన్ నోటికి అంటించాడు. ఆయన నడుముకువున్న బెల్టును వూడదీసి దాంతో చేతులను వెనక్కివుంచి కట్టేశాడు.

కత్తితో ఆయన తలమీద గుండ్రంగా వెంట్రుకలను తీసేశాడు.

ఆడవాళ్ళిద్దరూ గట్టిగా మూలిగారు. వాళ్ళు అరుస్తున్నా

రని గ్రహించాడు జైన్....—వద్దు .... ఆయన్నేమీ చెయ్యొద్దు—అన్నట్టు చూశారు వాళ్ళిద్దరూ జైన్‌ను.

జైన్ గుండెల్లో జాలిలేదు. అనుకున్నది సాధించటమే ధ్యేయం....అందుకోసం ఎంతమంది బలైపోయినా లెక్క లేదు.

నేర సామ్రాజ్యంలో జాలికి చోటులేదని నమ్మే నేరస్థుల్లో జైన్ మొదటి నేరస్థుడు.

కత్తితో డాక్టర్ గోవర్ధన్ తలమీద గీరాడు జోగిందర్ నెత్తురు బయటకు చిమ్మింది.

గోవర్ధన్ కీచుమంటూ అరిచాడు. బాధతో కదిలి పోయాడు. కళ్ళలో నీళ్ళు కారాయి.

"చెప్పానుకదా డాక్టర్....ఈ హింసల్ని మీరు భరించ లేరు. నిజం చెప్పండి....వినాయక్ మీతో ఏం చెప్పాడు? ఏదయినా వస్తువును మీకిచ్చాడా? చెప్పండి" అన్నాడు జైన్ పిస్తోలు మొనతో ఆయన గడ్డాన్ని పైకెత్తుతూ.

గోవర్ధన్ తనకేమీ తెలీదన్నట్టు కళ్ళను తిప్పాడు.

"కానివ్వండి....నిజం చెప్పేట్టు లేడు."

జోగిందర్ జేబులోనించి చిన్న సీసాను తీసి అందులో వున్న ఎర్రటి ద్రవాన్ని కత్తితో కోసిన గాయంమీద పోశాడు.

బాధతో ఎగిరి కుర్చీలోనించి ముందుకు దూకాడు డాక్టర్ గోవర్ధన్ కెవ్వుమని మూలుగుతూ....

ఆడవాళ్ళు ప్రాణంలేనట్టు బిగుసుకుపోయారు. భరించ లేని—భయంతో వాళ్ళ మొహాలు ఇంకా తెల్లగా పాలి పోయాయి.

"తప్పదు డాక్టర్....ఇంకా ఘోరమైన హింసలు వున్నాయి. అంతకంటే చావే హాయిగా వుంటుంది. మీరు

భరించలేరు. చెప్పండి. వినాయక్ మీకు ఏం చెప్పాడు?" అన్నాడు జైన్ ఆయన నోటికివున్న టేప్‌ను లాగి....

"నన్ను చంపండి... నా ఇల్లును పూర్తిగా దోచుకు వెళ్ళండి. కాని నన్ను హింసించకండి... భరించలేను.... ఏ నేరస్థుడితో నాకు సంబంధంలేదు. బ్లాక్‌మెయిలర్‌తో లాలూచీపడే ప్రలోభం నాలో లేదు. ప్లీజ్.... మమ్మల్ని వదిలెయ్యండి" జైన్ కాళ్ళమీదపడ్డాడు డాక్టర్ గోవర్ధన్.

విసురుగా తన్నాడు జైన్....

"నా మనసు మార్చటం ఎవరికీ సాధ్యంకాదు డాక్టర్. ఇదే ఆఖరి అవకాశం....ఉపయోగించుకోండి చెప్పండి."

"నాకు తెలీదు" అన్నాడు గోవర్ధన్....

"మిమ్మల్ని చంపుతాం. ఒప్పుకుంటారా?"

తలవూపాడు డాక్టర్.

"జోగీందర్....ఇల్లంతా గాలించండి. అంగుళంకూడా వదలకుండా వెదకండి. వెళ్ళండి"

అంతా లోపలకు పరుగుదీశారు ఉత్సాహంగా....

జైన్ ఆడవాళ్ళదగ్గరకు నడిచాడు.

వాళ్ళు అతడ్ని నల్ల పులిని చూసినట్టు చూశారు.

"నిజం తెలిస్తే మీరైనా చెప్పండి డాక్టర్ని చంపుతాం. అనవసరంగా ఎందుకు ప్రాణాలు పోగొట్టుకోవటం?"

గోవర్ధన్‌ను చంపవద్దన్నట్లు చూశారతన్ని...

జైన్ అదోవిధంగా నవ్వాడు.

"నేరస్థుడికి తెలిసిన నీతి ఒక్కటే. అనుకున్నది సాధించటం....అలా జరగనప్పుడు ఎంతమందినైనా చంపటం. ఏంచెయ్యను. తప్పదు....జరగాలి." అన్నాడు వాళ్ళని చూస్తూ....

"కానీ మీకొక సహాయం చెయ్యగలను. నా అను

చరలనించి మీ మాన ప్రాణాలకు హామీ ఇవ్వగలను. మీరు మమ్మల్ని చట్టానికి పట్టిస్తారనే భయం మాకులేదు. ఎందుకంటే మేమంతా మారువేషాల్లో వున్నాం. రేపు నువ్వే నన్ను చూసినా గుర్తుపట్టలేవు. దట్ మచ్ హెల్ప్ ఐ కెన్ డు.''

జోగీందర్. మిగిలిన అనుచరులు లోపలి గదుల్లోనించి వచ్చారు.

''అంతా వెతికాం బాస్....ఎక్కడా కనపడలేదు. డాక్టర్‌కు నిజంగా వినాయక్ ఏమీ చెప్పలేదేమో'' అన్నాడు జోగీందర్ లోపలి సేఫ్‌లో బాగా డబ్బుదొరికిన సంతోషంలో ....

ఎడంచేత్తో ఈడ్చి జోగీందర్ మొహంమీద కొట్టాడు జైన్.

''ఇడియట్‌లా మాట్లాడకు. అనవసరంగా నోరు తెరిస్తే ముందు నిను కాల్చి చంపుతాను. నోర్మూసుకో'' అన్నాడు కోపంతో వూగిపోతూ....

నిజంగా కాల్చి చంపుతాడేమోనని భయపడిపోయాడు జోగీందర్ ....

''ఇప్పటికైనా నన్ను నమ్మండి....వినాయక్ నాతో ఏం చెప్పలేదు'' అన్నాడు డాక్టర్ గోవర్ధన్ ఏడుస్తూ—

''ఐపోయింది డాక్టర్....నిర్ణయం జరిగిపోయింది. మీ కోసం పిస్తోలు గుండు వేస్ట్ చెయ్యటం అనవసరం.... నిజంగా వినాయక్ ఏమీ చెప్పకపోతే నష్టంలేదు. కాని చెప్పివుంటే ఆ రహస్యం మీతోనే అంతంకావాలి... చెప్పాడో లేదో తెలీదు కాబట్టి మిమ్మల్ని చంపినప్పుడే నాకు రక్షణ. తాడు బిగించండి'' అన్నాడు జైన్ పిస్తోలును ఆడవాళ్ళకు గురిచేసి వుంచుతూ—

ఇద్దరు అనుచరులు ప్లాస్టిక్ తాడును డాక్టర్ గోవర్ధన్ గొంతుచుట్టూ బిగించారు ఆయన గింజుకున్నాడు. ఇద్దరు అనుచరులు ఆయన్ని నొక్కిపట్టి వుంచారు.

గోవర్ధన్ భార్య, కూతురు కిందపడి కీచుమంటూ చప్పుళ్ళు చేశారు.

ఐనా గోవర్ధన్ హత్య ఆగలేదు.

తాడు బిగుసుకుపోయింది.

ఎర్రగా అయిపోయింది డాక్టర్ గోవర్ధన్ మొహం.... కంటిగుడ్లు, నాలిక బయటకు వచ్చాయి. రెండు నిముషాలకు ఆయన్లో చలనం ఆగిపోయింది.

తాడు లాగేశారు....

"అవుట్!" అన్నాడు జోగీందర్.

"మూవ్" అన్నాడు జైన్ ఆడవాళ్ళని చూసి.

అప్పటికే వాళ్ళు భయంతో స్పృహతప్పి పడిపోయారు.

జైన్ పిస్తోలు జేబులో పడేసుకుని తలుపు తెరుచుకుని బయటకు నడిచాడు.

"జోగీందర్" ఒక అనుచరుడు పిల్చాడు.

ముందుకు వెళుతున్న అతను ఆగిపోయి "ఏమిటి?" అన్నాడు.

"అమ్మాయిని వదిలి వెళ్ళటం నా కిష్టంలేదు" అన్నాడతను.

"షటప్....ఇప్పుడుకాదు. ఇంకోసారి ట్రయ్‌చేద్దాం. బాస్ కాల్చి చంపుతాడు నడువ్...." అన్నాడు బయటకు పరుగుదీస్తూ—

క్షణంలో డాక్టర్ గోవర్ధన్ ఇంటిని ఖాళీచేసి అంతా బయటకు వెళ్ళిపోయారు.

రెండు నిముషాలకు ఆ వీధిలో ముందు ఎంబాసిడర్ కారు వెనుక జీపు కదిలి వెళ్ళాయి.

జీపులో కూర్చున్న నేరస్థులు డాక్టర్ గోవర్ధన్ ఇంట్లో దోచుకున్న డబ్బును, బంగారాన్ని లెక్క చూసుకుంటు న్నారు.

16

డాక్టర్ గోవర్ధన్ భార్య స్పృహలోకి వచ్చినా మాట్లాడలేక పోయింది. ఏడుస్తూ గోవర్ధన్ పక్కనే కూల బడిపోయింది.

డాక్టర్ కూతురు సుమిత్ర దుఃఖంలో ఉన్నా యస్.పి. నాయక్ అడుగుతున్న ప్రశ్నలకు ఆమే జవాబులు చెప్పటం మొదలు పెట్టింది.

నాయక్ మొహంలో కోపం—అవమానం అందరికీ కనపడ్డాయి.

"చెప్పు బేబీ ఏం జరిగింది?" అన్నాడాయన సుమిత్ర కళ్ళలోకి చూసి.

సుమిత్ర ఒక్క నిముషం ఆగి కళ్ళు తుడుచుకుంటూ వాళ్ళు తలుపుమీద చప్పుడు చేయటం దగ్గర్నించి వివరంగా చెప్పటం మొదలు పెట్టింది.

పోలీసు ఇన్‌స్పెక్టర్ ఇతర అధికారులు ఆమె చెప్పే దంతా జాగ్రత్తగా వింటున్నట్టు మౌనంగా వున్నారు.

డాక్టర్ ఈశ్వర్ కూడా స్పృహలోకి వచ్చాడు.

ఎదురుగా పోలీసులను చూడగానే ఆయనకు ధైర్యం వచ్చింది. డాక్టర్ గోవర్ధన్ హత్యచెయ్యబడ్డాడని తెలియ గానే ఆయన షాక్ ఫీలయ్యాడు. ఇద్దరూ మంచి స్నేహి తులు. ప్రాణాలు తీసేంతటి శత్రువులు డాక్టర్ గోవర్ధన్‌కి వున్నారని ఆయన అనుకోలేదు.

బయటనించి లోపలకు వస్తున్న మనుషుల్ని పోలీసులు అదుపుచేస్తున్నారు. ఆ రాత్రి సమయంలో గోవర్ధన్ హత్యవార్త అక్కడ చాలామందికి తెలిసిపోయింది.

జైన్—జోగీందర్—అనుచరులు వెళ్ళిన అరగంటకు డాక్టర్ గోవర్ధన్ ఇంటి ఎదురుగా మేడలోవుండే ముసలాయనకు బాగా ఆయాసం వచ్చింది. ఆయన ఆస్తమారోగి. ఆ ఇంట్లోవాళ్ళు డాక్టర్ గోవర్ధన్ కోసం వచ్చారు. అప్పుడు వాళ్ళకు గోవర్ధన్ శవం—స్పృహలేని మనుషులు కనబడ్డారు. వాళ్ళలో ఒకరు వెంటనే పోలీసులకు ఫోన్ చేసి చెప్పారు.

చెబుతోంది సుమిత్ర.

"ఏమిటీ.... వినాయక్ గురించి అడిగాడా అతను?" అడిగాడు నాయక్.

"అవును."

"వినాయక్ డాక్టర్ గోవర్ధన్‌ని కలుసుకున్నాడా?"

"కలుసుకున్నాడుట" అంటూ తను విన్నదంతా చెప్పింది.

అప్పుడర్థమయ్యింది సూచనగా యస్.పి. నాయక్‌కు గోవర్ధన్ ఎందుకు హత్య చెయ్యబడ్డాడో.

"చెప్పు.... ఇంకా ఏమడిగా డతను?"

"వినాయక్ మీకు ఏమని చెప్పాడు? అతనొక బ్లాక్ మెయిలర్....నాకు సంబంధించిన ఒక రహస్యం అతని దగ్గర వుంది....దాని గురించి అతను మీతో చెప్పి వుంటాడు—అన్నాడు. ఆ రహస్యం చెప్పమని డాడీని అడిగాడు. డాడీ తనకేమీ తెలీదన్నాడు. కాని ఆ దుర్మార్గుడు నమ్మలేదు. ఏదో వస్తువుకోసం ఇల్లంతా సోదా చేయించాడు అనుచరులచేత.... కాని వాళ్ళకు ఆ వస్తువు

దొరకలేదు" ఆగింది సుమిత్ర ఊపిరి తీసుకోటాని కన్నట్టు."

"ఆ వస్తువు దొరకనప్పుడు అతను డాక్టర్ గోవర్ధన్‌ని ఎందుకు హత్యచేశాడు?"

"డాడీ మాటల్ని ఆ నీచుడు నమ్మలేదు. నిజంగా వినాయక్ డాడీకి ఆ రహస్యమేదో చెప్పివుంటే డాడీవల్ల తనకు ప్రమాదం వుందిట. అందుకే ఆ అనుమానంతోనే నిర్దాక్షిణ్యంగా డాడీని చంపేశాడు" ఏడ్చేసింది సుమిత్ర.

"బాధపడకు బేబీ.... డాక్టర్ గోవర్ధన్‌ను అమానుషంగా హత్యచేసిన ఆ కిరాతకుడ్ని పట్టుకుని ఉరికంబం యెక్కిస్తాను .. తప్పకుండా ఈ బ్రూట్ ఆ ముగ్గురిలో ఒకడై వుంటాడు" అన్నాడు నాయక్.

"నాకేమీ అర్థం కావటంలేదు. డాక్టర్ గోవర్ధన్ అజాత శత్రువు. నాకు తెలుసు. ఎంతోమంది పేదలకూ్కడా ఆయన ఉచితంగా వైద్యం చేశాడు. అటువంటి వ్యక్తిని హత్య చేశారంటే నమ్మలేకపోతున్నాను" అన్నాడు డాక్టర్ ఈశ్వర్ బాధగా.

"అంతా బేడ్‌లక్ డాక్టర్ .... ఒక నేరస్థుడు డాక్టర్ గోవర్ధన్ దగ్గరకు సలహాకోసం వచ్చాడు. ఆ నేరస్థుడు కలవకుండా వున్నట్టయితే ఈ హత్య జరిగి వుండేది కాదు ....."

ఫోటోగ్రాఫర్ పని ముగించి యస్.పి. దగ్గరకు వచ్చి నిలుచున్నాడు. వేలిముద్రల నిపుణుడు నేరస్థుల వేలి ముద్రల కోసం ప్రయత్నం చేస్తున్నాడు.

సుమిత్ర చెప్పింది—

"వేలిముద్రలు దొరకవు....వాళ్ళు చేతులకు గ్లవుస్ తొడుక్కున్నారు. చాలా జాగ్రత్తపడ్డారు."

"వాళ్ళను చూస్తే మళ్ళీ గుర్తుపట్టగలవా నువ్వు?" నాయక్ అడిగాడు ఆమెను.

"వాళ్ళ బాస్ వేషం మార్చుకున్నట్టుగా ఆయనే చెప్పాడు. మిగిలినవాళ్ళు మారువేషంలో లేరనుకుంటాను. వాళ్ళ మొహాలు నాకు బాగానే గుర్తున్నాయి. మళ్ళీ చూస్తే తప్పకుండా గుర్తుపడతాను" చెప్పింది సుమిత్ర.

"గుడ్ .... వాళ్ళు బుల్లు దోచుకోవాలని అనుకున్నారా?"

"లేదు. కాని ఏదో వస్తువుకోసం లోపలి గదుల్లోకి వెళ్ళి వెతికివచ్చారు. ఏం చేశారో తెలీదు. డబ్బు, నగలు దోచుకున్నారేమో ....ఇంకా చూడలేదు."

"పదండి....లోపలకు వెళ్ళి చూద్దాం."

యస్.పి. వెనుకే అంతా నడిచారు. ఆయనకు ముందు సుమిత్ర వున్నది.

బెడ్‌రూంకు పక్కగా వున్న గదిలోకి వాళ్ళను తీసుకు వెళ్ళింది సుమిత్ర. ఆ గదిలో గోడపక్కనే వున్న ఐరన్ సేఫ్ పూర్తిగా తెరుచుకునే వాళ్ళకు కనబడింది.

"మైగాడ్ ...." నిస్పృహగా అన్నది సుమిత్ర.

"దోపిడి కూడా జరిగింది సర్ ...." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"బాస్టర్డ్స్ ...." అన్నాడు నాయక్ జేవురించిన మొహంతో.

"డబ్బు, నగలు దోచుకున్నారు. వెండి సామాను ముట్టుకోలేదు" అన్నది సుమిత్ర.

"డబ్బు ఎంత వుంటుందో నీకు తెలుసా?" నాయక్ అడిగాడు.

"తెలీదు. బంగారు నగల విలువ తెలుసు! లక్ష రూపాయలకు పైనే వుంటుంది" అన్నది సుమిత్ర పాలిపోయిన మొహంతో.

"సర్....పోలీసు డాగ్స్‌ను తీసుకువస్తే బావుంటుందేమో" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఉపయోగ ముండదనుకుంటాను. వాళ్ళు సాధారణ నేరస్థులు కాదు. వాళ్ళు దొరకరు. డాగ్స్ వాళ్ళ ఉనికిని తెలుసుకోలేవు. వాళ్ళు జాగ్రత్తపడతారు...." అన్నాడాయన.

మళ్ళీ అంతా హాల్లోకి వచ్చారు.

అప్పటికే అంబులెన్స్ సిద్ధంగా వుంది.

డాక్టర్ గోవర్ధన్ శవాన్ని బయటకు తీసుకెళుతున్నప్పుడు గోవర్ధన్ భార్య పెద్దగా ఏడ్చింది.

యస్.పి. నాయక్ ఆమెకు సానుభూతి తెలియజేశాడు.

నగరాన్ని పట్టి పీడిస్తున్న ముగ్గురి నేరస్థులను వెంటాడి పట్టుకోవాలని ఆయన చేస్తున్న ప్రయత్నాల్లో ఎప్పటికప్పుడు నేరస్థులదే పై చెయ్యి అవుతోంది. ఐనా నాయక్ నిరాశపడలేదు. పట్టుదలతో వాళ్ళకోసం వెతుకుతున్నాడు. వాళ్ళను జైలు గోడల మధ్యకు నెట్టివేసే ఆధారాల కోసం అన్వేషణ సాగిస్తున్నాడు.

వినాయక్ ద్వారా ఆ అవకాశం వచ్చింది.

కాని చెయ్యి జారిపోయింది.

ఆలోచిస్తున్నాడు నాయక్ అక్కడే నిలబడి.

వినాయక్ సంపాదించిన ఆ సాక్ష్యాన్ని యెక్కడ దాచాడు? యెవరి దగ్గిర దాచాడు? అతనికి అప్తులు

యెవరు:

అప్పుడే యెట్లా తెలిసిందో—కొంతమంది పత్రికా విలేఖర్లు కార్లో వచ్చారు.

యస్.పి. నాయక్‌ను చుట్టుముట్టారు.

17

ఇరుగ్గా వున్న సందులోకి స్కూటర్ని పోనిచ్చి హసీనా లాడ్జిముందు ఆపాడు మేనేజర్.

ఉదయం ఎనిమిది గంటలు దాటుతోంది.

ఎదురుగా వున్న రెస్టారెంటులో జనం కూర్చుని టీ తాగుతున్నారు.

స్కూటర్ని లాడ్జి ప్రహరీగోడలోపల స్టాండు వేసి లోపలకు వచ్చాడు.

అప్పటికే లాడ్జిలో వున్న మనుషులు రెస్టారెంటు నించి టీ తెప్పించుకుని తాగుతున్నారు.

బల్లముందున్న కుర్చీలో కూర్చుని ఎదురుగా వున్న దినపత్రికను తీసుకున్నాడు మేనేజర్. జేబులోంచి రెండు లాటరీ టిక్కెట్లను తీసి రిజల్ట్సు చూసుకున్నాడు. అతనికి లాటరీ టిక్కెట్ల పిచ్చి బాగావుంది. బహుమతిరాని టిక్కెట్లను ముక్కలుచేసి సిగరెట్టు ముట్టించాడు.

మళ్ళీ పేపరు తెరిచాడు.

మొదటిపేజీలో వున్న రెండు హత్యల వార్త ఫోటోలు అతనికి కనబడ్డాయి.

వినాయక్—డాక్టర్ గోవర్ధన్ హత్యల గురించి అందులో రాశారు.

మేనేజర్ అదిరిపడ్డాడు వినాయక్ ఫోటో చూస్తూనే. వినాయక్ తన వేషాన్ని మార్చుకున్నా పోలికలు స్పష్టం

గానే కనబడ్డాయి.

అప్పుడు గుర్తుకు వచ్చింది అతనికి వినాయక్ రాత్రి లాడ్జికి తిరిగిరాలేదేని. ఫోటో కింద రాసివున్న అతని హత్య గురించి చదివాడు. అతని గురించి తెలిసినవాళ్ళు వెంటనే పోలీసులకు తెలియజెయ్యాలనీ లేకపోతే ప్రమాద మనీ కింద రాసివుంది.

గోవర్ధన్ హత్య వార్త కూడా చదివాడు. రెండు హత్యలకీ సంబంధం వుందని అందులో రాశారు. యస్. పి. నాయక్ హంతకులను పట్టుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడని చదివాడు అతను.

"నమస్తే!"

తలెత్తాడు మేనేజర్.

రూంబోయ్ ఎదురుగా వున్నాడు.

"ఒరేయ్....ఈ ఫోటో చూడు!"

బోయ్ చూసి "ఈయన మన లాడ్జిలో దిగిన మనిషి కదూ" అన్నాడు.

"అవును. మన లాడ్జిలో దిగిన మనిషే. నిన్న సాయంత్రం ఎవరో కాల్చి చంపారుట....వెంటనే మనం యితని గురించి పోలీసులకు తెలియజేయాలి" అన్నాడు మేనేజర్.

"మనకెందుకు సార్ పోలీసులతో వ్యవహారం.... వాళ్ళు వచ్చారంటే ప్రశ్నలతో మనల్ని వేధిస్తారు మనం కోర్టు చుట్టూ తిరగాలి సాక్ష్యం చెప్పటానికి" అన్నాడు రూంబోయ్.

మేనేజర్ అందుకు ఒప్పుకోలేదు.

"తర్వాత వాళ్ళకు తెలిస్తే నిజంగానే రహస్యాన్ని దాచినందుకు మన ప్రాణం తీస్తారు. ముందుగా చెబితే

మనకు ఇబ్బంది ఉండదు. ఐనా అతన్ని చంపేసింది మన లాడ్జిలో కాదు. ఎక్కడో.... మనకేమీ రిస్కు వుండదు. ఆచూకీ తెలియజేసినందుకు పోలీసులు మనల్ని మెచ్చుకుంటారు."

"సార్....ముందు ఒక పని చేద్దాం....ఆయన ఉన్న గది తెరిచి సూట్కేసు ఉంటే అందులో ఏమున్నాయో చూద్దాం....డబ్బుంటే తీసుకోవచ్చు. చచ్చిపోయినవాడు తిరిగిరాడు కదా" సలహా యిచ్చాడు రూంబోయ్.

కోపంగా వాడిని చూశాడు మేనేజర్.

"బుద్ధి లేకుండా మాట్లాడకు దొంగ వెధవా....నీలాంటి వెధవలవల్లనే లాడ్జికి చెడ్డపేరు వస్తుంది. ఆ గదిలో పోలీసులకు పనికివచ్చే సమాచారం ఏదయినా ఉండొచ్చు. యస్.పి. నాయక్ స్వయంగా దర్యాప్తు జరుపుతున్నాడంటే ఆ మనిషి ఎవరో గూఢచారి అయివుంటాడు."

"గూఢచారులు, సి.ఐ.డి.లు ఇటువంటి తక్కువరకం లాడ్జిల్లో వుంటారా సార్!...." అనుమానంగా అడిగాడు బోయ్.

"ఒక్కోసారి వుంటారు. వాళ్ళు మారువేషాల్లో కూడా తిరుగుతూ వుంటారు. ఈ హత్య చెయ్యబడిన వినాయక్ కూడా కొంచెం వేషం మార్చుకున్నట్టే కనబడుతున్నాడు. నా అనుమానం గూఢచారి అయివుంటాడు. మనం పోలీసులకు ఫోన్ చెయ్యాలి" అంటూ టెలిఫోన్ డైరెక్టరీ తీసి అందులో పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబరు చూసి డయల్ చేశాడు.

అప్పటికే రూంబోయ్ పైకి పరిగెత్తాడు మిగిలిన వాళ్ళకు వినాయక్ హత్యావార్త చెప్పటానికి.

అవతల్నించి ఎవరో పలికారు....

"నమస్కారం సార్.... నేను హసీనా లాడ్జి మేనే జర్ని....ఇవాళ దినపత్రికలో హత్య చెయ్యబడినట్టుగా ఫోటో వేసిన వినాయక్ మా లాడ్జిలోనే బసచేశాడు. ఆయనకు చెందిన వస్తువులు మా లాడ్జిగదిలోనే ఉన్నాయనుకుంటాను. ఆయన గది ఖాళీచేసి వెళ్ళలేదు."

"గుడ్... ఎడ్రసు చెప్పు."

లాడ్జి ఎడ్రసు చెప్పాడు మేనేజర్.

"వెంటనే బయల్దేరుతున్నాం."

ఫోన్ పెట్టేశాడు మేనేజర్.

అతను చాలా గొప్పగా ఫీలయ్యాడు.

రూంబోయ్స్ నలుగురు అతనిదగ్గిరికి వచ్చి పేపరు తీసుకొని అందులో వినాయక్ ఫోటోని చూశారు. వాళ్ళలో ఒక్కడే వినాయక్‌ని గుర్తుపట్టాడు

"సార్........యిప్పుడు మన లాడ్జికి పోలీసులు వస్తారా?...."

"అవును....పెద్దగా అరిచి గొడవ చెయ్యొద్దు....మన లాడ్జిగదిలో పోలీసులకు ఉపయోగించే సమాచారం దొరికితే పోలీసు ఆఫీసర్లు మనల్ని మెచ్చుకుంటారు."

మళ్ళీ సిగరెట్ వెలిగించాడు మేనేజర్.

పొగ వదులుతూ ఇంకోసారి పేపర్లో వున్న వినాయక్ ఫోటోని చూశాడు. హత్యావార్తను చదివాడు.

ఆ వార్తను కొన్నిసార్లు చదివి రూంకుర్రాళ్ళను పిల్చి వాళ్ళకు పోలీసులు అడిగే ప్రశ్నలకు జవాబులు యెలా చెప్పాలో ఎక్స్‌ప్లెయిన్ చేశాడు.

వాళ్ళంతా కొంచెం కంగారుపడ్డారు. ఎందుకంటే పోలీసులతో వ్యవహారం చివరకు యెటువైపుకు తిరుగుతుందో, ఏమవుతుందోననే భయం వాళ్ళలో వుంది.

అపరాధ పరిశోధన పోటీ-239

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ. 1-00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-6-'88 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '88 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇజ్రాయిల్ కమెండోలచే గత నెలలో హత్యచేయబడిన ప్రముఖ పి.ఎల్.ఓ. నాయకుడు—?

(అరాఫత్, అబూజిహాద్)

2. ఏదేశ ప్రగతైనా దీనితోనే వుంది—?

(విద్యుచ్ఛక్తి, పాడిపంటలు)

3. దేశంలో యీ దోపిడీలు ఎక్కువైయాయి—?

(బ్యాంకు దోపిడీలు, దారి దోపిడీలు)

4. ఇటీవలనే ఇక్కడ కట్టిన ఓ ఆసుపత్రి కూలిపోయి అనేకమంది పసిపిల్లలు దుర్మరణం పాలయ్యారు—?

(జమ్మూ, లక్నో)

5. వీధికుక్కలకు యీ మహానగరం ప్రసిద్ధికెక్కినది—?

(కలకత్తా, హైద్రాబాదు)

సాక్ష్యం చెప్పటానికి కోర్టుచుట్టూ తిప్పుతారనికూడా వాళ్ళకి తెలుసు.

"సార్ ....ఈ హత్య చెయ్యబడిన మనిషి ఏదయినా దొంగతనం చేశాడేమో ...." అన్నాడొక రూంబోయ్.

అతడ్ని సీరియస్‌గా చూశాడు మేనేజర్.

"నోర్మూసుకో ...ఒక దొంగ వెధవ ఫోటో పేపర్లో వేసి యింత గొప్పగా వార్తను ప్రచురించరని నాకు తెలుసు. అన్నింటినీ మించి ఇక్కడో ముఖ్యమైన పాయింట్ ఉంది ఎస్.పి. నాయక్ ఈ కేసు విషయంలో ప్రత్యేకమైన ఇంట్రస్టు చూపుతున్నాడని రాశారు. అంటే ఏమిటి?"

"వీడెవడో పెద్ద బాంక్‌ను దోచేసి వుంటాడని" సన్నగా, పొడుగ్గా ఉన్న రూంబోయ్ అన్నాడు.

"కాదు. గూఢచారి ఐవుంటాడు. నేను డిటెక్టివ్ నవలలు చదువుతాను. అందుకే ఈ హత్య చెయ్యబడిన మనిషెవరో ఈజీగా తెలుసుకున్నాను. కొంచెంసేపు ఓపిక పట్టండి. నిజం మీకే తెలుస్తుంది" అన్నాడు.

సరిగ్గా అప్పుడే పెద్ద చప్పుడుతో ఒక ఎర్రటి మోటార్ సైకిల్ వచ్చి ఆగింది. దానిమీదనించి లావుగా, పొడుగ్గా ఉన్న మనుషులు ఇద్దరు దిగారు.

స్టాండువేసి ఒకసారి లాడ్జిముందు ఉన్న బోర్డును చదివి లోపలకు వచ్చారు.

వాళ్ళు లోపలకు వస్తున్నప్పుడు "రండి....రండి.... రూములు ఖాళీగా ఉన్నాయ్" అన్నాడొక రూంబోయ్.

వాళ్ళతన్ని కోపంగా చూసి మేనేజర్ దగ్గిరకు వొచ్చి "నువ్వేనా మేనేజర్ ఈ లాడ్జికి..." అనడిగారు ఒకేసారి.

"ఎస్" అన్నాడు మేనేజర్ సీరియస్‌గా.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ

మా వద్ద సుప్రసిద్ధ రచయితల, రచయిత్రుల సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య, స్కూలు, కాలేజి విద్యార్థులకు కావలసిన అచ్చు పుస్తకములు, ఎక్సర్‌సైజ్ పుస్తకములు

మ రి యు

రామాయణం, భారతం

భాగవతం, దేవీ భాగవతం

ఇం కా

హిందీ, ఇంగ్లీషు

నవలలు లభించును.

తప్పక విచ్చేయండి!

నేడే మా కేటలాగు కొరకు వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(పాత కూరగాయల మార్కెట్ వద్ద)

రా జ మ ం డ్రి - 533 101.

"మాకో ఇన్ఫర్మేషన్ కావాలి" అన్నాడు ఆ ఇద్దరిలో నల్లగీతల షర్టును పాంటులో దోపుకున్నవాడు.

"చెప్పండి....ఏంకావాలి?"

"మేమొక మనిషిని వెతుకుతూ వస్తున్నాం. మేం క్రయింబ్రాంచ్ మనుషులం" అన్నాడు రెండోవాడు బోడిగుండులాంటి బట్టతలను చేత్తో తడుముకుంటూ.

"ఎవరు? గూఢచారి గురించేనా?" అనడిగాడు రూం బోయ్ వెంటనే.

"నోర్మూయ్........జోకు లెయ్యకు?" సీరియస్‌గా వార్నింగ్ ఇస్తున్నట్టు అన్నాడు మేనేజర్ వాడివైపు తిరిగి.

మళ్ళీ వాళ్ళవైపు తిరిగి "చెప్పండి సర్....ఏ మనిషి గురించి ఇన్ఫర్మేషన్ కావాలి....?" అన్నాడు వినయంగా.

బట్టతల మనిషి పాంటు జేబులోనించి వినాయక్ ఫోటోని తీసి మేనేజర్‌కి చూపిస్తూ "ఇతను మీ లాడ్జిలో బసచేశాడా ఈమధ్య?" అనడిగాడు.

మేనేజర్ నోట్లో తడారిపోయింది ఆ ఫోటోని చూస్తూనే....అతను ఊహించింది కూడా అదే. వాళ్ళు తప్పకుండా వినాయక్ ఫోటో చూపించకపోయినా అతడి గురించి ఆరాతీస్తూనే ఆ లాడ్జికి వచ్చారని అతడు ఊహించాడు.

వాళ్ళు క్రయింబ్రాంచ్ మనుషులు కాదని అతడు వాళ్ళను చూస్తూనే గ్రహించాడు. వినాయక్‌ను హత్య చేసిన ముఠాలో మనుషులు అయివుంటారని అనుకున్నాడు.

రూం కుర్రాళ్ళెవరూ నోరెత్తలేదు. ఆ ఫోటోలో

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జులై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే **M. O.** చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియ జేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి రెండేసి నెలలకొకసారి V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో రెండు నెలలకొకసారి పత్రికల ఖరీదు రు. 30/-లు చెల్లించి కాపీలు పొందవచ్చును. యీ సౌకర్యం కావలసివస్తే మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

వున్న మనిషే హత్య చెయ్యబడిన మనిషని వారు గుర్తు పట్టారు.

"తెలుసు....మా లాడ్జిలోనే బస చేశాడు" అన్నాడు మేనేజర్ ఓరకంటితో చేతికి వున్న వాచీని చూసు కుంటూ—

"నిజంగానా?" ఆశ్చర్యంగా అడిగాడు నల్లగీతల షర్టు మనిషి.

"అవును ...ఇతను కూడా మీ డిపార్ట్‌మెంట్ మని షేనా?" చాలా వినయంగా అడిగాడు మేనేజర్.

"యు ఆర్ కరెక్ట్....ఏ గదిలో బసచేశాడు? ఆ గది నెంబరెంత?" ఆత్రంగా అడిగాడు బట్టతల వ్యక్తి.

"రూం నెంబర్.......వన్ మినిట్" అని క్షణం తర్వాత "ఐదొందల నాలుగు .... అప్‌స్టయిర్...." అన్నాడు.

"థాంక్‌యూ వెరీమచ్" అని వాళ్ళిద్దరూ కళ్ళతో మాట్లాడుకుని అక్కడినించి మెట్లవైపుకు కదిలారు.

"ఆగండి సర్... ప్లీజ్ వెయిట్" అన్నాడు మేనేజర్ పెద్దగా.

వాళ్ళు ఆగిపోయి యేమిటన్నట్టు అతనివైపు చూశారు....

"ఫోటోలో మనిషి - అదే మీ డిపార్ట్‌మెంట్ మనిషి ఆ గదిలో లేడు. రాత్రే వెళ్ళిపోయాడు" అన్నాడు చిరు నవ్వుతో.

"ఎక్కడికి?"

"స్వర్గానికి" అంటూ దినపత్రికలో వేసిన వినాయక్ ఫోటోని చూపించాడు.

బట్టతలవాడు ముందు షాక్ తిన్నాడు.

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

మే 25 విడుదల !

1. సౌగంధి — యద్దనపూడి సులోచనరాణి — 25-00
   (డైరెక్టు నవల)
2. ఉషశ్రీ రామాయణం (సరళ వచనం) — 25-00
3. ఉషశ్రీ భారతం ,, — 25-00
4. ఉషశ్రీ సుందరకాండ ,, — 12 00
5. పదకేళి — 10-00
   (100 పజిల్స్—ఆఖరున జవాబులతో)
6. ఉద్యోగపరీక్షలు - విజయరహస్యం — 7-50
   P.V.K. ప్రసాదరావు
7. కార్యాలయ - వాణిజ్యపదకోశము — 12-00
   R. వెంకటేశ్వరరావు
8. చైతన్యదీపాలు
   ఆమూరి వెంకటసీతారామమూర్తి — 20-00
9. మనోరథం — ద్విభాష్యం రాజేశ్వరరావు — 18 00
   (కథలు)

అడ్వాన్సు లేని ఆర్డర్లు అంగీకరింపబడవు.

పోస్టు ఖర్చులు అదనం

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ - 520 002.

వాళ్ళు పేపర్లో ఆ ఫోటోని చూసివుంటారని వాళ్ళు వూహించలేదు.

చాలా వేగంగా రియాక్టయి "అవును. ఎవరో దుండగులు హత్యచేశారు. ఒక ముఖ్యమయిన సమాచారం కోసం ఆతడి గదిని వెతకాలి" అన్నాడు చొక్కా పాంటులో దోపుకున్న మనిషి.

"గది తాళంవేసి వుంది."

"కీ వుందా?" బట్టతలవాడు అడిగాడు.

"లేదు. ఆయనే తీసుకెళ్ళాడు...."

"డూప్లికేట్ కీ లేదా?"

"ఉంది. కాని ఎక్కడుందో తెలీదు. వెతకాలి." అన్నాడు మేనేజర్ మళ్ళీ వాచీ చూసుకుని.

"ఫర్వాలేదు. తాళాల్ని కీ లేకుండా తెరవటం మాకు తెలుసు...." అంటూ మళ్ళీ ఇద్దరూ మెట్లెక్కటం మొదలుపెట్టారు.

"పదండి....మేం కూడా వస్తున్నాం" అని లేచి నిలబడ్డాడు మేనేజరు.

ఆ మనుషులకు మండిపోయింది. మేనేజర్ ప్రవర్తన వాళ్ళకు అంతుబట్టలేదు. జైన్ ఇచ్చిన వార్నింగ్ వాళ్ళ గుండెల్లో అలారంలాగా మోగుతోంది ప్రతిక్షణం.... డెబ్బయ్యైదు లక్షల రూపాయలను వినాయక్ ఎక్కడో దాచివుంటాడని – అక్కడే రహస్యాలున్న కేసెట్ కూడా ఉంటుందనీ చెప్పాడాయన. పడిన కష్టానికి రిజల్టు కనబడి వినాయక్ బసచేసిన లాడ్జి అడ్రసు దొరికింది. కాని ఆ గదిలోకి వెళ్ళనీయకుండా మేనేజర్ అడ్డుపడుతున్నాడు.

"మీ రెందుకు! మీ రక్కడే వుండండి....మీరు రాకూడదు. ఇది క్రయింబ్రాంచ్ వ్యవహారం ..."

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-6-'88 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '88 నెల సంచికలో ప్రకటిస్తాము.

ఏప్రెల్ '88 పోటీ ఫలితాలు

(1) ఏప్రెల్ '88 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మోహనాంగి చూపులే తూటాలు!
యుద్ధానికి ఎందుకు తంటాలు!!

పంపినవారు: శ్రీ కె. వి. మధుసూదనరావు, 1-21-21. గాంధేయులవీధి, కొండయ్యపాలెం, కాకినాడ-533003.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

అత్యాచారానికి ప్రతిఘటన!
ఆటవికుల ప్రతిస్పందన!!

పంపినవారు: శ్రీ జె.ఎస్.ఆర్. మూర్తి, ప్రసాద్ స్టూడియోస్, మద్రాసు-93.

"పోలీసులు రావొచ్చునా సార్" మేనేజరు చాలా మామూలుగా అడిగాడు.

"పోలీసులా? వాళ్ళెందుకు?" కంగారుపడుతూ అడిగాడు నల్లగీతల షర్టువాడు.

"హత్య చెయ్యబడిన మనిషి వాళ్ళకూ కూడా కావలసినవాడేగదా....వాళ్ళు కూడా వస్తారు ...నేనే ఫోన్ చేసి చెప్పాను" అన్నాడు మేనేజరు చిరునవ్వుతో.

"యూ ఫూల్!" కోపంగా అరిచాడు బట్టతలవాడు.

మెట్లమీదనే నిలబడి చిందులువేశాడు రెండోవాడు. వాళ్ళిద్దరికీ ఏం చెయ్యటానికి అర్థం కాలేదు. గదితాళం పగలగొట్టి లోపల వెతికే అవకాశం వున్నట్టుగా కనబళ్ళేదు. పోలీసులకు ఫోన్‌చేసి ఎంతసేపయ్యిందో? గదిలోకి వెళ్ళగానే పోలీసులు వస్తే దొరికిపోతారు. పోలీసులకు దొరికితే ప్రాణాలు పోయినట్టే ...

మేనేజరు వాళ్ళ మాటలు నమ్మలేదని వాళ్ళకి తెలిసిపోయింది.

కాని వినాయక్ గదిలో ఉన్న వస్తువులను సోదా చెయ్యకుండా వెళితే జైన్ కాల్చి చంపుతాడనే భయం ఉంది.

నిముషాలు గడుస్తున్నాయి.

"ఏమిటీ ఆగిపోయారు?...." అన్నాడు మేనేజరు నవ్వుతూనే.

వాళ్ళు యెందుకు ఆగిపోయారో, వాళ్ళు ఆలోచిస్తున్నదేమిటో మేనేజర్‌కి అర్థమయ్యింది.

ఇదంతా అక్కడే ఉన్న రూం కుర్రాళ్ళకు అర్థం కాలేదు.

వాళ్ళిద్దరూ యేం చెయ్యాలో నిర్ణయించుకునేలోపలే


ఆధునిక సాహిత్య విక్రయంలో అపూర్వ విప్లవం!
బాలభారతి & వి.వి.ఎన్.ఎంటర్‌ప్రైజెస్ వారు తమ స్వంత భవనం "బాలభారతి భవన్" లోకి మారిన సందర్భంలో ఏజెంట్లకు, హోంలైబ్రరీ వారికి కలుగజేస్తున్న గొప్ప అవకాశం
మీ అభిమాన ప్రఖ్యాత రచయితల డిటెక్టివ్, మిస్టరీ, జానపద నవలలు!!
రూ 250/- విలువచేసే నవలలు
రూ 100/- లకు మాత్రమే!
ఈ అవకాశం 1-1-88 నుండి 30-4-88 వరకు మాత్రమే!
వివరాలకు: వి.వి.ఎన్.ఎంటర్‌ప్రైజెస్
(బాలభారతి భవన్) 21.A రంగరాజపురం మెయిన్‌రోడ్డు
కోడంబాక్కం, మద్రాసు-600024

వేగంగా వచ్చి లాడ్జి ముందు ఆగినాయి రెండు పోలీసు జీపులు.

అందులోనించి యస్.పి. నాయక్, నలుగురు పోలీసులు ఆఫీసర్లు....కొంతమంది పోలీసులు దూకినట్టుగా దిగి లోపలకు వచ్చారు.

పోలీసులను చూస్తూనే ఆ లావుపాటి నకిలీ క్రయిం బ్రాంచ్ మనుషులు మెట్లమీదనించి కిందకు పరిగెత్తే ప్రయత్నం చేశారు. కాని వాళ్ళ ప్రయత్నాన్ని మేనేజర్ ధైర్యంతో ఎదుర్కొన్నాడు. పరుగెత్తబోతున్నళ్ళకు అడ్డుపడి "ముందు వీళ్ళని పట్టుకోండిసార్" అంటూ పెద్దగా అరిచాడు.

వాళ్ళిద్దరూ మేనేజర్ని పక్కకు నెట్టేసి మళ్ళీ పరిగెత్తబోయారు.

వాళ్ళెంత గూండాలయినా అంతమంది పోలీసులను చూడగానే వాళ్ళ గుండె జారిపోయింది. ప్రాణాలు పోయినట్టు ఫీలయ్యారు.

మేనేజర్ని పక్కకు నెట్టగానే రూం బోయిస్ రివ్వున ముందుకు దూకి ఆ ఇద్దర్నీ గట్టిగా పట్టుకున్నారు.

యస్.పి. నాయక్ పోలీసులకు సైగచేశాడు, నలుగురు పోలీసులు ఆ ఇద్దర్ని పట్టుకుని వొడిసిపట్టుకుని "వీళ్లే కిరాయి గూండాలు దొరగారూ" అన్నారు.

(సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY 3-4-554 Narayanaguda, Hyderabad-500 029, and Printed at Kranti Press, Madras - 600 001.

Blank Page

Regd.no: H/HD-48
'PRABHAKAR'